www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 16-12-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 241 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి మ. 12.27 తదుపరి విదియ; నక్షత్రం: ఆర్ర్ద రా. 1.13 తదుపరి పునర్వసు; వర్జ్యం: ఉ. 10.20-11.52; దుర్ముహూర్తం: మ. 12.32-1.16, మ. 2.44-3.28; అమృతఘడియలు: మ. 3.40-5.12; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.41; సూర్యాస్తమయం: 5.39 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



దుబాయ్‌లో 'బంగారం చాయ్'

ధర రూ. 1.14 లక్షలు

కాఫీ అయితే రూ. 1.09 లక్షలు

ఆ హోటల్ భారతీయులదే

2

రోజుకు 16 గంటల ఉపవాసంతో..

నత్తనడకన జుత్తు పెరుగుదల!



ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌పై తాజా అధ్యయనాల్లో వెల్లడి

ఎలుకలు, 49 మంది యువతీ యువకులపై పరిశీలన

మూడు గ్రూపులుగా విడగొట్టి పర్యవేక్షణ

2



జాకీర్ హుస్సేన్ ఆరోగ్యం విషమం

2

హృద్రోగంతో అమెరికా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రఖ్యాత తబలా మ్యాస్ట్రో

ఆయన ఇక లేరంటూ వదంతులు

ఆ వార్తల్ని ఖండించిన కుటుంబసభ్యులు



ఈ వారమే జమిలి బిల్లు!

2

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న కేంద్రం

నేటి బిల్లుల జాబితాలో లేకపోవడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్న ఊహాగానాలు


పునరాలోచన లేదన్న బీజేపీ వర్గాలు

పార్టీల మద్దతు కూడగట్టేందుకు యత్నాలు

ఎన్నికలు ఎప్పుడనే దానిపై అస్పష్టత

పాస్‌పుస్తకాల నిండా జగన్ పెద్ద పెద్ద ఫొటోలు.. సర్వే రాళ్లపైనా ఆయన బొమ్మలు.. ఏదో తన ఆస్తి ఉచితంగా ఇచ్చినట్టు..! రైతుల గురించి ఏమాత్రం ఆలోచించలేదు. ఆర్భాటం కోసం జగన్ ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే రైతులకు ఇప్పుడు శాపంగా మారింది. జగన్ చేసిన నిర్వాకానికి జనం అష్టకష్టాలు పడుతున్నారు.

జగన్ ఫొటోల పిచ్చి కాసేపు పక్కన పెడితే.. రీ సర్వే అయినా సరిగా చేయించారా అంటే అదీ లేదు. వివాదాలు పరిష్కరించకపోగా కొత్త సమస్యలు తెచ్చిపెట్టారు. అంతా తప్పుల తడక. రికార్డులను గందరగోళం చేసేశారు. ఫలితంగా ఎంతోమంది రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకోలేని దుస్థితి. అత్యవసరాలకు భూములను అమ్ముకోలేని పరిస్థితి.



రాష్ట్రవ్యాప్తంగా 6700 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే చేశారు. రికార్డులు సరిగా లేని కారణంగా ఒక్క ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే 54,000 రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. కర్నూలు జిల్లాలోనూ ఇదే పరిస్థితి. అటు రైతులకు సమస్యలు. ఇటు రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో ప్రభుత్వ ఖజానాకూ నష్టం.

జగన్ పాపం రైతులకు శాపం

వెంటాడుతున్న రీసర్వే కష్టాలు

రుణాల రీషెడ్యూల్‌లో సమస్యలు.. భూముల క్రయవిక్రయాలకు బ్రేక్

నిలిచిపోయిన వేలాది రిజిస్ట్రేషన్లు

ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే 54 వేలు

ప్రభుత్వానికీ రూ.వేల కోట్లు నష్టం

ఒకటి కంటే ఎక్కువ సర్వే నంబర్లకు ఒకే ఎల్‌పీ కేటాయించిన అధికారులు

హద్దులు నిర్ణయించడంలో అవస్థలు

భూమి విలువ నిర్ధారణలో తేడాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారు చేసిన పాపాలు రైతులకు శాపంగా, కూటమి ప్రభుత్వానికి సంకటంగా మారాయి. నాడు నాలుగు దశల్లో 6,700 రెవెన్యూ గ్రామాల్లో అడ్డగోలుగా, హడావుడిగా చేసిన భూముల రీసర్వే ఎన్నో చిక్కులు తెచ్చిపెట్టింది. రైతులు గతంలో లేని కొత్త సమస్యలు ఎదుర్కొంటుండగా, వాటిని సరిదిద్దడం కూటమి ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. రుణాలు తీసుకోవడానికి, రీ షెడ్యూల్ చేయించుకోవడానికి రైతన్నలు నానా అవస్థలు పడుతున్నారు. రీసర్వే జరిగిన గ్రామాల్లో భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. భూములు అమ్ముకోవాలని భావించేవారు, ఇప్పటికే విక్రయించిన వారు రిజిస్ట్రేషన్లు జరక్క ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా భారీగా పడిపోయింది. ఫ్రీహోల్డ్ భూముల

మిగతా 11వ పేజీలో...

విభజన కంటే జగన్‌తోనే ఎక్కువ నష్టం



విజయవాడలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో పుస్తకావిష్కరణ చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు పార్థసారథి, నారాయణ, అచ్చెన్నాయుడు

జనం నెత్తిన చెయ్యిపెట్టి ఆస్తులు రాయించుకున్నారు

అమరావతిని, పోలవరాన్ని నాశనం చేశారు

ఐదేళ్లలో వైసీపీ లక్షల కోట్ల అప్పులు

ఇప్పుడు రాష్ట్రానికి అప్పు వచ్చే పరిస్థితి లేదు

త్వరలో పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ ఏర్పాటు

రాజధానిలో అమరజీవికి నిలువెత్తు విగ్రహం

మ్యూజియంగా శ్రీరాములు స్వగృహం

ఆయన స్వగ్రామం పడమటిపల్లె అభివృద్ధి

పొట్టి శ్రీరాములు వర్ధంతి సభలో సీఎం చంద్రబాబు

జగమంతా తన కుటుంబమే అనుకున్న అమరజీవి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నివాళి

కొంతమంది నేతలు స్వార్థంతో రాష్ట్రాన్ని నాశనం చేశారు. 3 రాజధానుల పేరుతో అమరావతిని, పోలవరాన్ని నాశనం చేశారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ లక్షల కోట్ల అప్పులు చేసింది. దీంతో ఇప్పుడు అప్పు పుట్టే పరిస్థితి లేదు. 15వ ఆర్థిక సంఘం కాల పరిమితి మరో రెండేళ్లు ఉంది. ఈ సంఘం ఇచ్చే ఐదేళ్ల నిధులను వైసీపీ ప్రభుత్వం ముందే డ్రా చేసేసింది.

- సీఎం చంద్రబాబు

విజయవాడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు దొంగబుద్ధితో వ్యవహరించి, దొంగ పనులు చేశారని సీఎం చంద్రబాబు విమర్శించారు. రాష్ట్రానికి విభజన వల్ల జరిగిన నష్టం కంటే 2019 నుంచి జగన్ పాలనలో జరిగిన నష్టమే ఎక్కువని అభిప్రాయపడ్డారు. జనం నెత్తిన చెయ్యి పెట్టి ఆస్తులు రాయించుకున్నారని విమర్శించారు. జాతి, సమాజం కోసం త్యాగాలు చేసిన వారితో పాటు నెత్తిపై చెయ్యి పెట్టే వాళ్లను, 2019-24 మధ్య పాలనను కూడా గుర్తుపెట్టుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం

మిగతా 11వ పేజీలో...

తినే మాంసంలో..



యాంటీబయాటిక్స్

చికెన్, మటన్, అన్నింటా.. ప్రతి కిలోకూ 114 మిల్లీ గ్రాములు

పశువుల్లో చిన్న జబ్బుకూ యాంటీబయాటిక్స్.. దాంతో యాంటీ-మైక్రోబయాల్ రెసిస్టెన్స్

ఆ మాంసం తినే మానవులపైనా ప్రభావం.. డెయిరీ ఉత్పత్తుల్లోనూ ప్రతికూలతలు

తాజా అధ్యయనంలో వెల్లడి.. 190 దేశాల్లో 2020లో పరిశోధన.. 30వ స్థానంలో భారత్

యాంటీబయాటిక్స్‌తో కోళ్లు, గొర్రెలు త్వరగా పెరుగుతాయనేది అపోహ: వైద్యులు

పోషకాల కోసం మాంసం అవసరమే.. పరిమితంగా తీసుకోవడం మంచిది: నిపుణులు



(హైదరాబాద్ - ఆంధ్రజ్యోతి)

మందులకు లొంగని సూక్ష్మజీవులు, బ్యాక్టీరియాలు మనుషులను వేధించుకుని తింటున్నాయి. యాంటీబయాటిక్స్ విషయంలోనూ రాటుదేలి.. మొండికేస్తున్నాయి. దీన్నే యాంటీ మైక్రోబయాల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) అంటారు. ఈ మధ్యకాలంలో ఏఎంఆర్‌పై చర్చలు తీవ్రంగా జరుగుతున్నాయి. అతిగా యాంటీబయాటిక్స్ తీసుకునేవారిలో ఈ పరిస్థితి ఉంటుంది. దీంతో.. కేంద్ర ప్రభుత్వం వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్ విక్రయించకూడదని ఫార్మసిస్టులకు ఆదేశాలిచ్చింది. అయితే.. తినే మాంసంలోనూ యాంటీబయాటిక్స్ అవశేషాలు ఉంటున్నాయని, ఈ పరిణామం మానవుల్లో రుగ్మతలకు కారణమవుతాయని తాజా అధ్యయనం హెచ్చరించింది. 190 దేశాల్లో 2020 సంవత్సరంలో ఈ పరిశోధన చేయగా.. మాంసంలో యాంటీబయాటిక్స్ ఆనవాళ్లున్న జాబితాలో భారత్ 30వ స్థానంలో ఉంది. అంటే.. సగటున ప్రతి కిలో మాంసంలో

మిగతా 12వ పేజీలో...

అల్లుడూ ఎలా ఉన్నావ్?



6

అల్లు అర్జున్‌కు చిరంజీవి పలకరింపు

సతీసమేతంగా చిరు ఇంటికి వెళ్లిన అర్జున్

అనంతరం నాగబాబు నివాసానికి కూడా



6

తప్పు నాదే.. క్షమించండి

సారీ చెప్పడం తప్ప మాట్లాడలేని స్థితిలో ఉన్నా

జర్నలిస్టు రంజిత్‌తో మోహన్‌బాబు

విష్ణుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి పరామర్శ

కుటుంబానికి అండగా ఉంటానని హామీ

జర్నలిస్టు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

పోలవరానికి మళ్లీ కళ

12

కార్మికులు, వాహనాల సందోహం

పనుల పూర్తి దిశగా బాబు అడుగులు

నేడు ప్రాజెక్టు ప్రాంతానికి సీఎం

పనుల కార్యాచరణ ప్రకటించే చాన్సు



పోలవరంలో డయాఫ్రం వాల్ నిర్మాణం కోసం గోదావరి నది అడుగుభాగం వరకు తవ్వకాలు జరిపేందుకు సిద్ధం చేసిన ట్రెంచ్ కట్టర్ యంత్రాలు

మళ్లీ భారీ వర్ష సూచన

3

రేపటి నుంచి మూడు రోజులు పలు జిల్లాల్లో..

నేడు అల్పపీడనం ఏర్పడే అవకాశం

రైతులు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచన

పెరిగిన చలి.. జి.మాడుగులలో 5.6 డిగ్రీలు



ఐసీయూలో జాకీర్ హుస్సేన్

ఆరోగ్యం విషమం


హృద్రోగంతో అమెరికా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రఖ్యాత తబలా మ్యాస్ట్రో

ఆయన ఇక లేరంటూ వదంతులు

ఆ వార్తల్ని ఖండించిన కుటుంబసభ్యులు, సన్నిహితులు

న్యూయార్క్, డిసెంబరు 15: ప్రపంచ ప్రఖ్యాత తబలా విద్వాంసుడు.. పద్మవిభూషణ్ పురస్కారగ్రహీత.. ఉస్తాద్ జాకీర్ హుస్సేన్ (73) ఆరోగ్యం విషమంగా ఉంది. అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న ఆయన రెండువారాలుగా అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఆయన పరిస్థితి విషమించిందని.. దీంతో వైద్యులు ఐసీయూలో ఉంచి చికిత్సచేస్తున్నారని జాకీర్‌హుస్సేన్ ఆప్తమిత్రుడు రాకేశ్ చౌరాసియా ఒక ప్రకటనలో తెలిపారు. అయితే.. జాకీర్ హుస్సేన్ ఇక లేరనే వదంతులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. కేంద్ర సమాచార, ప్రసారశాఖ సైతం.. జాకీర్ మృతిపట్ల సంతాపం తెలుపుతూ 'ఎక్స్'లో ట్వీట్ చేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికే పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సహా పలువురు ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, వివిధ పార్టీల నాయకులు కూడా 'ఎక్స్' వేదికగా ఆయనకు నివాళులర్పించారు. అయితే.. సోషల్ మీడియాలో వైరల్ అయిన జాకీర్ మృతి వార్తను నమ్మవద్దని.. ఆయన జీవించే ఉన్నారని, కాకపోతే ఆయన ఆరోగ్యపరిస్థితి విషమంగా ఉందని ఆయన సోదరి ఖుర్షీద్ ఔలియా, మేనల్లుడు అమీర్ తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జాకీర్ హుస్సేన్ ఆరోగ్యం కోసం అభిమానులందరూ ప్రార్థన చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. దీంతో కేంద్ర సమాచార, ప్రసార శాఖ తన ట్వీట్‌ను డిలీట్ చేసింది.

లోకం తీరు



ఈవీఎంలపై నమ్మకం లేకపోతే..
ఎన్నికల్లో పోటీ చేయొద్దు: ఒమర్ అబ్దుల్లా

న్యూఢిల్లీ, డిసెంబరు 15: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఈవీఎం)లపై నమ్మకం లేకపోతే పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయొద్దని జమ్మూ- కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. గెలిచినప్పుడు సంబరాలు చేసుకుని ఓడిపోయినప్పుడు మాత్రం ఈవీఎంలను నిందించడం సరికాదని తమ మిత్ర పక్షమైన కాంగ్రెస్‌పై ఆయన పరోక్షంగా విమర్శలు చేశారు. ఈ మేరకు పీటీఐకి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. "ఈవీఎంల ద్వారా వంద మందికి పైగా మీ పార్టీ అభ్యర్థులు ఎంపీలుగా గెలిచినప్పుడు సంబరాలు చేసుకుని, కొన్ని నెలల తర్వాత మరో ఎన్నికల్లో మీరు ఆశించిన స్థాయిలో సీట్లు రాకపోతే ఈవీఎంలను నిందించడం సరికాదు" అని అన్నారు. ఓటర్లు ఒక్కోసారి ఒక్కో వ్యక్తిని ఎన్నుకుంటారని, అందుకు తానే ఉదాహరణనని, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తనను తిరస్కరించారని, కొన్ని నెలల తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో తనను గెలిపించారని చెప్పారు. తాను మెషిన్‌లను ఎప్పుడూ తప్పుపట్టలేదని తెలిపారు.

మహా మంత్రివర్గ విస్తరణ..39 మంది ప్రమాణం

ముంబై, డిసెంబరు15: మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణ జరిగింది. బీజేపీ నుంచి 19, శివసేన నుంచి 11, ఎన్సీపీ నుంచి 9 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. 33 ఏళ్ల విరామం తర్వాత తొలిసారి రాష్ట్ర రెండో రాజధాని నాగ్‌పూర్‌లోని రాజ్‌భవన్‌లో మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. సీఎం ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ శిండే, అజిత్ పవార్‌ల సమక్షంలో గవర్నర్ రాధాకృష్ణన్ మంత్రులతో ప్రమాణం చేయించారు. కాగా, మంత్రి పదవి రాకపోవడంతో శివసేన ఎమ్మెల్యే నరేశ్ భొండేకర్ పార్టీకి రాజీనామా చేశారు. భండారా-పావని నియోజకవర్గం నుంచి గెలిచిన నరేశ్ విదర్భలో కీలక నేత. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రి పదవిపై తనకు మాట ఇచ్చి తప్పారని నరేశ్ ఆరోపించారు.

గోదావరి.. జలసిరి!

- 129.17 బీసీఎం నీటి లభ్యతతో టాప్-3లో
- 86.32 బీసీఎంతో ఏడో స్థానంలో కృష్ణానది

న్యూఢిల్లీ, డిసెంబరు 15: నీటి లభ్యత విషయంలో గోదావరి నదీ పరీవాహక ప్రాంతం దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది. ఈ నదిలో వార్షిక నీటి లభ్యత 129.17 బిలియన్ క్యూబిక్ మీటర్లని కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) లెక్కలు వేసింది. 1985 నుంచి 2023 మధ్య దేశ సగటు వార్షిక నీటి లభ్యత 2,116.95 బీసీఎంగా ఉందని 'అసెస్‌మెంట్ ఆఫ్ వాటర్ రిసోర్సెస్ ఆఫ్ ఇండియా 2024' పేరుతో సీడబ్ల్యూసీ ఇటీవల చేపట్టిన అధ్యయనం వెల్లడించింది. ఈ జాబితాలో బ్రహ్మపుత్ర (592.32 బీసీఎం) మొదటి స్థానం, గంగా నది(581.75 బీసీఎం) రెండో స్థానంలో ఉన్నాయి. 86.32 బీసీఎంతో కృష్ణానది ఏడో స్థానంలో ఉంది. ఇక సబర్మతి (9.87 బీసీఎం), పెన్నా (10.42 బీసీఎం), మాహి (13.03 బీసీఎం) చివరి మూడు బేసిన్లుగా నిలిచాయి. సింధూ నదితో పాటు దాని ఉపనదులైన జీలం, చీనాబ్ మినహా దేశంలోని అన్ని నదీ పరీవాహక ప్రాంతాల్లో ఈ అధ్యయనం చేపట్టారు. 1985 నుంచి 2015 వరకూ దేశంలో నీటి లభ్యత 1,992.2 బీసీఎంగా గత సర్వే పేర్కొంది. 1901-03లో చేపట్టిన తొలి అంచనాల ప్రకారం ఇది 1,443.2 బీసీఎం మాత్రమే.

దేశంలోనే తొలి డయాబెటిస్ బయోబ్యాంక్

న్యూఢిల్లీ, డిసెంబరు 15: భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) దేశంలోనే తొలి డయాబెటిస్ బయోబ్యాంక్‌ను చెన్నైలో ఏర్పాటు చేసింది. శాస్త్రీయ పరిశోధనల నిమిత్తం మద్రాస్ డయాబెటిస్ రిసెర్చ్ ఫౌండేషన్ (ఎండీఆర్ఎఫ్) సహకారంతో దీన్ని ప్రారంభించింది. శాస్త్రీయ అధ్యయనాలకు ఉపయోగపడే జీవ నమూనాలను సేకరించడం, వాటిని ప్రాసెస్ చేయడం, నిల్వ చేయడం, పంపిణీ చేయడం ఈ బయోబ్యాంక్ లక్ష్యం. మధుమేహానికి కారణాలు, భారతీయుల్లో ఎక్కువగా వచ్చే వైవిధ్యాలు, వాటి ద్వారా వచ్చే రుగ్మతలపై అధునాతన పరిశోధనలకు ఈ బయోబ్యాంక్ దోహదపడుతుందని వైద్యులు తెలిపారు. ఈ బయోబ్యాంకులో ఐసీఎంఆర్ నిధులతో నడిచే రెండు సంస్థలతోపాటు.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి శాంపిళ్లను సేకరించి వాటిపై పరిశోధనలు చేస్తారు.

దావూద్ అనుచరుడు డానిష్ మర్చెంట్ అరెస్టు

ముంబయి, డిసెంబరు 15: మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ దావూద్ ఇబ్రహీం అనుచరుడైన డానిష్ మర్చెంట్ అలియాస్ డానిష్ చిక్నాను ముంబయి పోలీసులు అరెస్టు చేశారు. ముంబయిలోని డోంగ్రీ ప్రాంతంలో దావూద్ ఇబ్రహీంకు చెందిన మాదకద్రవ్యాల వ్యాపారాలను ఇతడే చూసుకుంటున్నాడు. నవంబరు 8న మెరైన్ లైన్స్ వద్ద 144 గ్రాముల మత్తు పదార్థాలను కలిగి ఉన్న మహమ్మద్ ఆషికుర్ సహిదూర్ రహ్మాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు రెహాన్ షకీల్ అన్సారీని అదుపులోకి తీసుకున్నారు. అన్సారీని విచారించగా తాను డ్రగ్స్‌ను డానిష్ మర్చెంట్, ఖాదిర్ నుంచి కొనుగోలు చేసినట్టు చెప్పాడు. దాని ఆధారంగా సోదాలు జరిపి డానిష్ మర్చెంట్‌ను అరెస్టు చేశారు.

అమెరికాలో యూఎఫ్‌వోల కలకలం



న్యూ జెర్సీలో శనివారం రాత్రి కనిపించిన అంతరిక్ష వాహనాలు

ట్రెన్టన్, డిసెంబరు 15: హాలీవుడ్ సినిమాల తరహాలో.. అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రంలో పలు కౌంటీల్లో పదే పదే కనిపిస్తున్న మానవ రహిత గగనతల వాహనాలు (యూఏవీ) స్థానికుల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతున్నాయి! నవంబరు 18 నుంచి తరచుగా కనిపిస్తున్న ఈ యూఏవీలు.. అమెరికా సైన్యం పరీక్షిస్తున్న డ్రోన్లా? విమానాలా? లేక గ్రహాంతరవాసులకు చెందిన గుర్తుతెలియని ఎగిరే వస్తువులా(యూఎఫ్‌వో)?.. ఏ విషయం తెలియక ప్రజలు కంగారు పడుతున్నారు! తాజాగా ఓషన్ కౌంటీకి చెందిన ఒక అధికారి.. అట్లాంటిక్ మహా సముద్రం వైపు నుంచి 50 యూఏవీలు వస్తున్న విషయాన్ని గుర్తించి పై అధికారులను అప్రమత్తం చేశాడు. వెంటనే ఆ కౌంటీ షెరీఫ్ మైకేల్.. ఆ 50 డ్రోన్లలో ఒకదాన్ని అనుసరించడానికి 'ఇండస్ట్రియల్ గ్రేడ్' డ్రోన్‌ను ప్రయోగించారు. కానీ, ఆ యూఏవీ.. తాము పంపిన డ్రోన్‌ను చాలా సులభంగా, వేగంగా తప్పించుకుని వెళ్లిపోయిందని ఆయన తెలిపారు. ఈ యూఏవీలు ఏవీ సాధారణ డ్రోన్ల తరహాలో వేడిని విడుదల చేయట్లేదని ఆయన వివరించారు. అట్లాంటిక్ సముద్రం నుంచి వస్తున్న ఈ డ్రోన్ల గురించి ఆయన న్యూజెర్సీ రాష్ట్ర పోలీసులకు, ఎఫ్‌బీఐ అధికారులకు, తీర రక్షక దళానికి సమాచారం అందించగా.. 8 అడుగుల విస్తీర్ణం ఉన్న 13 డ్రోన్లు తమ నౌకల్లో ఒకదాన్ని అనుసరిస్తున్నట్టు తీర రక్షక దళం తెలిపింది. అయితే, ఆ ప్రాంతంలో పలు సైనిక స్థావరాలున్న నేపథ్యంలో.. అవి సైన్యం పరీక్షిస్తున్న గగనతల వాహనాలా? అనే సందేహం కూడా చాలా మందిలో ఉంది. ఒకవేళ ఈ యూఏవీలు అమెరికా సైన్యానికి చెందినవి కాకపోతే.. అది మరింత భయానకమైన విషయమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అవి ఇరాన్‌కు చెందిన మదర్ షిప్ నుంచి వస్తున్న డ్రోన్లని కొందరు.. చైనా డ్రోన్లని మరికొందరు.. సందేహాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో అలాంటిదేమీ లేదని పెంటగాన్ ఒక ప్రకటన ద్వారా తెలిపింది. ప్రజల భద్రతకు ఎలాంటి ప్రమాదమూ లేదని తెలిపింది. అవి సైన్యానికి చెందిన డ్రోన్లా కాదా అనే విషయం ఇప్పటికీ తేలకపోవడంతో.. దీనిపై సమాధానాలు కోరుతూ న్యూజెర్సీ గవర్నర్ బైడెన్‌కు లేఖ రాశారు.

ఢిల్లీపై సంఘ్ గురి

క్షేత్ర స్థాయిలో 50 వేల భేటీలు

- 'ఆప్' అవినీతిపై నేరుగా ప్రజల్లోకి
- ఢిల్లీ బీజేపీ శ్రేణుల్లో నూతనోత్తేజం





న్యూఢిల్లీ, డిసెంబరు 15: మహారాష్ట్రలో బీజేపీ-శిండే శివసేన-అజిత్‌పవార్ ఎన్సీపీతో కూడిన మహాయుతి కూటమి ఘనవిజయంలో కీలక భూమిక పోషించిన ఆర్ఎస్ఎస్ ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి సారించింది. బీజేపీ శ్రేణులను ఉత్తేజపరిచేందుకు క్షేత్ర స్థాయిలో కనీసం 50 వేల సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. గత నెల 23న మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు విడుదల కాగానే సంఘ్ శ్రేణులు ఢిల్లీలో దిగిపోయాయి. 70 స్థానాల అసెంబ్లీలో మొత్తం 13 వేల వరకు ఎన్నికల బూత్‌లు ఉన్నాయి. ప్రతి బూత్ స్థాయిలో ఆరెస్సెస్ శ్రేణులు చిన్న చిన్న గల్లీ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాయి. పాలక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వ అవినీతి, కుంభకోణాలు, నీరు, కరెంటు సమస్యలు, బంగ్లాదేశ్ చొరబాటుదారులకు ఆప్ హయాంలో రేషన్ కార్డులు ఇవ్వడం వంటి అంశాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. మహారాష్ట్ర లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీపై అసంతృప్తితో ఆర్ఎస్ఎస్ దూరంగా ఉండడంతో మహాయుతి ఘోరంగా దెబ్బతింది. దరిమిలా అత్యున్నత స్థాయిలో చర్చలు జరిగి.. తిరిగి ఉభయపక్షాలూ చేతులు కలిపాయి. దీంతో, మహాయుతి భారీ విజయాన్ని సాధించింది. ఈ క్రమంలో ఈ సారి ఎలాగైనా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలవడానికి సంఘ్ ఎత్తుగడలు వేస్తోంది. 1993 తర్వాత బీజేపీ ఇక్కడ గెలవలేదు. 1998, 2003, 09 ఎన్నికల్లో కాంగ్రెస్ వరుసగా నెగ్గింది. 2013 ఎన్నికల్లో 32 సీట్లతో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించినా.. హంగ్ ఏర్పడింది. కాంగ్రెస్ మద్దతుతో ఆప్ అధికారంలోకి వచ్చింది. అయితే తాను తెచ్చిన లోక్‌పాల్ బిల్లును ఇతర పార్టీలు సమర్థించకపోవడంతో కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారు. తర్వాత కేంద్రం రాష్ట్రపతి పాలన విధించింది. 2015 ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ 70 స్థానాలకుగాను 67 చోట్ల గెలిచింది. బీజేపీ మూడు సీట్లతో సరిపెట్టుకుంది. కాంగ్రెస్‌కు ఒక్కటీ దక్కలేదు. 2020 ఎన్నికల్లో ఆప్ 62, బీజేపీ 8 చోట్ల విజయం సాధించాయి. వరుసగా ఆరు అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన బీజేపీ.. ఈ సారి పాగా వేయాలని చూస్తోంది.

న్యూఢిల్లీలో కేజ్రీవాల్‌తో సందీప్ దీక్షిత్ ఢీ

ఆప్ అధినేత కేజ్రీవాల్‌పై న్యూఢిల్లీ నియోజకవర్గంలో మరోసారి షీలా దీక్షిత్ కుటుంబం బరిలోకి దిగుతోంది. మూడుసార్లు వరుసగా ఢిల్లీలో కాంగ్రెస్‌ను విజయపథంలో నడిపిన ఆమెపై ఇదే స్థానంలో 2013లో కేజ్రీవాల్ 26,500 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ విజయమే ఆయన్ను కీలక నేతను చేసింది. ఈసారి ఆమె కుమారుడు, మాజీ ఎంపీ సందీప్ దీక్షిత్‌ను కాంగ్రెస్ ఆయనపై పోటీకి దించుతోంది. 15 ఏళ్లపాటు షీలాదీక్షిత్ ఢిల్లీలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఇంకా ప్రజలకు గుర్తున్నాయని.. కేజ్రీవాల్‌ను ఓడించే సత్తా సందీప్‌కు ఉందని కాంగ్రెస్ వర్గాలు ధీమాగా చెబుతున్నాయి. బీజేపీ ఇంకా తన అభ్యర్థిని ప్రకటించలేదు. మాజీ సీఎం సాహిబ్‌సింగ్ వర్మ కుమారుడు, మాజీ ఎంపీ పర్వేశ్ వర్మ పేరు వినబడుతోంది. ఈ దఫా ఎన్నికల్లో అధిక శాతం ఓట్లు సాధించి పరువు నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తోంది.

కల్కాజీ నుంచి సీఎం ఆతిశీ పోటీ

38 మందితో ఆప్ తుది జాబితా విడుదల

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఆప్ ఆదివారం 38 మంది అభ్యర్థులతో తుది జాబితాను విడుదల చేసింది. సీఎం ఆతిశీ మళ్లీ కల్కాజీ నుంచి బరిలోకి దిగుతుండగా.. సౌరభ్ భరద్వాజ్ గ్రేటర్ కైలాస్ నుంచి, గోపాల్‌రాయ్-బాబర్‌పూర్, అమానతుల్లా ఖాన్-ఓఖ్లా, సత్యేంద్ర జైన్-షాకూర్ బస్తీ, రఘువీందర్ షోకీన్-నంగ్లోయ్, ముకేశ్‌కుమార్ అహ్లావత్-సుల్తాన్‌పూర్ మజ్రా, సంజీవ్ ఝా-బురారీ, అజేశ్ యాదవ్-బద్లీ, దుర్గేశ్ పాఠక్ రాజేందర్‌నగర్ నుంచి పోటీచేస్తారని కేజ్రీవాల్ ప్రకటించారు. 20 మంది సిటింగ్ ఎమ్మెల్యేలకు ఆప్ సీట్లు నిరాకరించింది. కస్తూర్బా నగర్‌లో ఎమ్మెల్యే మదన్‌లాల్ స్థానంలో బీజేపీ నుంచి ఆదివారం ఆప్‌లో చేరిన రమేశ్ పెహల్వాన్‌కు టికెట్ ఇచ్చారు. కాగా.. పూర్తి ఆత్మవిశ్వాసంతో మొత్తం 70 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను నిలిపినట్లు కేజ్రీవాల్ 'ఎక్స్'లో తెలిపారు. బీజేపీకి సీఎం అభ్యర్థే లేరని ఎద్దేవాచేశారు. 'ఆ పార్టీకి ఒక టీమ్ లేదు.. ప్రణాళిక లేదు.. ఢిల్లీపై ఒక విజనే లేదు. కేజ్రీవాల్‌ను తొలగించాలన్నదే దాని ఏకైక మిషన్' అని విమర్శించారు.

ఆయుధాలు వీడండి

- మీ పునరావాసం బాధ్యత మాది
- మావోయిస్టులకు అమిత్ షా పిలుపు



జగ్దల్‌పూర్, రాయ్‌పూర్(ఛత్తీస్‌గఢ్), డిసెంబరు 15 : ఆయుధాలు వీడి జన జీవన స్రవంతిలోకి రావాలని మావోయిస్టులకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. జగ్దల్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన "బస్తర్ ఒలింపిక్స్" క్రీడల కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఆయుధాలు వీడిన మావోయిస్టులకు పునరావాసం కల్పించే బాధ్యత తమదేనన్నారు. అంతకు ముందు రాయ్‌పూర్‌లోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్రపతి కలర్ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టుల సమస్యను 2026 మార్చి 31కల్లా నివారించేందుకు కట్టుబడి ఉన్నాయని చెప్పారు. ఆ రాష్ట్రంలో ఈ సమస్య నివారణ అయితే దేశమంతటా నివారణ అయినట్లేనన్నారు. మావోయిస్టు వ్యతిరేక పోరులో ఛత్తీస్‌గఢ్ పోలీసులు గడచిన ఏడాది కాలంగా గణనీయ విజయాలు సాధించారని పేర్కొన్నారు. 287 మంది మావోయిస్టులను నిర్మూలించారని, దాదాపు 1000 మందిని అరెస్టు చేశారని తెలిపారు. ఈ ఒక్క రాష్ట్రంలోనే 837 మంది మావోయిస్టులు లొంగిపోయారని చెప్పారు. 14 మంది అగ్రనేతలు హతమయ్యారని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో దేశవ్యాప్తంగా మావోయిస్టు ఉద్యమాన్ని అదుపు చేశామన్నారు. కాగా లొంగిపోయిన ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, అసోం రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులతో అమిత్‌షా జగ్దల్‌పూర్‌లో సమావేశమయ్యారు. వారు హింసను వీడి జన జీవన స్రవంతిలో కలిసినందుకు ఆనందం వ్యక్తం చేశారు.



బెంగళూరు టెకీ అతుల్ భార్య అరెస్టు

- అత్త, బావమరిది కూడా..

బెంగళూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అతుల్ సుభాష్ ఆత్మహత్య కేసులో అతడి భార్య నిఖిత, అత్త నిశా, బావమరిది అనురాగ్‌ను బెంగళూరు మారతహళ్లి పోలీసులు అరెస్టు చేశారు. అతుల్ సుభాష్ ఆత్మహత్యకు ప్రేరేపించారని వీరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వీరు... పోలీసులు వస్తారనే సమాచారంతో పరారై, వివిధ ప్రదేశాల్లో తలదాచుకోగా పోలీసులు గుర్తించారు. హర్యానాలోని గుర్‌గావ్‌లో నిఖితను, ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అత్త, బావమరిదిని అరెస్టు చేసినట్టు అధికారులు తెలిపారు. మరోవైపు, నిఖిత దగ్గర ఉన్న తమ మనవడిని అప్పగించాలని అతుల్ తండ్రి విజ్ఞప్తి చేశారు.

గంజాయి కోసం జైలర్‌పై ఖైదీ దాడి

ప్రాణాపాయస్థితిలో జైలర్..బెళగావిలో ఘటన

బెంగళూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గంజాయి కోసం ఓ ఖైదీ ఏకంగా జైలర్‌పైనే దాడి చేశాడు. కర్ణాటకలోని బెళగావిలో గల హిండలగా సెంట్రల్ జైలులో నాలుగురోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 11వ తేదీన జైలులో బ్యారక్‌ల తనిఖీకి అసిస్టెంట్ జైలర్ జీఆర్ కాంబళె వెళ్లారు. ఆ సమయంలో విచారణ ఖైదీ షామిద్ ఖురేష్ బ్యారక్‌లో గంజాయి ప్యాకెట్ కనిపించింది. దానిని అసిస్టెంట్ జైలర్ స్వాధీనం చేసుకోగా ఖైదీ గొడవపడ్డాడు. జైలర్‌ను చితకబాదాడు. తీవ్రంగా గాయపడిన ఆయనకు రహస్యంగా చికిత్స అందించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఆస్పత్రికి తరలించారు.

ఈ వారమే జమిలి బిల్లు!

- పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కేంద్రం
- నేటి బిల్లుల జాబితాలో లేకపోవడంతో కేంద్రం వెనక్కి తగ్గిందని ఊహాగానాలు



న్యూఢిల్లీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన జమిలి ఎన్నికల బిల్లును పార్లమెంట్‌లో ఈ వారమే ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్ ఈ బిల్లును ప్రవేశ పెట్టనున్నట్లు కేంద్ర వర్గాల ద్వారా తెలిసింది. లోక్‌సభకు, దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభలకు కలిపి ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రెండు బిల్లులకు గత గురువారం కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. కాగా, సోమవారమే జమిలి ఎన్నికల బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశ పెడతారనే ప్రచారం జరిగింది. కానీ, సోమవారం ప్రవేశ పెట్టనున్న బిల్లుల జాబితాలో జమిలి ఎన్నికల బిల్లు లేకపోవడంతో.. ఈ విషయంలో కేంద్రం వెనక్కి తగ్గిందనే ప్రచారం మొదలైంది. అయితే, ఈ ప్రచారాన్ని బీజేపీ వర్గాలు కొట్టిపారేశాయి. జమిలి ఎన్నికల విషయంలో వెనక్కి తగ్గేదేలేదని స్పష్టం చేశాయి. మంగళవారం గానీ, ఈ వారంలో గానీ బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి. కాగా, జమిలి ఎన్నికలకు సంబంధించి రెండు బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో మొదటిది.. లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు కాగా, రెండోది శాసనసభలున్న కేంద్ర పాలిత ప్రాంతాలకు ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు ఉద్దేశించిన సాధారణ బిల్లు. ఉభయ సభల్లో ఈ బిల్లులను ప్రవేశపెట్టి, వెంటనే జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపనున్నట్టు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈసారి కేవలం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలపైనే కేంద్రం దృష్టి సారించింది. పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల విషయంలో మాత్రం కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోలేదు. స్థానిక ఎన్నికలను తర్వాత దశలో పరిశీలించనున్నట్టు బీజేపీ వర్గాల ద్వారా తెలిసింది.

ప్రస్తుతానికి రెండు బిల్లులే..

జమిలి ఎన్నికల కోసం మొత్తం ఆరు బిల్లులు పెట్టాల్సి ఉండగా, ప్రస్తుతం రెండింటికే పరిమితం అవుతున్నారు. తొలి బిల్లులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 83 (పార్లమెంటు కాలపరిమితి), ఆర్టికల్ 172 (అసెంబ్లీ కాలపరిమితి)లను సవరిస్తారు. ఇందుకు ఉభయ సభల్లో మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు అవసరం ఉంటుంది. లోక్‌సభలో మూడింట రెండు వంతులు అంటే 361 మంది సభ్యుల మద్దతు కావాలి. కానీ, ఎన్డీయే కూటమి బలం 293 మాత్రమే. వైసీపీ, బీజేడీ, అన్నాడీఎంకే మద్దతు ఇచ్చినా 2/3 చేరుకోవడం అసాధ్యం. రాజ్యసభలోనూ 154 మంది ఎంపీల మద్దతు కావాలి. ఎన్డీయే బలం నామినేటెడ్ సభ్యులను కలుపుకొని 119 మాత్రమే. అంటే, ఉభయ సభల్లో బిల్లు నెగ్గడం అంత తేలికేమీ కాదు. అయితే, జమిలి బిల్లుపై వీలైనన్ని పార్టీల మద్దతు కూడగట్టుకునేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. అలాగే, జమిలి ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే విషయంలోనూ స్పష్టత లేదు. కానీ, ఎప్పుడు ఎన్నికలు జరిగినా దేశమంతా ఒకేసారి నిర్వహించాలని కేంద్రం ప్రయత్నిస్తోంది.

రాష్ట్రాలకు రూ.71,889 కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్రం వివిధ పద్దుల కింద రాష్ట్రాలకు రూ.71,889 కోట్ల నిధులు విడుదల చేసింది. 15వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు మంజూరు చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ ఆదివారం పేర్కొంది. జాతీయ విపత్తు ఉపశమన నిధి (ఎన్డీఎంఎఫ్), పోస్ట్-డెవల్యూషన్ రెవెన్యూ లోటు (పీడీఆర్డీ) గ్రాంట్, స్థానిక సంస్థలకు గ్రాంట్లు, ఎస్డీఆర్ఎఫ్, ఎస్డీఎంఎఫ్‌లలో కేంద్రం వాటా, ఎన్డీఆర్ఎఫ్ అదనపు సాయంలో భాగంగా కేంద్రం ఈ నిధులు విడుదల చేసింది. రెవెన్యూ లోటు పూడ్చడానికి పీడీఆర్డీ గ్రాంటు కింద రూ.18,362.25 కోట్లు, పట్టణ స్థానిక సంస్థలకు రూ.6,845 కోట్లు, గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.20,847.25 కోట్లు, ఆరోగ్య రంగం గ్రాంట్ కింద రూ.2,894.01 కోట్లు, ఎస్డీఆర్ఎఫ్, ఎస్డీఎంఎఫ్‌లలో కేంద్రం వాటా కింద వరుసగా రూ.15,823.20 కోట్లు, రూ.1,385.45 కోట్లను మంజూరు చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది.

దుబాయ్‌లో 'బంగారం చాయ్'

ధర రూ.1.14 లక్షలు

- కాఫీ అయితే రూ.1.09 లక్షలు
- ఆ హోటల్ భారతీయులదే



దుబాయ్, డిసెంబరు 15: 'లక్షాధికారైన లవణం, అన్నమెగానీ మెరుగు బంగారంబు మింగబోడు'.. ఇదో సత్రికాలం నాటి మాట. ఇప్పుడు దుబాయ్ వెళ్తే నిజంగానే బంగారం తినొచ్చు. బంగారం కాఫీ, బంగారం టీ కూడా తాగొచ్చు. 'గోల్డ్ కడక్ టీ' 5000 దిర్హామ్‌లు (రూ1.14 లక్షలు) పలుకుతోంది. ఎమిరేట్స్ ఫైనాన్షియల్ టవర్స్‌లో ఏర్పాటు చేసిన బోహో కేఫ్‌లో ఇవన్నీ దొరుకుతాయి. దీని యజమాని సుచేత శర్మ అనే భారతీయ మూలాలు ఉన్న మహిళే. ఇక్కడ గోల్డ్ చాయ్ ఆర్డర్ చేస్తే.. దానిపై 24 క్యారెట్ల మేలిమి బంగారం పొడి చల్లి, వెండి కప్పుల్లో ఇస్తారు. దీంతోపాటుగా 'క్రోయిస్సాంట్' అనే ఫ్రెంచ్ వంటకాన్ని కూడా వెండి పళ్లెంలో ఇస్తారు. దీనిపైనా బంగారం పొడి చల్లుతారు. చివర్లో ఈ కప్పులు, పళ్లేలను వినియోగదారులు తీసుకెళ్లిపోవచ్చు. ఈ రాయల్ మెనూలో 'గోల్డ్ సావరిన్ కాఫీ' కూడా ఉంది. దీని ధర 4,761 దిర్హామ్‌లు (రూ.1.09 లక్షలు). దీన్ని కూడా వెండి కప్పుల్లో ఇస్తారు. ఆ కప్పులను కూడా ఇంటికి తీసుకెళ్లవచ్చు. ఇవి కాకుండా బంగారం ఐస్‌క్రీమ్‌లు, డ్రింకులు కూడా లభిస్తాయి. 'విలాసాలు కోరుకునే వారికి ఏదైనా అసాధారణమైనది చేయాలనుకున్నాం. అందుకే వీటిని అందిస్తున్నాం' అని సుచేత శర్మ చెప్పారు. వీటితో పాటుగా అందరికీ అందుబాటులో ఉండే భారతీయ స్ట్రీట్ ఫుడ్ కూడా తమ హోటల్‌లో దొరుకుతుందని తెలిపారు.

రోజుకు 16 గంటల ఉపవాసంతో..
నత్తనడకన జుత్తు పెరుగుదల!

ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌పై తాజా అధ్యయనాల్లో వెల్లడి



న్యూఢిల్లీ, డిసెంబరు 15: ఇటీవలికాలంలో చాలా మంది బరువు తగ్గడానికి అనుసరిస్తున్న విధానం.. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ అంటే రోజుకు కేవలం 8 గంటలపాటు (సాధారణంగా మధ్యాహ్నం నుంచి రాత్రి దాకా) మాత్రమే ఏదైనా తిని, మిగతా 16 గంటలూ ఏమీ తినకుండా ఉండడం! ఈ తరహా ఉపవాసంతో శరీరంలో జీవక్రియల వేగం పెరిగి, బరువు తగ్గే మాట నిజమేగానీ.. జుత్తు పెరుగుదల వేగం కూడా తగ్గిపోతుందని రెండు తాజా అధ్యయనాల్లో వెల్లడైంది. చైనాకు చెందిన వెస్ట్‌లేక్ యూనివర్సిటీ శాస్త్రజ్ఞులు.. ఎలుకలపైన, 49 మంది ఆరోగ్యవంతులైన యువతీయువకులపై వేర్వేరుగా ఈ అధ్యయనాలు నిర్వహించారు. మొదటి అధ్యయనంలో భాగంగా వారు కొన్ని ఎలుకలను తీసుకుని వాటి శరీరంపై ఉన్న రోమాలను పూర్తిగా తొలగించారు. వాటిని మూడు గ్రూపులుగా విడగొట్టి కొన్నిటికి రోజులో 24 గంటలూ ఆహారం దొరికే ఏర్పాటు చేశారు. కొన్ని ఎలుకలకు మాత్రం రోజుకు 8 గంటలపాటు మాత్రమే ఆహారం ఇచ్చారు. మూడో గ్రూపునకు రోజు విడిచి రోజు తిండి పెట్టారు. వీటిలో మొదటి గ్రూపు ఎలుకలకు 30 రోజులకల్లా జుత్తు తిరిగి రాగా.. రెండు, మూడు గ్రూపుల్లోని ఎలుకలకు జుత్తు పాక్షికంగా తిరిగి రావడానికి 96 రోజులు పట్టింది. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ విధానాన్ని అనుసరించడం వల్ల కలిగే ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను 2, 3 రకం గ్రూపుల్లోని ఎలుకల రోమకూప మూలకణాలు (హెయిర్ ఫాలికల్ స్టెమ్‌సెల్స్) తట్టుకోలేకపోవడమే ఇందుకు కారణమని వారు విశ్లేషించారు. అలాగే, 49 మంది ఆరోగ్యవంతులైన యువతీయువకులపై కూడా వారు ఇదే తరహా ప్రయోగం చేశారు. వారిలో కొందరికి రోజులో 6 గంటలపాటు మాత్రమే ఆహారం ఇచ్చారు. 18 గంటల ఉపవాసం చేయించారు. మామూలుగా ఆహారం తీసుకునేవారితో పోలిస్తే.. వీరిలో జుత్తు పెరుగుదల వేగం 18 శాతం మందగించినట్టు వారి అధ్యయనంలో వెల్లడైంది. దీన్ని నిర్ధారించుకోవడానికి ఎక్కువ మందితో ట్రయల్స్ నిర్వహించాల్సి ఉందని వారు పేర్కొన్నారు. అయితే.. ఎలుకలతో పోలిస్తే మనుషుల్లో జీవక్రియల వేగం కొద్దిగా తక్కువగా ఉంటుందని, జుత్తు పెరిగే విధానం కూడా భిన్నంగా ఉంటుందని ఈ అధ్యయనంలో పాలుపంచుకున్న బింగ్ ఝాంగ్ తెలిపారు.

ప్రకాశం జిల్లా మద్దిపాడుకు చెందిన ఒక లబ్ధిదారు పీఎంఏవై అర్బన్ పథకం కింద ఇల్లు నిర్మించుకుంటున్నారు. గత అక్టోబరులో ఆ ఇంటికి శ్లాబు పూర్తవడంతో ఆన్‌లైన్లో నమోదు చేశారు. అంతే.. వెంటనే లబ్ధిదారు స్కీమ్ ఖాతా నుంచి రూ.5,750లు కట్ అయ్యాయి. ఆరా తీస్తే.. ఆ ఇంటి విద్యుదీకరణ కోసం ఎలక్ట్రికల్ అప్లయెన్సెస్ పేరుతో ఆ నగదు కట్ చేసినట్లు తెలిసింది. దీంతో అతడు తనకు నచ్చినట్లుగా ఇంటికి విద్యుదీకరణ ఏర్పాటు చేసుకునే అవకాశం కోల్పోయాడు. పైపెచ్చు ఎక్కువ మొత్తంలో నగదు కట్ అయింది!

బాపట్ల జిల్లా మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామంలో మరో లబ్ధిదారుకూ ఇదే అనుభవం ఎదురయింది. అసలు ఎలాంటి వైర్లు వేస్తారు? వాటి నాణ్యత, మన్నిక ఎలా ఉంటుంది? అనేదానితో సంబంధం లేకుండా, అతడికి తెలియకుండానే నగదు రూ. 5,750 కట్ అయింది. దీంతో అతడూ ఆందోళనకు దిగాడు. రాష్ట్రమంతటా ఇదే పద్ధతిలో లబ్ధిదారుల అభీష్టం, ఆకాంక్షలతో సంబంధం లేకుండా ఇండెంట్లు ఇచ్చేసి గృహనిర్మాణ శాఖ ఇష్టానుసారం వ్యవహరిస్తోంది. దీంతో హౌసింగ్ శాఖ తీరుపై లబ్ధిదారుల్లో ఆందోళన ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ఇళ్ల నిర్మాణం ఇష్టారాజ్యం!

బీఎల్‌సీ విధానానికి, లబ్ధిదారుల ప్రయోజనాలకు తూట్లు


- పీఎంఏవైలోనూ అదే పద్ధతిలో నిర్మాణాలు
- లబ్ధిదారుల ప్రమేయం లేకుండానే విద్యుత్ పరికరాల కొనుగోళ్లు
- రాష్ట్రమంతటా ఇదే తీరులో ఇండెంట్లు
- ముందుగా నగదు కట్.. ఆ తర్వాతే ప్రపోజల్స్
- కాంట్రాక్టర్ల స్వప్రయోజనాలకు పెద్దపీట
- గృహనిర్మాణశాఖ తీరుపై లబ్ధిదారుల గుస్సా
- ప్రభుత్వం మారినా తీరు మారదా అంటూ ఆగ్రహం

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు లబ్ధిదారులకు గృహ రుణాలు, రాయితీలు ఇవ్వడానికే పరిమితమైన గృహ నిర్మాణ శాఖ, కాంట్రాక్టర్ల ద్వారా నిర్మించే కార్యక్రమం చేపట్టి లబ్ధిదారులకు నష్టం చేస్తోంది. లబ్ధిదారుల ఆకాంక్షలు, ప్రయోజనాలకు భిన్నంగా తన కార్యకలాపాలు సాగిస్తోంది. కాంట్రాక్టు పద్ధతిలో నాణ్యత లేని ఇళ్లను నిర్మించడంతోపాటు, లబ్ధిదారుల ప్రమేయం లేకుండా కాంట్రాక్టు సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరించేలా స్వేచ్ఛను ఇచ్చేసింది. దీంతో వారు పనిముట్ల పేరుతో ఇష్టారాజ్యంగా దోచేస్తున్నారు. లబ్ధిదారులకు తెలియకుండానే వారి గృహ నిర్మాణ ఖాతా నుంచి నిధులు కట్ చేసుకుని, ఆ తర్వాత లబ్ధిదారుల తరఫున ప్రపోజల్స్ పంపమని కోరుతున్నారు. ఈ మొత్తం వ్యవహారం గృహ నిర్మాణ శాఖ కమిషనరేట్ స్థాయిలో జరుగుతుండడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

బెనిఫిషరీ లెడ్ కన్‌స్ట్రక్షన్ ఎక్కడ?

గృహ నిర్మాణ శాఖ తొలి నుంచి లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకునే విధానానికి శ్రీకారం చుట్టింది. ఆ విధానంలో లబ్ధిదారు తన అభిరుచికి అనుగుణంగా ఇల్లు కట్టుకునే



కరెంటు పరికరాల కోసం కట్ చేసిన నగదు..

వెసులుబాటు ఉంటుంది. ఖర్చు తగ్గించుకునేలా నచ్చిన చోట సామగ్రి కొనుక్కునే అవకాశమూ ఉంటుంది. దీంతో ప్రభుత్వాలు బెనిఫిషరీ లెడ్ కన్‌స్ట్రక్షన్(బీఎల్‌సీ) విధానాన్నే అమలు చేస్తాయి. తొలిగా పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టిన ఎన్టీఆర్ ఈ విధానాన్నే అమలు చేస్తూ వచ్చారు. అయితే ఇటీవల కాలంలో ఈ విధానానికి గృహనిర్మాణ శాఖ తూట్లు పొడుస్తోంది. పత్యామ్నాయంగా తామే ఇళ్లు కట్టించి ఇచ్చే పద్ధతులను ప్రభుత్వాలు ముందుకు తెస్తున్నాయి. ఈ పద్ధతిలో లబ్ధిదారులు అనేక విధాలుగా నష్టపోతున్నారని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు.

అక్రమాలకు హౌసింగ్ సహకారం

లబ్ధిదారు ఇల్లు కట్టుకోగానే వివిధ దశల్లో ప్రభుత్వ సహాయం అందుతూ ఉంటుంది. అలా వచ్చే నగదును కాంట్రాక్టర్లు లబ్ధిదారులకు తెలియకుండానే కట్ చేసుకుంటున్నారు. శ్లాబ్ పూర్తయిన వెంటనే వాటి వివరాలు ఆన్‌లైన్లో నమోదవుతాయి. అలా నమోదైన వెంటనే లబ్ధిదారుల హౌసింగ్ ఖాతా నుంచి రూ. 5,750 రూపాయలు కట్ అయిపోతున్నాయి. ఇది రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ స్థాయిలోనే జరుగుతోందని తెలుస్తోంది. తొలుత శ్లాబ్ పూర్తయిన లబ్ధిదారుల ఖాతాల నుంచి నగదు కట్ అయిన తర్వాత జిల్లా కార్యాలయాల నుంచి విద్యుత్ ప్రపోజల్స్ పంపించాలని రాష్ట్ర కార్యాలయ అధికారులు కోరుతున్నారు. అంటే లబ్ధిదారులతో ఏమాత్రం సంబంధం లేకుండా ఇలా నగదు కట్ అయిపోతోంది. కాగా, ప్రభుత్వమే నిర్మించి ఇచ్చే ఇళ్ల నాణ్యత కనీస ప్రమాణాలను కూడా అందుకోలేకపోతోందన్న విమర్శలు ఉన్నాయి.



జగనన్న కాలనీలతో స్వరూపం మారిన హౌసింగ్

గత వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. లబ్ధిదారుడే నేరుగా ఇల్లు నిర్మించుకోవడం ఒక పద్ధతి కాగా, ఇందులో ప్రభుత్వం నిధులను దశలవారీగా ఇస్తుంది. రెండోది ఇంటికి అయ్యే మెటీరియల్ ఖర్చును సబ్సిడీతో అందిస్తుంది. మూడో పద్ధతిలో పూర్తిగా ప్రభుత్వమే ఇల్లు కట్టిస్తుంది. బీఎల్‌సీ విధానం ప్రాతిపదికగా ఉన్న తొలి ఆప్షన్‌ను ఎవరూ ఎంచుకోలేదు. చౌకగా సామగ్రి వస్తుందన్న ఆశతో రెండోది ఎంచుకున్న వారు కొందరైతే, ప్రభుత్వం ఇచ్చే రూ.లక్షా 80 వేలతో ఇల్లు కట్టుకోలేమని, మూడో ఆప్షన్‌ను ఎంచుకున్నారు. ఈ రెండు ఆప్షన్లలో లబ్ధిదారు నుంచి అంగీకార పత్రం తీసుకుని కాంట్రాక్టర్లే నిర్మాణాన్ని చేపడుతున్నారు. నిబంధనలపై అవగాహనలేని లబ్ధిదారులు సంతకాలు చేశారు.

ప్రభుత్వం మారింది.. విధానం మారాలి!

గత ప్రభుత్వ విధానాలతో విసిగిపోయిన ప్రజలు ఆ ప్రభుత్వానికి స్వస్తి చెప్పారు. ప్రస్తుత కూటమి సర్కార్ కూడా ఆ విధానాలనే కొనసాగించడం పట్ల లబ్ధిదారుల్లో అసంతృప్తి కనిపిస్తోంది. గృహనిర్మాణ లబ్ధి కూడా కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4 లక్షలకు పెరిగింది. తద్వారా దోపిడీ పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కనుక బీఎల్‌సీకి ప్రాధాన్యమిచ్చి లబ్ధిదారు తనకు నచ్చిన పద్ధతిలో ఇల్లు కట్టుకునే అవకాశం కల్పించాలని ఇంజనీరింగ్ నిపుణులు సూచిస్తున్నారు.

నగదు కట్ చేసేసి.. మీటర్లు కూడా కొనుక్కోమంటున్నారు!

విద్యుత్ మీటర్ల పేరుతో నగదు కట్ చేస్తున్నారన్న విషయంపై బాధిత లబ్ధిదారులను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా, ఈ విషయమే తమకు తెలియదని, మమ్మల్నే మీటర్లు కొనుక్కోవాలని అధికారులు చెబుతున్నారని వాపోయారు. ఎందుకు కట్ అవుతుందో తెలియదుగానీ నగదు రావాల్సిన ప్రతిసారీ కొంత కోత పడుతోందని, అదేమని అడిగితే అధికారులు ఏదో కొన్నామని చెప్పి తప్పించుకుంటున్నారని చెప్పారు.

లబ్ధిదారులు వద్దంటే నగదు వెనక్కి ఇచ్చేస్తాం

విద్యుత్ ఉపకరణాల పేరుతో కట్ అయిన మొత్తానికి తగిన విధంగా విద్యుత్ ఉపకరణాలు అందజేస్తాం. ఎల్ఈడీ లైట్లు, ఫ్యానులు, ఇతర పరికరాలు అందజేస్తాం. లబ్ధిదారు సమ్మతిస్తేనే పంపిణీ జరుగుతుంది. లేదంటే నగదు వెనక్కిచ్చే వెసులుబాటు కల్పిస్తామని ప్రభుత్వం చెబుతోంది. నగదు కట్ అయినవారు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

\- వెంకటేశ్వరరావు, హౌసింగ్ పీడీ, బాపట్ల

మా జిల్లా నుంచి ప్రపోజల్స్ పంపలేదు

విద్యుత్ ఉపకరణాల కింద నగదు కట్ అవుతున్నాయి. అది రాష్ట్ర ప్రధాన కార్యాలయం నుంచి జరుగుతోంది. వాళ్లే విద్యుత్ పరికరాలు పంపిస్తామని చెబుతున్నారు. ప్రకాశం జిల్లా నుంచి ఎంతమందికి కట్ అయింది.. ఎన్ని ప్రపోజల్స్ పంపించాలనే సమాచారం మాకు ఇంకా రాలేదు.

\- పెరుగు ప్రసాద్, హౌసింగ్ పీడీ, ప్రకాశం జిల్లా

స్కూల్ గేమ్స్ కరాటేలో ఏపీకి స్వర్ణం

- బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్‌లో పతకాలు
- జాతీయ స్కూల్ గేమ్స్‌లో సత్తాచాటిన ఏపీ క్రీడాకారులు

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో ఏపీ క్రీడాకారులు సత్తా చాటారు. కరాటేలో స్వర్ణ, కాంస్య పతకాలతోపాటు బ్యాడ్మింటన్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్‌లోనూ పతకాలు సాధించినట్లు పాఠశాల విద్యాశాఖ ఆదివారం తెలిపింది. ఈ నెల 9న ప్రారంభమైన స్కూల్ గేమ్స్ ఆదివారం ముగిశాయి. కరాటే అండర్-17 (66 కిలోల విభాగం)లో మన్నెపు వెంకట దినేష్ స్వర్ణం సాధించాచగా.. 45 కిలోల విభాగంలో జవంగుల కాశీ సాయిచంద్ర బార్గవ్ కాంస్యం గెలుపొందాడు. బ్యాడ్మింటన్ అండర్-14 బాలుర టీమ్ విభాగంలో సమ్మెట్ల హేమంత్, పి.రోషన్, డీవీ యజ్ఞనాథ్, వైతఈ అఖిల్ ప్రకాశ్, కాటం ఈశ్వర్ సాయి.. రజత పతకంతో మెరిశారు. బ్యాడ్మింటర్ అండర్-14 బాలికల టీమ్ విభాగంలో డీవీ యజ్ఞశ్రీ, ఇత్తంశెట్టి తన్వి, నాగిరెడ్డి సాహితీ, శ్రీరామ్ కావ్య, గూడూరు సుష్మారెడ్డి కూడా రజతం సాధించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో జి.మధు చందన (87 కిలోలు) రజత పతకం, కారంగి హేమశ్రీ (55 కిలోలు) కాంస్య పతకం, పి.ఆర్.రీనుమోల్ (71 కిలోలు) కాంస్య పతకం సాధించారు. బాక్సింగ్ 57-60 కిలోల విభాగంలో సిరివరకు మిహీర రజత పతకం, నెల్లి గణేష్ కాంస్య పతకం సాధించారు. విజేతలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అభినందించారు.


తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న శెట్టిబలిజ సంఘాల నేతలు

రాజమహేంద్రవరంలో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహావిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం లాలాచెరువు సెంటర్లో శెట్టిబలిజ జాతి పితామహుడు దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. రాత్రి జరిగిన వెన్నుదన్ను సభలో శెట్టిబలిజ అభివృద్ధి కార్పొరేషన్‌ చైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు, 15 మంది సభ్యులతో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం ప్రమాణం చేయించారు. సభలో మంత్రి సుభాష్, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు ప్రసంగించారు. శెట్టిబలిజ, గౌడ, శ్రీయన, ఈడిగ కులాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. గీత కులాల అభివృద్ధికి కార్పొరేషన్ కృషి చేయాలని పిలుపునిచ్చారు. జాతి ప్రయోజనాలను కాపాడతానని చైర్మన్ సత్తిబాబు హామీనిచ్చారు.

కేఆర్ నారాయణన్ కూడా కులవివక్ష బాధితుడే!

- మాజీ రాష్ట్రపతి ఓఎస్డీ, సామాజిక విశ్లేషకుడు ఎస్ఎన్ సాహు వెల్లడి
- దేశంలో కులగణన అవసరం ఉందని వ్యాఖ్య
- ముగిసిన మానవ హక్కుల వేదిక మహాసభలు



మానవహక్కుల వేదిక మహాసభల్లో మాట్లాడుతున్న ఎస్ఎన్ సాహు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ కూడా కులవివక్ష బాధితుడేనని సామాజిక విశ్లేషకుడు, ఆయన వద్ద ఓఎస్డీగా పనిచేసిన ఎస్ఎన్ సాహు పేర్కొన్నారు. అనంతపురంలో నిర్వహిస్తున్న ఉభయ తెలుగురాష్ట్రాల మానవ హక్కుల వేదిక 10వ మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ మహాసభల్లో ఎస్ఎన్ సాహు మాట్లాడుతూ సమాజంలో కులవివక్ష తీవ్రస్థాయిలో ఉందన్నారు. ప్రభుత్వంలో పైస్థాయిలో ఉన్నవారిలోనూ కులవివక్ష బాధితులున్నారని, మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ కూడా ఇటువంటి వివక్ష బాధితుడేనని చెప్పారు. కుల వ్యవస్థ అనేది ఒక వ్యాధి అనీ, ఇది ఏ స్థాయిలో ఉందో తెలుసుకోడానికి కులగణన అవసరమని పేర్కొన్నారు. 'ప్రతి ప్రభుత్వం పశుగణన చేస్తోంది. అలాంటపుడు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కులగణన చేపట్టలేరా? ఈ మాత్రం అడిగే హక్కు కూడా లేదా?' అని ప్రశ్నించారు. అనంతరం మానవహక్కుల వేదిక ప్రచురణలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మానవహక్కుల వేదిక ఏపీ అధ్యక్షుడు జగన్నాథరావు, ప్రధాన కార్యదర్శి రాజేశ్, తెలంగాణ అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.తిరుపతయ్య, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, రచయిత కొప్పర్తి వెంకటరమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బూతుపురాణం

- బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై కేసు నమోదు

శ్రీకాళహస్తి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిపై ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. స్వర్ణముఖినది కరకట్టపై శనివారం నిర్మాణాలు తొలగించే పనులు చేపట్టారు. ఈ సందర్భంగా తన అనుచరులతో కలిసి మధుసూదన్‌రెడ్డి అక్కడికి చేరుకుని ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఎలా నిర్మాణాలు తొలగిస్తారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బూతు పదజాలంతో.. పత్రికల్లో రాయలేని భాషతో విరుచుకుపడ్డారు. ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కూడా అయింది. తమను అసభ్య పదజాలంతో దూషించారంటూ టౌన్ ప్లానింగ్ అధికారి శారద ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.


జస్టిస్ ఎన్వీ రమణ దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ అధికారులు

అహోబిలంలో జస్టిస్ ఎన్వీ రమణ

- సుదర్శన హోమంలో పాల్గొన్న దంపతులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహ స్వామిని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ముందుగా ఎగువ అహోబిలం చేరుకున్న ఎన్వీ రమణ దంపతులు శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహ స్వామి, లక్ష్మీదేవి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దిగువ అహోబిలంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామిని స్వామి వారి సన్నిధిలో శాస్త్రోక్తంగా నిర్వహించిన మహా సుదర్శనహోమంలో వారు పాల్గొన్నారు. రంగమండపంలో జస్టిస్ ఎన్వీ రమణ దంపతులకు ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామి చిత్రపటాలను అందజేశారు.

తిరుమలలో కార్తీక దీపోత్సవం


శ్రీవారి ఆలయంలో వెలుగుతున్న దీపాలు

తిరుమల, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం కార్తీక పౌర్ణమి దీపోత్సవం కన్నులపండువగా జరిగింది. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు పూర్తయ్యాక సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం నేపథ్యంలో పౌర్ణమిగరుడసేవను టీటీడీ రద్దు చేసింది.

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

- కుల గణన చేపట్టి రిజర్వేషన్లు పెంచాలి
- మాలల సింహగర్జనలో నేతల డిమాండ్

గుంటూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కుల జనగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌ను పెంచాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ జాతీయ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు శివారులో నిర్వహించిన మాలల సింహగర్జన సభకు పలువురు హాజరయ్యారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మునిమనవడు యశ్వంత్ అంబేడ్కర్ మాట్లాడుతూ వర్గీకరణతో ఎస్సీల్లోని ఉపకులాలను విచ్ఛిన్నానికి ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయన్నారు. జైభీమ్‌రావు భారత్ పార్టీ అధినేత జడ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వేసిన రాజీవ్‌మిశ్రా కమిషన్ రాజ్యాంగ విరుద్ధమైనదన్నారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ళ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్ల ఏర్పాటు పేరుతో ఎస్సీల విచ్ఛిన్నానికి కుట్ర చేశారని మండిపడ్డారు. వర్గీకరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. మాజీ ఎంపీ హర్షకుమార్ మాట్లాడుతూ దేశవ్యాప్త కుల జనగణన చేపట్టి రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్, తెలంగాణ ఎమ్మెల్యేలు జి.వివేక్, నాగరాజు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, గుంటూరు జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయ, మాజీ ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన హాజరై సంఘీభావం తెలిపారు.

కోస్తాకు భారీ వర్షాలు!

- రేపటి నుంచి మూడు రోజులు పలు జిల్లాల్లో..
- నేడు అల్పపీడనం ఏర్పడే చాన్స్
- మిగిలిన జిల్లాల్లోనూ వర్షాలు పడే అవకాశం


అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో దట్టంగా కురుస్తున్న మంచు

విశాఖపట్నం, పాడేరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దక్షిణ అండమాన్ సముద్రంలో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఆ తరువాత రెండు రోజుల్లో పశ్చిమ వాయవ్యంగా పయనించి మరింత బలపడే క్రమంలో తమిళనాడు తీరం దిశగా రానుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర తమిళనాడులో తీరం దాటితే కోస్తాపై ప్రభావం రెండు, మూడు రోజుల వరకు ఉంటుందని, దీనిపై సోమవారం నాటికి మరింత స్పష్టత వస్తుందని వాతావరణ నిపుణుడు ఒకరు తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో మంగళవారం నుంచి నుంచి గురువారం వరకు ప్రకాశం, నెల్లూరు, బుధ-గురువారాల్లో పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఇంకా 17 నుంచి 20వ తేదీ వరకు కోస్తాలో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్నారు. కోస్తా జిల్లాల్లో వరి, పత్తి, పొగాకు, ఇతర పంటలు సాగుచేస్తున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వరి కోతలను రెండు, మూడు రోజులపాటు వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోత కోసి పొలాల్లో ఉన్న వరి పనలను కుప్పలుగా వేసుకోవాలని సూచించారు.

పెరిగిన చలి..

మధ్యభారతం మీదుగా వస్తున్న చలి గాలుల ప్రభావంతో ఛత్తీస్‌గఢ్, దానికి ఆనుకుని ఒడిశా, ఉత్తరాంధ్ర జిల్లాలు, తెలంగాణకు ఆనుకుని కోస్తా ప్రాంతాల్లో చలి మరింత పెరిగింది. అనేక ప్రాంతాల్లో మంచు కురిసింది. ఆదివారం విశాఖ ఏజెన్సీలోని జి.మాడుగులలో 5.6, కుంతలంలో 5.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జి.మాడుగులలో ఈ ఏడాది నమోదైన అత్యల్ప ఉష్ణోగ్రత ఇదే. శనివారం జి.మాడుగులలో 8.9 డిగ్రీలుండగా, ఒక్క రోజులో మూడు డిగ్రీలు తగ్గడం గమనార్హం. గత మూడు రోజులుగా ఏజెన్సీలో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

తిరుమలలో ప్రసాదాల నాణ్యత పెరిగింది

- భక్తులు ఇదే మాట చెబుతున్నారన్న మంత్రి సవిత


లేపాక్షిలో వస్త్రాలను చూస్తున్న మంత్రి సవిత

తిరుమల, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీవారి లడ్డూప్రసాదంతో పాటు అన్నప్రసాదాల నాణ్యత పెరిగింది. ప్రస్తుతం టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలు బాగున్నాయని భక్తులే నాకు చెప్పారు' అని బీసీ సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తాను దర్శనం చేసుకుని కొంతమంది భక్తులతో నేరుగా మాట్లాడానన్నారు. వారంతా సౌకర్యాలు, అన్నప్రసాదాలపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అనంతరం తిరుమలలోని లేపాక్షిని మంత్రి సందర్శించారు. విక్రయాలు, అందుబాటులో ఉన్న వస్తువులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఐదు నెలల్లో దాదాపు 50 శాతం అమ్మకాలు పెరిగాయని ఆమె మీడియాతో అన్నారు.

వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



వెన్నెల్లో ఒక అంతరంగ ప్రయాణం

భగవంతం 'లోయ చివరి రహస్యం' కథా సంపుటిలో 'చంద్రుడు గీసిన బొమ్మలు' కథ జ్ఞాపకాలు, ఊహాశక్తి, వెన్నెల రాత్రుల సున్నితమైన ఆకర్షణను పెనవేసుకున్న అందమైన, ఉత్తేజకరమైన అనుభవాన్ని చిత్రిస్తుంది. భగవంతం కథలు తరచుగా కాల్పనికతకి, వాస్తవికతకు మధ్యన ఉండే సరిహద్దులు చెరిపేస్తాయి. కాల్పనిక సాహిత్య నిర్వచనాలనే సవాలు చేస్తాయి.

గత రెండు దశాబ్దాలలో అత్యంత ప్రయోగాత్మకమైన కథలు రాసిన రచయితలలో ప్రముఖంగా చెప్పుకోవాల్సిన పేరు భగవంతం. అతను ఈ రెండు దశాబ్దాల కాలంలో లోతైన తాత్విక, అస్తిత్వ ప్రశ్నలను అన్వేషించే ప్రత్యేకమైన కథన రూపాన్ని సృష్టించుకున్నాడు. భావుకతకి, వాస్తవికతకి మధ్య విభజన రేఖలు చెరిపి, మానవ అనుభవానికి ఉండే అనేక పొరలను ఆవిష్కరించాడు. భగవంతం కథలు తరచుగా పాఠకులను వేరే ప్రపంచం లోకి తీసుకుపోతాయి. అక్కడ వాస్తవికతకు సంబంధించిన నియమాలకు విలువ లేదు. ఒక కొత్త మార్మిక వాస్తవికత పాఠకుల అనుభవంలోకి వస్తుంది. అతని కథలు తరచుగా స్పష్టమైన వ్యాఖ్యానానికి లొంగవు. పాఠకులను అస్పష్టతలో మిగుల్చుతాయి. కథలు క్లుప్తంగా ఉంటాయి, అయినప్పటికీ వాటిలో అనేక అర్థాల పొరలు నిండి ఉంటాయి.

భగవంతం పాత్రలు, ఎక్కువ సందర్భాలలో, విచిత్రమైన, అహేతుకమైన పరిస్థితులలో తమను తాము కనుగొంటాయి. ఈ పరిస్థితులు ఆధునిక ప్రపంచంలో జీవితం లోని దిక్కుతోచని, తరచుగా అర్థరహితమైన అంశాలను ప్రతిబింబిస్తాయి. సాహిత్యం, దృశ్య కళల మధ్య రేఖలను అస్పష్టం చేస్తూ తరచుగా తన రచనలో దృశ్యమాన అంశాలను చేర్చుతాడు. కొన్ని కథలు కొలాజ్ పెయింటింగ్స్‌లాగా ఉంటాయి. అతను మేధోపరంగా ఉత్తేజపరిచే, కళాత్మకంగా ఉల్లాసపరిచే, లోతుగా ప్రభావితం చేసే కథలను రాశాడు.

భగవంతం 'లోయ చివరి రహస్యం' కథా సంపుటిలో 'చంద్రుడు గీసిన బొమ్మలు' కథ జ్ఞాపకాలు, ఊహాశక్తి, వెన్నెల రాత్రుల సున్నితమైన ఆకర్షణను పెనవేసుకున్న అందమైన, ఉత్తేజకరమైన అనుభవాన్ని చిత్రిస్తుంది. పౌర్ణమి సృష్టించిన ప్రశాంతమైన, మార్మిక వాతావరణంలో లోతుగా లీనమైన కథకుడి ఆలోచనాత్మక ఏకాంతాన్ని ఇది అన్వేషిస్తుంది.

కథకుడు చాపపై పడుకుని, చంద్రుడిని చూస్తూ, తన చర్మంపై చల్లని గాలిని అనుభూతి చెందడంతో కథ మొదలవుతుంది. కథకుడి ఆలోచనలు జ్ఞాపకాల ద్వారా సాగిపోతున్నప్పుడు, ప్రశాంతమైన నేపథ్యం మిగిలిన కథకు టోన్ సెట్ చేస్తుంది. నెమ్మదిగా కదిలే, అందమైన అస్తిత్వంగా వర్ణించబడిన చంద్రుడు ఈ కథలో ప్రధాన పాత్రగా మారి, కథకుడి ఆలోచనలను, భావోద్వేగాలను ప్రభావితం చేస్తాడు.

కథకుడు బాల్యాన్ని గుర్తు చేసుకుంటుండగా, కథ విచిత్రమైన స్వరంతో సాగుతుంది. చంద్రకాంతిలో ఆట ఆడటం, పిల్లలు పేపర్‌పై ప్రశ్నలు రాసి ఆకుల కింద దాచి, వాటికి చంద్రుడు సమాధానం చెబుతాడనే ఆశతో ఎదురుచూడటం... ఆసక్తి, ఊహాశక్తితో నిండిన ఈ ఆట, కథకుడి వయస్సుకు సంబంధించిన దృక్పథానికి విరుద్ధంగా, కాలగమనాన్ని, అది తీసుకువచ్చే మార్పులను హైలైట్ చేస్తుంది.

ఈ కథ చంద్రుడిని గమనించిన మానవ అనుభవాన్ని స్పృశిస్తుంది. సోక్రటీస్, ప్లేటో, బుద్ధుడు, గాంధీ వంటి చారిత్రక వ్యక్తులను ప్రస్తావించి, వాళ్ళు ఒకే చంద్రుడిని చూస్తున్నప్పుడు వారి ఆలోచనలను ఊహిస్తాడు కథకుడు. ఈ ప్రతిఫలనం కొన్ని అనుభవాల, భావోద్వేగాల కాలాతీత స్వభావాన్ని నొక్కి చెబుతూ, వ్యక్తిగతాన్ని విశ్వజనీనానికి అనుసంధానిస్తుంది.

కథలో కవి గాలి నాసరరెడ్డితో కథకుడు జరిపే సంభాషణలు కథకు లోతును జోడిస్తాయి. హైకూల గురించి, చంద్రుడిపై కవితల గురించి వాళ్ళ సంభాషణ పరస్పర సృజనాత్మక స్ఫూర్తిని, కళాత్మక ప్రేరణను తెలియజేస్తుంది. లోతైన ఆలోచనలు, అనుభూతులు సహజంగా, ప్రాకృతిక ప్రపంచ సౌందర్యంతో ప్రభావితమవుతాయనే భావనను ఇవి నొక్కి చెబుతాయి.



'చంద్రుడు గీసిన బొమ్మలు' అద్భుత నైపుణ్యంతో రూపొందించబడిన కథ. ఇది వెన్నెల రాత్రుల దివ్య సౌందర్యం, అది ప్రేరేపించే అంతర్మథనం, ఆంతరంగిక ప్రయాణాలను చిత్రిస్తుంది. బాల్యంలోని అమాయకత్వాన్ని, నిరాడంబరతను హైలైట్ చేస్తూ వర్తమానాన్ని గతంతో కనెక్ట్ చేసే అంశం ఈ కథకు కీలకం. నిరంతరం మారుతూ ఉన్న ప్రపంచంలో నిరంతరత్వానికి ప్రతీకగా చంద్రుడు కనిపిస్తాడు. చంద్రునితో కథకుడి గాఢమైన బంధం కూడా ప్రాకృత ప్రపంచంలో ఉపశమనం, ఓదార్పు, ప్రేరణను కోరుకునే మానవ స్వభావానికి ప్రతీక.

పైన చెప్పుకున్నట్లుగా సోక్రటీస్, ప్లేటో, బుద్ధుడు, గాంధీ వంటి చారిత్రక వ్యక్తులను ప్రస్తావించడం ద్వారా, ఈ కథ వ్యక్తిగత అనుభవాలను విశ్వజనీన స్థాయికి తీసుకువెళుతుంది. కొన్ని భావాలు, ఆలోచనలు కాలానికి, సంస్కృతికి అతీతం అనే భావనను ఇది నొక్కి చెబుతుంది. వెన్నెల రాత్రి, చల్లని గాలి, ఆకుల చేసే ధ్వని గురించి చేసిన వర్ణనలు ఉన్నతమైన అనుభవ వాతావరణాన్ని సృష్టిస్తాయి. ఈ వాతావరణం పాఠకుడిని కథకుడి ప్రపంచంలో లీనం చేస్తుంది. కథకి భావోద్వేగాన్ని పెంచగలిగే శక్తినిస్తుంది.

గతం, వర్తమానం, జ్ఞాపకాలు వాస్తవికతను నిరాటంకంగా అంటిపెట్టుకునే విధంగా కథను తీర్చిదిద్దాడు భగవంతం. కథ ఒక ప్రశాంత దృశ్యాన్ని వర్ణించటంతో మొదలై క్రమంగా నాస్టాల్జిక్ జ్ఞాపకంగా మారుతుంది. ఈ కథా నిర్మాణం కథకుడి ఆలోచనల ద్రవత్వానికి (fluidity) అద్దం పడుతుంది. వివిధ కాలాలు, అనుభవాల మధ్య కదులుతూ ఒక ఉత్తేజకరమైన కథనాన్ని సృష్టిస్తుంది. సారాంశంలో 'చంద్రుడు గీసిన బొమ్మలు' ఒక బహుళ పొరలు ఉన్న కథ (layered story). దాని భావోద్వేగ, తాత్విక లోతు, దాని వ్యక్తీకరణ దానిని ఆకర్షణీయమైన, ఆలోచింపజేసే కథగా చేస్తుంది.

భగవంతం కథలు తరచుగా కాల్పనికతకి, వాస్తవికతకు మధ్యన ఉండే సరిహద్దులు చెరిపేస్తాయి. కాల్పనిక సాహిత్య నిర్వచనాలనే సవాలు చేస్తాయి. సమకాలీన పాశ్చాత్య ఆధునికానంతరవాద కథకుల కథన పద్ధతికి దగ్గరగా ఉంటాయి. శకలాలుగా ఉండే, open-endedగా ఉండే, సమకాలీన సంక్షోభాన్ని ప్రతిఫలించే, బహుముఖీన మానవ స్వభావాన్ని ప్రతిఫలించే కథలను భగవంతం రాశాడు. తనకి కల్పన కేవలం వాస్తవికతను ప్రతిబింబించకూడదు, దాని నిర్మాణ స్వభావాన్ని బహిర్గతం చేసే విధంగా ఉండాలి. ఇంకొక రకంగా చెప్పాలంటే, కథ అనేది పూర్తయిన ఉత్పాదనగా కాకుండా, ఒక process గా ఉండాలి.

భగవంతం ప్లాట్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన సాంప్రదాయిక విధానం నుంచి దూరంగా జరిగి తన కథనాన్ని స్పాంటేనియస్‌గా ఉండేటట్లు చూసుకుంటున్నాడు. నిర్మాణాత్మక కథాంశాన్ని అనుసరించే బదులు, అతని కథనం సహజంగా పరిణామం చెందుతుంది, అనూహ్యంగా ఉండే అతని కథన పద్ధతి పాఠకులకి గొప్ప అనుభవాన్ని ఇస్తుంది.

కథ అనేది రచయిత చైతన్యపు (consciousness) విస్తరణ అనే విధంగా భగవంతం కథలు ఉంటాయి. అతని కథల్లో రచయిత, కథకుడు మధ్య సరిహద్దు తరచుగా అస్పష్టంగా ఉంటుంది. కొన్ని చోట్ల రచయిత కథనం లోకి తనను తాను పాత్రగా చొప్పించుకున్నట్లుగా ఉంటుంది. కొన్నిచోట్ల రచయిత తన వైయక్తిక అనుభవాలను, ఆలోచనలను కథలోకి చొప్పించినట్లు అనిపిస్తుంది. తద్వారా, రచయిత కాల్పనిక సాహిత్యంలో వస్తుగతత్వం ఉంటుంది తప్ప, వైయక్తికాంశాలు కాదనే భావనను సవాలు చేస్తున్నట్టుగా అనిపిస్తుంది.

కథ లేక వాచకం యొక్క అర్థ నిర్మాణంలో పాఠకుడికి పాత్ర కల్పిస్తాడు భగవంతం. ఈ సందర్భంలో ప్రముఖ ఇటాలియన్ రచయిత ఉంబెర్తో ఎకో (Uberto Eco) మాటలు గమనించాలి: "A text is a machine for producing interpretations. The role of the reader is to decode and interpret the signs, to actively participate in the construction of meaning."

ఈ పద్ధతి పాఠకుడిని లోతైన స్థాయిలో కథనంలో నిమగ్నం చేయటం ద్వారా, కథ చెప్పే ప్రక్రియలో అంతర్భాగంగా చేస్తుంది.

వ్యక్తిగా భగవంతం ఆధునిక ప్రపంచ సంక్లిష్టతలను, అనిశ్చితులను లోతుగా గమనించాడు. అందువల్లనే వాటికి బలమైన కథారూపం ఇవ్వగలిగాడు. మారుతున్న సాంస్కృతిక సన్నివేశాలకు అతని కథలు ఒక దర్పణం. "The job of fiction is to find the truth inside the story's web of lies" అంటాడు స్టీఫెన్ కింగ్ తన రచన 'On Writing: A Memor of the Craft'లో. అంటే, కథ కనిపెట్టబడినది లేదా అబద్ధం ఐనప్పటికీ, అది మానవ అనుభవం గురించి, వాస్తవికత గురించి లోతైన సత్యాలను తెలియజేస్తుంది. ఈపై లక్షణాలన్నీ భగవంతం కథల విశిష్టతని తెలియజేస్తాయి.

■ బి. తిరుపతిరావు

అక్షరాల రెప్పల మాటున..

అక్షరాల పోగుల్ని అలా
చెంగులోకెత్తుకుంటానా..
నా చేతుల నిండా వాగులు కట్టిన తూరుపులు
నా చుట్టూ సంకెళ్లెరుగని
బంగరుపొద్దులతీవెలు

పుస్తకాన్నలా తడిమి తడిమి తిరగేస్తుంటానా...
మనవనుకున్న మనసులు చేతులు చాచి
ఎదురొచ్చే లోకాల చిరునామా ఏదో
చెప్పిపోయినంత సంబరం

పేజీలోంచి పేజీలోకి తలుపులు
చాచుకుంటూ పోతుంటానా...
పచ్చనిగాలిని ప్రసవించే పైరు అంచులమీద
ఆంధ్రనాట్యంలా హొయలు పోతుంటాయ్ నా అడుగులు

గుండెమీద జోకొట్టుకున్న పసిపిల్లాడిలా
పుస్తకాన్నలా పరచుకుని
ఒకపరి రెప్పల్ని ముడేసుకుంటానా
తోరణాలు కట్టిన తారకల వెనుక
మిసమిసలన్నిటినీ
తలకెత్తుకున్న కొత్త వాక్యాల పుట్టనే ఇక నేను

+++

మనసుపడ్డ పదాలపొత్తిని మరోపరి
కావిలించుకున్న వేళల్లో
చూపులకింద అరిగిపోయిన
ఆ మొదటి మోహలేఖను
వదిలిపోయిన గుండెకొమ్మ మీద జీవజలంగా
ఇంకోపరి పొంగులెత్తించుకున్నట్టే

కొత్త రేలపూలవనం చేతిలో వాలిన ప్రతిసారీ
పసిబిడ్డను ఈ చంక నుంచి ఆ చంకకు
ఆ చంక నుంచి ఈ చంకకు మార్చుకునే అమ్మనే,
ఆమె చీర కుచ్చిళ్ళలో దాక్కుని దాక్కుని
ముగ్గులై పొగిలిపోయే నిండునవ్వునే

+++

ఎక్కడెక్కడినుంచో వలసపక్షులై వచ్చి వాలిన
ఎన్నెన్నో ప్రపంచాలు నాలుగు గోడల ద్వీపకల్పంలో
ఎంత ఒద్దికగా సర్దుకు కూర్చున్నాయో..
యుగాల కల్పాల నుంచి ఇప్పటిదాకా పండిన
కాలాలకు, జీవితాలకు నన్నే వారసుణ్ణి చేసేశాయవి

పచ్చని పొలాల్లో పూలగుట్టల్లా
చుట్టూ పోగులుపడ్డ దీపపురాశుల మధ్య
కాలుమీద కాలేసుకుని నేలమీదలా పడుకుని
నిర్వాణినై అనంతపుటంచుల్ని నిమురుతున్న
నన్ను మించిన పైడిదొరను పట్టితేగలరా ఎవరైనా

+++

ఒక పుస్తకం
నాలోకి నదిలా చొరబడితే చాలు-
ఊపిరితిత్తుల నిండుగా అడవిగాలి మత్తులో నేను,
తామరపూల రేకుల్లాంటి పసికందు అరికాళ్ళతో
నా కళ్ళను దీవించుకుంటూ జాజిపూలలోకాల్లో నేను

ఎక్కడెక్కడి మనుషుల్ని, మట్టిపెళ్ళల్ని పెరుక్కొచ్చి
అది నన్నో నవ్యవ్యాకరణం చేసేస్తుంటే
అసలేమాత్రం మైలపడిపోకుండా నేను!

■ యార్లగడ్డ రాఘవేంద్రరావు
✆ 99854 11099

"వంద సందర్భాల నుంచి ఒక పాత్రను తీసుకుంటాను"

- మహి బెజవాడ



కవిత్వం రాయకుండా కవులమని చెప్పుకునే వాళ్ళ మధ్య కవిత్వం రాసి కథలని నమ్మిస్తున్న రచయిత మహి బెజవాడ. అన్వీక్షికీ పబ్లికేషన్ ద్వారా వెంకట్ శిద్దారెడ్డితో కలిసి అనేక పుస్తకాలు ప్రచురించినా, తన తొలి పుస్తకం 'గన్స్ & మాన్సూన్స్' కథా సంపుటిని మాత్రం నిమ్మళంగా తీసుకొస్తున్న ఈ రచయితతో ఈ సందర్భంగా సంభాషణ.

మీరు పబ్లిషర్ అయి ఉండి, ఎన్నో ఏళ్ళుగా కథలు రాసినా కూడా కథల పుస్తకం తీసుకురావటానికి ఇన్నాళ్ళు వెయిట్ చేయటానికి కారణం?

వెయిట్ చేయడం అన్నదేం లేదు. కథ రాయడమనేది అనిపిస్తే జరగాల్సిన ప్రక్రియ తప్పితే, ప్లాన్ చేసుకొని రేపొక కథ రాయాలీ ఎల్లుండి ఒక కథ రాయాలీ అని నాకు అనిపించదు. ఆ కథ నన్ను వెంటాడి, బలంగా చెప్పాలీ అనిపించినప్పుడు రాస్తాను. కథ ఎక్కువగా మగ్గాలి. ఆ కథలో చెప్పదల్చుకున్న దానికి తగ్గ కేరెక్టర్ దొరకాలి.

ఆ కేరెక్టర్ ఎక్కడ దొరుకుతుంది? పాత్రల్ని మీరు ఎక్కణ్ణుంచి తీసుకుంటారు?

కచ్చితంగా జీవితం నుంచే! నా కథల్లో పాత్రలేవీ నేను సృష్టించిన పాత్రలు కాదు, నా జీవితంలో ఉన్న పాత్రలే. వంద సందర్భాల నుంచి ఒక పాత్రను తీసుకుంటాను. వంద రకాల మనుషుల్ని స్టడీ చేసినప్పుడు వాళ్ళల్లో ఉండే ఒక్కొక్క క్వాలిటీ తీసుకొని కథలో పెట్టుకుంటాను. అప్పుడది నా పాత్ర అవుతుంది.

అంటే మీ కథల్లో పాత్రలన్నిటికీ ఆధారంగా నిజంగా మీకు తెలిసిన వ్యక్తులు ఉన్నారా?

వ్యక్తిగా ఒకరంటూ ఉండకపోవచ్చు. వేర్వేరు మనుషుల్లో వేర్వేరు క్వాలిటీలు తీసుకుని ఒక వ్యక్తిగా తయారు చేసుకుంటాను. ఖచ్చితంగా ఇవన్నీ జీవితం లోని సందర్భాల నుంచి తయారైన పాత్రలే కానీ, ఒక పాత్రకి ఒకరు ఆధారం అని చెప్పటానికి ఎవరూ ఉండరు.

మీ కథల్లో ఎక్కువమంది ఆర్టిస్ట్‌లే ప్రధాన పాత్రలుగా కనిపిస్తూ ఉంటారు ఎందుకు?

నా దృష్టిలో ఆర్టిస్ట్ అర్థం వేరు. చికెన్ షాపులో ముక్కలు కొట్టేవాళ్ళు, బేకరీలో కేక్ తయారు చేసేవాళ్ళు,

ప్లాన్ చేసుకొని రేపొక కథ రాయాలీ ఎల్లుండి ఒక కథ రాయాలీ అని నాకు అనిపించదు. ఆ కథ నన్ను వెంటాడి, బలంగా చెప్పాలీ అనిపించినప్పుడు రాస్తాను. కథ ఎక్కువగా మగ్గాలి. ఆ కథలో చెప్పదల్చుకున్న దానికి తగ్గ కేరెక్టర్ దొరకాలి.

ప్రతి ఒక్కరూ ఆర్టిస్ట్‌లే. ఇంట్లో అమ్మ అన్నం వండుతుంది కదా, తనూ ఆర్టిస్టే. ప్రతి ఒక్కరిలో ఆర్టిస్ట్ ఉంటాడు. నేను ప్రతి ఒక్కరిలో కళాకారుడ్ని చూస్తాను. వాళ్ళే నా కథల్లోకి వచ్చారు. అంతేగానీ కవి గురించో, పెయింటర్ గురించో, నటుడి గురించో అనుకోని రాసింది లేదు.

మీ ఒక్కో కథలో ఒక్కో జీవితం కనిపించే అంత స్పాన్ ఉంటుంది. ఈ కతల్ని ఆయా పాత్రల జీవిత చరిత్రలుగా చూడొచ్చా?

ఖచ్చితంగా చూడొచ్చు. డెఫినెట్‌గా నాకు ఆ స్పాన్‌లో రాయాలని ఉంది. అందుకే నేనెక్కువ లాంగ్ ప్రోజ్ రాస్తున్నానేమో. వి. చంద్రశేఖరరావు, జి. కళ్యాణ్ రావు లాంటి వాళ్లు రాసినవి చదివినప్పుడు ఆ స్పాన్‌లో రాద్దామని అనిపించింది.

'ద డెడ్ మూన్ ఈజ్ గోయింగ్ టు సింగ్', 'మెమొరీస్ ఆఫ్ మోనోలాగ్' కథల్లో ఆంగ్లో ఇండియన్స్‌నే ప్రధాన పాత్రలుగా తీసుకొని ఎందుకు రాయాలనిపించింది?

మార్జినలైజ్డ్ మనుషుల మీద ప్రేమ నాకు. ఆసక్తి కూడా. మెజార్టీ దేశంలో మైనార్టీ ఎలా ఆలోచిస్తుంది, వాళ్ళ అంతర్గత సంఘర్షణ ఎలా ఉంటుంది.. వీటిని క్యాప్చర్ చేయాలనుంటుంది.



ఈ కథల్లో ఆలోచనలు గమనిస్తే రచయిత లెఫ్టిస్ట్ అండ్ అంబేడ్కరిస్ట్ ఐడియాలజీతో ఉన్నట్టు అనిపిస్తుంది. మిమ్మల్ని పొలిటికల్ రైటర్‌గా భావించవచ్చా?

పొలిటిక్స్ అనేవి మన లైఫ్‌లో ఉంటాయి. పొలిటికల్ రైటర్స్ అంటూ ఉండరు. నేను పొలిటికల్ రైటరా అంటే, పొలిటికల్ రైటర్ కూడా! వెళ్ళి ధర్నాలు చేయకపోవచ్చు, భౌతికవాదాన్ని తీసుకొని రాయకపోవచ్చు. కానీ ఆ అంశాల మీద కథలు రాయాలని ఉంటుంది. అయితే నా శైలిలో నేను రాస్తాను.

ఇంటర్వ్యూ ■ గూండ్ల వెంకట నారాయణ



చిట్టి మాలక్ష్మికి కోటి దండాలు

చిట్టిది పాపాయిగా ఉన్నప్పుడు
బుల్లి పాదాలకు ఇష్టంగా చేయించిన
వెండి పట్టీలు
అవసరానికి ఆదుకునే దోస్తానం అవుతుందని
కలలో కూడా అనుకోలేదు.

వేళ కాని వేళకు
కష్టం సొమ్ము ఇంకా చేతికి అందనప్పుడు
ఇంట్లో
బియ్యపు గింజ కూడా కరువయినప్పుడు
మెతుకు కొరకు తల్లీ పిల్లల ఎదురుచూపు
పొయ్యి మీద మరుగుతున్న ఎసరయినప్పుడు
పేగులకుప్పకు నిప్పంటుకున్నట్టు
గుండె కింద ఆకలి సెగ
భగభగ మండుతున్నప్పుడు
పొగ చూరిన ఎలుక పిల్ల
కలుగులోంచి కాలు బయటపెట్టినట్టు
గడప దాటి అప్పు వేటకు బయలుదేరుతాను

తిరిగి తిరిగి కాళ్ళు అరిగిపోయి
ఒక్క కాసు కూడా దొరకని
గురి తప్పిన నిట్టూర్పు గీతం అయినప్పుడు
చిట్టి దాని పాదాల ముందు మోకరిల్లుతాను.

చుట్టం వచ్చినప్పుడు
పండుగ వచ్చినప్పుడు
గల్లాపెట్టె అలిగి కూర్చున్నప్పుడు
బుచ్చి పాదాల చిన్ని దేవత ముందు
దోసిలి పట్టి
ఆపద గట్టెక్కే వరములు పొందుతాను
లేత పాదాలు ఎదుగుతున్న కొద్దీ
వొళ్ళు చేసే చిట్టి దాని పట్టీల ముందు
తల వొంచుతాను

అడగ్గానే
కవచ కుండలాలు వొలిచి ఇచ్చినట్టు
చెవి కమ్మలు తీసి ఇచ్చిన
అమ్మ రొమ్ము పాలు తాగినందుకు
తల్లి గుణం నర నరాన పాకుతున్న
చిట్టి దాని ముందు ఇప్పటికీ చేయి చాపే
మొండి బిచ్చగాడిలా నేను.

■ గజ్జెల రామకృష్ణ
✆ 89774 12795

చిన్నయసూరి జీవితచరిత్రకారుడు



తెలుగు సాహిత్యంలో నన్నయ్య మొదలు సుమారు నాలుగు వందల మందికి పైగా కవులు, పండితుల జీవిత చరిత్రలు వెలుగు చూసాయి. బాలవ్యాకరణం, నీతిచంద్రికల రచయిత పరవస్తు చిన్నయసూరి జీవిత చరిత్ర మాత్రం వెలుగు చూడలేదు. చిన్నయసూరి చనిపోయిన తర్వాత వందేళ్ళు ఆలస్యంగానైనా ఆ చరిత్రను వెలుగు లోనికి తెచ్చింది వంగీపురం హరి నారాయణ దాసు. అయితే నేడు ఈ హరి నారాయణ దాసు ఎవరో కూడా చరిత్రకు అందని దాఖలా అయింది.

వంగీపురం హరి నారాయణ దాసు రాసిన చిన్నయసూరి జీవిత చరిత్రకు అందవలసిన ప్రాముఖ్యత, విశిష్టత తెలుగు సాహిత్యంలో లభించలేదు. ఈ గ్రంథ ప్రచురణ తర్వాత వంగీపురం హరి నారాయణ దాసు కూడా సాహిత్య చరిత్రలో నిలవలేదు. మానవల్లి రామకృష్ణ కవి, మధువాపంతుల సత్యనారాయణ శాస్త్రి, చిల్లర వెంకటేశ్వరకవి, వై. వెంకట రమణ కవి లాంటి అప్పటి పండితుల అభిమానం మాత్రం పొందగలిగారు.

చెన్నపట్నం సమీపంలోని పెరంబదూరులో చాత్తాద శ్రీవైష్ణవులు వెంకట రంగయ్య - శ్రీనివాసాంబ దంపతులకు జన్మించిన పరవస్తు చిన్నయ సూరిపై ఆయన శిష్యులు మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి కలిసి ప్రయత్నం చేసినా జీవిత రచన చేయలేకపోయారు. ఆ కార్యాన్ని వంగీపురం సాధించగలిగారు. సూరి జీవితాన్నే కాక వారి సాహిత్య కృషి, పాండిత్యం, ఆ కాలం నాటి పత్రికలు, ఆనాటి పరిస్థితులనుసైతం తన గ్రంథంలో వివరించడం వంగీపురం కృషికి నిదర్శనమని అప్పటి పండితులు సైతం అంగీకరించారు. 1862లో యాభై మూడేళ్ల చిన్న వయస్సులోనే చిన్నయ సూరి పరమపదించినా, ఆయనకు తెలిసిన పండితులు, మిత్రులను కలిసి, వారు రాసిన గ్రంథాలను పరిశోధించి చిన్నయసూరి జీవిత చరిత్రను వంగీపురం వెలుగులోకి తెచ్చారు. 1930లో ఆంధ్ర పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా పని చేస్తున్న చిన్నయ సూరి బంధువు ఒక్కపట్నం రామానుజయ్య లాంటి వారిని కలిశారు. నీతిచంద్రిక, బాలవ్యాకరణము, లక్షణగ్రంథములు, అనువాదములు, వ్యాసములు, కథలు, నిఘంటువులు, ఆంధ్ర ధాతుమాల, ఆంధ్ర శబ్దశాసనము వంటి ఎన్నో గ్రంథాలను సేకరించగలిగారు. అచ్చుకాని గ్రంథాలు కూడా కొన్నిటిని సేకరించారు. 1862లో చిన్నయసూరి మరణించినా 1951 వరకు వీటిలో కొన్ని గ్రంథాల ముద్రణ జరగలేదు. వివాదమైన ధాతుమాలను చిన్నయసూరే రచించారని నిరూపించటానికి వంగీపురం కాకినాడ సాహిత్య పరిషత్తు ద్వారా విశేష కృషి చేశారు. 1952లో వంగీపురం సమీప బంధువు సత్యనారాయణరావు ఈ పుస్తకాన్ని ముద్రించి వంగీపురం హరి నారాయణ దాసును సాహిత్య లోకానికి పరిచయం చేశారు. ఆయన ద్వారానే వంగీపురం నెల్లూరు పట్టణానికి చెందిన వ్యక్తి అనీ, పురాతనమైన నాలుగు కాళ్ల మండపం సంతపేట నివాసి అని తెలిసింది. వంగీపురం పెద్దలు చెన్నపట్నం వలస వెళ్లారని తెలుస్తుంది. తెలుగు భాష మీద, సాహిత్యం మీద మక్కువతో వంగీపురం విశేష కృషి చేసి వెలుగులోకి తెచ్చిన చిన్నయ్య సూరి జీవిత చరిత్ర మరుగున పడటం దురదృష్టమే.

■ ఈతకోట సుబ్బారావు
✆ 94405 29785

'పడమటి గాలి' నాటక ప్రదర్శన

పాటిబండ్ల ఆనందరావు రచనగా, పండు క్రియేషన్స్ కొప్పోలు వారి ఆధ్వర్యంలో 25ఏళ్ళుగా దేశం అంతటా 150 ప్రదర్శనలు జరుపుకున్న 'పడమట గాలి' నాటకం తాజా ప్రదర్శన డిసెంబర్ 16 సా.4.30గంటల నుంచి తిరుపతిలోని మహతి సభామందిరంలో జరుగుతుంది. ఐఎఎస్ అధికారి, టీటీడీ పూర్వ జె.ఇ.ఓ గుమ్మళ్ళ బలరామయ్య ప్రధాన పాత్రను పోషిస్తున్నారు.

తెలుగు భాషోద్యమ సమితి

ఎరుకల కథా సంపుటి 'ఏకలవ్య కాలనీ'

పర్‌స్పెక్టివ్స్ ప్రచురణగా వస్తున్న పలమనేరు బాలాజీ కథా సంపుటి 'ఏకలవ్య కాలనీ' ఆవిష్కరణ సభ డిసెంబర్ 17 సా.4 గంటలకు సాధి బుక్ స్టాల్, 9బి, బి బ్లాక్, 9th ఫ్లోర్, స్వామాట్ కాంప్లెక్స్, సైఫాబాద్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్తలు- రాగాల వెంకట రాహుల్, ఎన్. వేణుగోపాల్. సభ నిర్వహణ ఎ.కె. ప్రభాకర్. సభలో ఆర్‌కె, కె. శివారెడ్డి, చిన వీరభద్రుడు, యాకూబ్ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 94409 95010.

పలమనేరు రచయితల సంఘం

శీలా వీర్రాజు తెలుగు ఫాంట్

శీలా వీర్రాజు చేతి రాత ఆధారంగా రూపొందించిన తెలుగు ఫాంట్ ఆవిష్కరణ డిసెంబరు 21 సా.5.30గంటలకు రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఇదే సభలో శీలా సుభద్రాదేవి కవితా సంపుటి 'మాట్లాడటానికో మనిషి కావాలి' ఆవిష్కరణ కూడా జరుగుతుంది. సభలో నందిని సిధారెడ్డి, సుధామ, అమృతలత, పుప్పాల శ్రీరామ్, శీలా సుభద్రాదేవి పాల్గొంటారు

శీలావీ సాహిత్య చిత్రకళావేదిక

కవులూ కళాకారులతో కరచాలనం

వారాల ఆనంద్ 'కవులూ కళాకారులతో కరచాలనం' పుస్తకం ఆవిష్కరణ సభ డిసెంబర్ 21న కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ డిగ్రీ పీజీ కాలేజీలో జరుగుతుంది. ఆవిష్కర్త పూర్వ ప్రిన్సిపాల్ బి. రాంచందర్ రావు, తొలి కాపీ స్వీకర్త ప్రస్తుత ప్రిన్సిపాల్ కల్వకుంట రామకృష్ణ.

వి. ఇందిరా రాణి

ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డుల ప్రదానం

ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డుల ప్రదానోత్సవం డిసెంబర్ 22 ఉ.10గంటలకు అనంతపురం లోని ఎన్‌జీవో హోమ్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి వాడ్రేవు చినవీరభద్రుడు. ఉమ్మడిశెట్టి అవార్డును బండి సత్యనారాయణ, ఉమ్మడిశెట్టి సతీష్ కుమార్ యువ పురస్కారాన్ని మానస చామర్తి గారు స్వీకరిస్తారు. ఈ సందర్భంగా రాధేయ కవిత్వం 'అజేయుడు' ఆవిష్కరణ ఉంటుంది.

ఉమ్మడిశెట్టి రాధేయ



దాతలు ఇచ్చిన డ్రోన్లను చూపుతున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమా, వసంత కృష్ణప్రసాద్, నేత నాగుల్ మీరా

ఇక క్లౌడ్ పెట్రోలింగ్

జిల్లాలో త్వరలోనే అమలు

- సీఎస్ఆర్ కింద 24 డ్రోన్ల విరాళం
- ఒక్కో పీఎస్‌కు ఒక డ్రోన్ కేటాయింపు
- పీఎస్‌లకు డ్రోన్లు ఇవ్వడానికి ముందుకొచ్చిన ఎమ్మెల్యేలు
- పైలట్లుగా మహిళా పోలీసులు
- 500 మంది శిక్షణకు ప్రణాళికలు
- శిక్షణ పూర్తిచేసుకున్న 100 మహిళా కాప్స్

బహిరంగ ప్రదేశంలో నిలబడిన ఆ నలుగురు ఏం చేస్తున్నారు? పార్కులో మొక్కల మాటున ఆ ఇద్దరు ఎందుకు కూర్చున్నారు? కొద్దిరోజులుగా ఆ వాహనం ఇక్కడే ఎందుకు పార్క్ చేసి ఉంది? ఇలాంటి ప్రశ్నలకు ఇక డ్రోన్ సమాధానం ఇవ్వబోతున్నది. ఇప్పటికే ఈ-బీట్ విధానాన్ని అమలు చేసిన పోలీస్ అధికారులు కొత్తగా ఇక నుంచి క్లౌడ్ పెట్రోలింగ్‌ను నిర్వహించబోతున్నారు. ఇందులో భాగంగా డ్రోన్లతో ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని నేరాలు జరిగే ప్రాంతాల్లో గగన వీధుల నుంచి నిఘా పెట్టబోతున్నారు.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) ముఖ్యమంత్రి చంద్రబాబు ఐపీఎస్‌లతో నిర్వహించిన సమావేశాల్లో పోలీసులు కనిపించకుండా పోలీసింగ్ ఉండాలని పలు సందర్భాల్లో నొక్కిచెప్పారు. దీనికి అనుగుణంగా డ్రోన్ పోలీసింగ్‌కు రంగం సిద్ధం చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఒక డ్రోన్‌ను సమకూర్చాలని అధికారులు నిర్ణయించారు. ఒక డ్రోన్ 1000 సీసీ కెమెరాలతో సమానమని భావిస్తున్నారు. ఈ డ్రోన్లను ఆపరేట్ చేయడానికి మహిళా పోలీసులను ఉపయోగిస్తున్నారు. కమిషనరేట్‌లో మొత్తం 4,500 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వారిలో 500 మందిని డ్రోన్ పైలట్లుగా తయారు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే 100 మంది పోలీసు శాఖలోని మహిళా పోలీసులు, సచివాలయాల్లో మహిళా పోలీసులు శిక్షణ తీసుకున్నారు.

ముందుకొచ్చిన దాతలు



కుదరవెల్లి వెంకట నరసయ్యను అభినందిస్తున్న సీపీ, ఎంపీ

డ్రోన్ల కొనుగోలు చాలా వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. ఒక్కో డ్రోన్ ఖరీదు రూ.లక్షల్లో ఉంటుంది. ఈ నేపథ్యంలో విజయవాడ నగరంలో ఉన్న పలువురు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ కింద డ్రోన్లను అందజేయడానికి ముందుకు వచ్చారు. విజయవాడ పటమటలంకకు చెందిన కుదరవెల్లి వెంకట నరసయ్య మన జిల్లా - మన బాధ్యత అన్న నినాదంతో రెండు డ్రోన్లను సమకూర్చారు. ఈవిధంగా వివిధ ప్రముఖులు మొత్తం 24 డ్రోన్లను కమిషనరేట్‌కు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించారు. డ్రోన్లు అందజేసిన దాతలను సీపీ రాజశేఖరబాబు, ఎంపీ కేశినేని చిన్ని సత్కరించారు. ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాంగణంలో పోలీసులు మినీ డ్రోన్ షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, బొండా ఉమా, వసంత కృష్ణప్రసాద్ ప్రసంగించారు. టీడీపీ నేత నాగుల్‌మీరా, డీసీపీలు తిరుమలేశ్వరరెడ్డి, గౌతమీషాలి, కృష్ణమూర్తి నాయుడు, మహేశ్వరరాజు, ఏడీసీపీలు జి.రామకృష్ణ, ఎం.రాజారావు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మాజీ మంత్రి కొడాలి నాని మరోమారు నిలిచారు. గుడివాడ మండలం లింగవరంలో భారీ లేఅవుట్ ముసుగులో అటు అధికారులను, ఇటు ప్లాట్ల కొనుగోలుదారులను వంచించారు. 25 ఎకరాల లేఅవుట్లో పంచాయతీకి రిజర్వ్ స్థలం ఇవ్వకుండా మోసం చేశారు. ఐదెకరాల స్థలం పాఠశాలలకు కేటాయించినట్లు చూపి 2.5 ఎకరాల్లో దర్జాగా కళ్యాణ మండపం నిర్మించుకున్నారు. మరో 2.5 ఎకరాలు స్వాధీనంలో పెట్టుకున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్ధిదారులు అక్కడ ఇళ్లు నిర్మించుకోకుండా 22ఏలో పెట్టించి కుట్రలు చేస్తూ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నాని భూ మాయను చూసి ముక్కున వేలేసుకొంటున్నారు.

- ఆంధ్రజ్యోతి - గుడివాడ





పాఠశాలకు కేటాయించిన స్థలంలో నిర్మించిన కె కన్వెన్షన్ భవనం

లేఅవుట్ లోపలికి ఎవరూ రాకుండా గేటుకు వేసిన తాళం

భూ మాయ!

2011లో లింగవరంలో 25.44 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ ఏర్పాటు

- గ్రామ పంచాయతీకి రిజర్వు చేయాల్సిన పదిశాతం స్థలం ఆక్రమణ
- 2.5 ఎకరాల్లో కళ్యాణ మండపం నిర్మాణం • దీని విలువ రూ.7.5 కోట్లుపైనే..
- మరో రెండున్నర ఎకరాలు కబ్జా.. గతంలో క్యాసినో నిర్వహణ
- నేటికీ లేఅవుట్‌కు అనుమతి ఇవ్వని గ్రామ పంచాయతీ అధికారులు
- మంత్రిగా ఉన్న సమయంలో ఈ భూములు 22ఎ జాబితాలో చేరిక
- ఇళ్లు కట్టుకోవడానికి అవకాశం లేక ప్లాట్ల కొనుగోలుదారుల అవస్థలు

2011లో లేఅవుట్ ఏర్పాటు

గుడివాడ మండలం లింగవరం గ్రామ పంచాయతీ ఏరియాలో 2011లో మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) తనతో పాటు మరికొందరు స్థానికుల పేర్లతో సర్వే నంబర్లు 239/1బి, 2, 240/1బి, 3, 244/1, 2ఎ, 2బి, 3, 4, 5, 245/1, 2, 3, 246, 247/1, 2, 3లలో 25.44 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేశారు. స్థానిక లైసెన్స్‌డ్ సర్వేయర్‌తో లేఅవుట్ మ్యాప్‌ను తయారు చేయించి గ్రామ పంచాయతీకి సమర్పించారు. లేఅవుట్‌లో 10శాతం స్థలాన్ని పంచాయతీకి కేటాయించాల్సి ఉంది. అదే క్రమంలో లేఅవుట్ మ్యాప్‌లో చూపాల్సి ఉంది. అధికారం చేతిలో ఉండటంతో పాఠశాల స్థలంగా చూపి సర్వేయర్‌తో లేఅవుట్‌ను సిద్ధం చేయించారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉండటంతో అనుమతులిచ్చేందుకు పంచాయతీ అధికారులు నిరాకరించినట్టు సమాచారం. పంచాయతీలో సమర్పించిన అనధికార లేఅవుట్‌కు అనుమతి నిరాకరిస్తూ నేటికీ పంచాయతీ అధికారి సంతకం చేయకపోవడం విశేషం.

ఐదెకరాలను పాఠశాల స్థలంగా చూపి..

లేఅవుట్‌లో లింగవరం పంచాయతీకి రిజర్వు స్థలాన్ని ఇవ్వాల్సి ఉంది. కానీ లేఅవుట్‌లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో రెండు స్థలాలను పాఠశాల సైట్‌లుగా చూపారు. దీనిలో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో కె కన్వెన్షన్ పేరుతో భారీ కళ్యాణ మండపాన్ని నిర్మించారు. దీనికి కూడా పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు పొందలేదని, ఇది అక్రమ కట్టడమని అధికారులు పేర్కొంటున్నారు. పక్కనే చూపిన మరో స్థలంలోనే 2020 సంక్రాంతికి నాని భారీ స్థాయిలో క్యాసినో నిర్వహించినట్లు వైసీపీ నాయకులే బహిరంగంగా చెబుతున్నారు. రిజర్వు స్థలాన్ని చూపకపోవడం, కనీసం దాని స్థానంలో వేరే చోట ఎక్కడా కూడా స్థలాన్ని అప్పగించలేదని అధికారులు పేర్కొంటున్నారు.

ఐదేళ్ల పాటు పంచాయతీకి పన్ను నిల్

కె కన్వెన్షన్ కళ్యాణ మండపం నిర్మించిన నాటి నుంచి ఐదేళ్ల పాటు పంచాయతీకి ఎటువంటి పన్ను చెల్లించలేదు. 2020లో క్యాసినో నిర్వహణ తర్వాత భవిష్యత్ భద్రతా దళం వ్యవస్థాపకులు యలమంచిలి మురళీకృష్ణ పంచాయతీ అధికారులను వివరాలు అడగడంతో అప్పటి మంత్రి నానిలో చలనం వచ్చింది. గుట్టుచప్పుడు కాకుండా కళ్యాణ మండపానికి పన్ను వేయించి ఆనాటి నుంచి చెల్లిస్తున్నట్లు సమాచారం. ఎవరు రాకుండా బారికేడ్లు.. దారులన్నీ మూసివేత 25 ఎకరాలు అనధికార లేఅవుట్ కావడం, అధికారం కోల్పోవడంతో సదరు లేఅవుట్‌లోకి ఎవరు రాకుండా కొడాలి నాని ముందస్తుగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రధాన రహదారి నుంచి లోపలికి వెళ్లే అంతర్గత రహదారులను మూసి వేశారు. కొన్ని చోట్ల ఏర్పాటు చేసిన గేట్‌లకు తాళాలు వేశారు. లింగవరం గ్రామం వైపుగా బారికేడ్లు పెట్టి మూసేసారు.

నాలా కూడా చెల్లించలేదు!

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు వినియోగించాలంటే తప్పనిసరిగా ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాన్ని నాలా పన్నుగా చెల్లించాలి. ఎమ్మెల్యేగా తనకున్న అధికారాన్ని అడ్డుపెట్టుకుని నాని రెవెన్యూ శాఖకు చెల్లించాల్సిన మొత్తం చెల్లించలేదని తెలిసింది.

ఆందోళనలో ప్లాట్ల కొనుగోలుదారులు

లేఅవుట్‌లోని 100 ప్లాట్‌లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందుతున్నారు. అమ్మిన ప్లాట్‌లను స్వాధీనపరిచారు గానీ వాటిలో ఎటువంటి లావాదేవీలు నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని వాపోతున్నారు. ఆ స్థలాల్లో ఎడ్లు, కోడి పందేలు, పేకాట నిర్వహిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. మంత్రిగా ఉన్న సమయంలో సదరు సర్వే నంబర్‌లను నిషేధిత జాబితా 22ఎలో చేర్చడంతో ఇల్లు నిర్మించుకుందామన్నా వీలు పడటం లేదని ప్లాట్ల కొనుగోలుదారులు మందపాటి గోపాలస్వామి, మలిరెడ్డి దేవారెడ్డి, మేడేపల్లి జ్ఞానేసు తదితరులు తెలిపారు. నాని తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

స్థలం చూసుకోనివ్వకుండా అడ్డుకున్నారు

లింగవరంలోని కొడాలి నాని లేఅవుట్‌లో 400 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాను. నేటికీ స్థలం ఎక్కడా ఉందో చూపించలేదు. పలు మార్లు సర్వేయర్‌లకు స్థలం కొలతల నిమిత్తం అర్జీ పెట్టుకున్నా అధికారులు స్పందించలేదు. కనీసం లేఅవుట్‌లోకి వెళ్లి స్థలం చూసుకునే హక్కు కూడా లేకుండా నాని అనుచరులు అడ్డుకునేవారు. ఇటీవల ఆరా తీయగా సదరు లేఅవుట్‌లోని సర్వే నంబర్లు అన్నింటినీ నిషేధిత జాబితాలో చేర్చి ఉన్నట్లు అధికారులు తెలిపారు.

- మేడేపల్లి జ్ఞానేసు, శేరీదింటక్రురు, గుడివాడ మండలం

రాష్ట్ర సరిహద్దులో ధాన్యం లారీల నిలిపివేత



తెలంగాణా సరిహద్దులో నిలిచిపోయిన లారీలు

- గుంటూరు, తెనాలి, మచిలీపట్నం నుంచి తెలంగాణాకు ధాన్యం
- అడ్డుకుంటున్న విజిలెన్స్ అధికారులు

జగ్గయ్యపేట రూరల్, డిసెంబరు 15 : ఆంధ్ర నుంచి తెలంగాణాకు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీలను ఆ రాష్ట్ర సరిహద్దుల్లో విజిలెన్స్ అధికారులు ఆదివారం అడ్డుకుని నిలిపివేశారు. గుంటూరు, తెనాలి, మచిలీపట్నం తదితర ప్రాంతాల నుంచి ధాన్యం లోడు లారీలు జగ్గయ్యపేట మండలంలోని గంట్రాయి మీదుగా ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లభి మీదుగా తెలంగాణాలోకి వెళ్తున్నాయి. అక్కడి మార్కెటింగ్ శాఖాధికారులు వాహనాన్ని బట్టి రూ. 6 వేల వరకు రుసుం వసూలు చేస్తున్నారు. అయితే విజిలెన్స్ అధికారులు మాత్రం ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతుందని లారీలను వెనక్కు వెళ్లాలని చెబుతుండటంతో వాహనదారులు అయోమయంలో పడ్డారు. తెలంగాణాలో స్థిరపడిన ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారు తమ ప్రాంతాల్లో పండించిన ధాన్యాన్ని తెలంగాణాకు తరలించి విక్రయిస్తున్నారు. తెలంగాణాలో రైతులకు సన్న బియ్యానికి రూ. 500 బోనస్ ఇస్తుండటంతో ప్రతి ఒక్కరూ అక్కడకు తోలేందుకు మొగ్గు చూపుతున్నారు. ఆంధ్రలో రూ. 1700 నుంచి రూ. 1800 ధర పలుకుతుండగా, తెలంగాణాలో రూ.2,250గా ఉంది. అంతే కాకుండా ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుండటంతో రైతులు తమ ధాన్యాన్ని తెలంగాణాకు తరలిస్తున్నారు. గత రెండు, మూడు రోజులుగా వందలాది వాహనాలు వెళ్తున్నట్లు సమాచారం.

ఈస్ట్ బైపాస్‌కు మార్చిలో టెండర్లు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : విజయవాడ ఈస్ట్ బైపాస్ రోడ్డుకు మార్చిలో జాతీయ రహదారుల సంస్థ టెండర్లు పిలవనుంది. ఈస్ట్ బైపాస్‌కు సంబంధించి చైతన్య కన్సల్టెన్సీ ఇచ్చిన మూడు ఆప్షన్లలో రెండో ఆప్షన్ వైపే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా మొగ్గుచూపింది. దీనిపై సానుకూలంగా నిర్ణయం తీసుకోవాల్సిందిగా కేంద్రానికి కూడా నివేదించింది. కేంద్ర ప్రభుత్వం కూడా ఆప్షన్ - 2కే సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఆప్షన్ - 2లో భాగంగా కృష్ణా బ్రిడ్జి ఎక్కడ వస్తుంది? క్లోవర్ లీఫ్ జంక్షన్ ఎక్కడ ప్రతిపాదిస్తారన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఆప్షన్ - 2కు 291.06 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. నిర్మాణ ఖర్చు రూ.1,873 కోట్లుగా ఉంది. ఆప్షన్ - 1, 3 కంటే కూడా ఆప్షన్ - 2కు ఎక్కువ ఖర్చు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై సానుకూలంగా ఉండటంతో పాటు నిధుల సర్దుబాటు అంశాలపై దృష్టి పెట్టినట్టుగా తెలుస్తోంది. ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి టెండర్లకు శ్రీకారం చుట్టనున్నట్టు సమాచారం.

మావోయిస్టు నేత కార్తీక్ దాదా ఐదుగుళ్లపల్లి వాసే!

6లో

కేంద్రానికి మెట్రో

ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర ప్రభుత్వం



బెజవాడ మెట్రో రైలు ప్రాజెక్టు ప్రతిపాదన కేంద్రానికి చేరింది. మొదటి ఫేజ్‌లో బెజవాడ, రెండో ఫేజ్‌లో అమరావతిలను అనుసంధానం చేస్తూ ప్రతిపాదించిన మెట్రో డీపీఆర్‌కు ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నూరుశాతం ఖర్చును కేంద్రమే భరించనున్న ఈ ప్రాజెక్టు మరో మూడు నెలల్లో పట్టాలెక్కనుంది. పనులు కూడా వేగంగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

మరో మూడు నెలల్లో పట్టాలెక్కనున్న ప్రాజెక్టు

- మొదటి దశలో ఏలూరు, బందరు రోడ్డు కారిడార్లు
- శరవేగంగా పనులు చేపట్టే నిర్మాణ సంస్థలపై అధ్యయనం
- మెట్రో స్టేషన్లు, కోచ్ డిపోల కోసం పాత ప్రతిపాదనలోనే భూముల సేకరణ
- విజయవాడ ఎయిర్‌పోర్టు దగ్గర అండర్ గ్రౌండ్ మెట్రో పనులు
- నిడమానూరు నుంచి రామవరప్పాడు వరకు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : మెట్రో డీపీఆర్‌కు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపడంతో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు దీనికి సంబంధించిన సమగ్ర డీపీఆర్‌ను కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే ఖర్చును నూరు శాతం కేంద్రమే భరించాలని ప్రతిపాదించటంతో దీనిపై రెండు నెలల సమయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ముందు మౌఖికంగా అనుమతులు ఇచ్చి ముందుకు వెళ్లమని నిర్దేశించినా.. డీపీఆర్‌పై ఏమైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేసుకోవటానికి కేంద్రం మార్చి నెల వరకు సమయం తీసుకోవచ్చని తెలుస్తోంది. రాష్ట్ర విభజన నేపథ్యంలో బెజవాడకు మెట్రో ప్రాజెక్టు ప్రతిపాదనను గతంలో కేంద్ర ప్రభుత్వమే తీసుకు వచ్చింది. రాష్ట్ర విభజన చట్టంలో కూడా బెజవాడ మెట్రోకు పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని స్పష్టం చేసింది. గతంలో మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం 20 శాతం, రాష్ట్రం 20 శాతం వాటాగా భరించాలని, మిగిలిన 60 శాతం రుణం ద్వారా ప్రాజెక్టును చేపట్టాలన్న విధానంలో కేంద్రం వ్యవహరించింది. ప్రస్తుతం నూరు శాతం కేంద్రం భరించాలని ప్రతిపాదించటం వల్ల అధికారికంగా అనుమతులు ఇవ్వటానికి మూడు నెలల సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు (పీఐబీ)లో దీనిపై చర్చించిన మీదట తుది అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది.

గత యాక్షన్ ప్లాన్‌కు అనుగుణంగానే ప్రక్రియ

కేంద్రానికి ప్రతిపాదన అందిన నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వంలో నిర్దేశించుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారమే వెళ్లేందుకు ఏపీఎంఆర్‌సీఎల్ నిర్ణయించింది. మొదటి ఫేజ్‌లో గన్నవరం నుంచి ఏలూరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు 25.95 కిలోమీటర్లు, అలాగే పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు 12.45 కిలోమీటర్ల మేర రెండు కారిడార్లను ఎలివేటెడ్ విధానంలో చేపట్టవలసి ఉంది. ఈ రెండు కారిడార్లకు సంబంధించి 30కి పైగా మెట్రో స్టేషన్లను నిర్మించేందుకు భూముల అవసరం ఉంది. కోచ్ డిపో నిర్మాణానికి భూములు కావాల్సి ఉంది. మెట్రో ప్రధాన స్టేషన్‌ను పీఎన్‌బీఎస్ దగ్గర ఏర్పాటు చేస్తారు. వీటన్నింటికీ కలిపి భూములను గతంలో నిర్దేశించుకున్న ప్లాన్ ప్రకారమే సేకరించాల్సి ఉంటుంది. సీఆర్‌డీఏ, జిల్లా యంత్రాంగం, ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేషన్ తదితర ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో చేపట్టాల్సిన కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లటానికి గతంలో నియమించిన కమిటీతోనే ప్రస్తుతం కూడా పనిచేయాలని ఏపీఎంఆర్‌సీఎల్ భావిస్తోంది.

పనులు వేగంగా చేసే సంస్థల కోసం జల్లెడ

కేంద్ర ప్రభుత్వం మౌఖికంగా అనుమతులు ఇచ్చినా.. అధికారికంగా అనుమతులు ఇచ్చినా కూడా శరవేగంగా క్షేత్ర స్థాయిలో పనులు చేపట్టడానికి ఔత్సాహిక కాంట్రాక్టు సంస్థలతో కూడా సంప్రదింపులు జరపాలని భావిస్తోంది. రికార్డు స్థాయిలో ఫ్లైఓవర్ల నిర్మాణాలను పూర్తి చేసిన సంస్థలు, అత్యున్నత ప్రమాణాలతో ఫ్లై ఓవర్లను నిర్మించిన సంస్థలను కూడా భాగస్వామ్యం చేయాలన్న ఆలోచన చేస్తోంది. ప్రపంచంలో కానీ, దేశీయంగా కానీ , స్థానికంగా కానీ అలాంటి సంస్థలు ఏమున్నాయన్న దానిపై ఏపీఎంఆర్‌సీఎల్ అధ్యయనం చేస్తోంది.

ఎయిర్‌పోర్టు దగ్గర అండర్ గ్రౌండ్ మెట్రో

గన్నవరం నుంచి పీఎన్‌బీఎస్‌కు ప్రతిపాదించిన ఏలూరు రోడ్డు కారిడార్ విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానమవుతుంది. విమానాశ్రయానికి అనుసంధాన మయ్యే కారిడార్‌ను పూర్తిగా అండర్ గ్రౌండ్ విధానంలో నిర్మించాలని ఏపీఎంఆర్‌సీఎల్ నిర్ణయించింది. ఎయిర్‌పోర్టు దగ్గరలోని యోగాశ్రమం వద్ద ఒక మెట్రో స్టేషన్‌ను నిర్మిస్తారు. సరిగ్గా ఈ మెట్రో స్టేషన్ నుంచి అండర్ గ్రౌండ్ మెట్రో ఎయిర్‌పోర్టుకు అనుసంధానమవుతుంది. విమానాశ్రయంలో నిర్మిస్తున్న నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌కు ఏకబిగువున అండర్ గ్రౌండ్ మెట్రో అనుసంధానమవుతుంది. విమానాశ్రయం మిగతా 6లో..

కొండంత భక్తితో..





» మార్గశిరాన కనకదుర్గమ్మ గిరి ప్రదక్షిణ

వన్‌టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో గిరిప్రదక్షిణ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా సాగింది. అలంకరించిన వాహనం పై వేదికను అమర్చి గంగా, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాసశాస్త్రిలు లఘుపూజలు నిర్వహించారు. ఈవో కె.ఎస్.రామరావు, తదితరులు కొబ్బరికాయలు కొట్టి ప్రదక్షిణను ప్రారంభించారు. మార్కాపురం, వినుకొండ, గిద్దలూరు ప్రాంతాల నుంచి నాట్యాభినయాన్ని నేర్చుకుంటున్న చిన్నారులు ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మవారికి చిన్నారులు నాట్యనీరాజనంతో చూపరులను ఆనందింపచేశారు. కోలాటాలు, నృత్యాలు, మంగళవాయిద్యాలు, తప్పెట వాయిద్యాల కలబోతతో సుమారు కిలోమీటరు పొడవున భక్తరంజకంగా గిరిప్రదక్షణ సాగింది. మరోవైపు దేవస్థానం రూపొందించిన జయదుర్గా కీర్తనలు భక్త జనాలను తన్మయింపజేశాయి. గిరిప్రదక్షిణలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కుమ్మరి పాలెం సెంటర్, నాలుగు స్తంభాల సెంటర్, సితార సెంటర్, కబేళా సెంటర్, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ మీదుగా ప్రదక్షిణ సాగింది. భక్తులకు అమ్మవారి ప్రసాదంగా పాయసాన్ని పంపిణీ చేశారు. మిల్క్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో భక్తులకు వేడి బాదం పాలను పంపిణీ చేశారు.

గజ వాహనంపై శ్రీవారు..



గుడ్లవల్లేరు, డిసెంబరు, 15 (ఆంధ్రజ్యోతి) : డోకిపర్రులో వేంచేసిన భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు మూడోరోజున అత్యంత వైభవంగా జరిగాయి. ఆదివారం ఉదయం శుప్రభాత సేవ, తోమాల సేవ, అర్చన కైంకర్యాల అనంతరం వేంకటేశ్వర స్వామిని, శ్రీభూదేవి సమేతంగా గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ నిర్వాహకులు పి.వీరారెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో సినీనటి జయప్రద, శ్యామలాదేవి

వన్‌టౌన్ : రాజ్యసభ మాజీ సభ్యురాలు, సీనియర్ నటి జయప్రద, మాజీ కేంద్రమంత్రి సీనియర్ నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవిలు ఇంద్రకీలాద్రిపై ఆదివారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వారికి ఈవో కేఎస్ రామారావు అమ్మవారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.



సినీనటి జయప్రద, కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవిలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

వన్‌టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ ఏర్పడింది. వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనం కోసం వేకువజాము నుంచే భక్తులు బారులుతీరారు. పలువురు భక్తులు అర్జిత సేవల్లో పాల్గొన్నారు. ఆదివారం సందర్భంగా సూర్యోపాసన సేవ నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తి చిత్రపటానికి శోడశోపచార పూజలు నిర్వహించి, అర్చనాది కార్యక్రమాలను పూర్తిచేసి మంత్రపుష్పం, హారతి, ఆశీస్సులు అందచేశారు. దుర్గగుడి గిరి ప్రదక్షణలో ఆదివారం ఉదయం పాల్గొన్న చిన్నారులు కళావేదికపై తమ అభినయాన్ని ప్రదర్శించారు. 100 మంది బాలికలు ఒకే ఆహార్యంతో తమదైన శైలిలో ప్రదర్శన ఇచ్చారు. వారిని ఈవో అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.



పవన్ కల్యాణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

బుక్ ఫెస్టివల్‌కు స్టేడియం కేటాయించండి

» డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు సొసైటీ విజ్ఞప్తి

విజయవాడ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బు క్ ఫెస్టివల్ నిర్వహణకు ఐజీఎం స్టేడియం కేటాయించమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ను విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ విజ్ఞప్తి చేసింది. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు మనోహర నాయుడు, సెక్రటరీ లక్ష్మయ్య, సభ్యులు గోళ్ల నారాయణరావు, ఎమెస్కో పబ్లిషర్స్ సాందీపణిలు సందర్భంగా పవన్‌కళ్యాణ్‌కు విజ్ఞప్తి పత్రం అందించారు. ఆదివారం సెక్రటేరియట్‌లో సొసైటీ బృందం కలిశారు. ఈసందర్భంగా పవన్‌కళ్యాణ్ గ్రంథాలయ పూర్వవైభవానికి తన వంతు సహకారం అందిస్తానని, త్వరలో జరగబో యే గ్రంథాల ఉత్సవాలలో పాల్గొంటానని పవన్ కళ్యాణ్ తెలిపారు. బుక్ ఫెస్టివల్ కోసం ఇందిరా గాంధీ స్టేడియం కేటాయించాలనే విషయంపై రెండు రోజు ల్లో తెలియజేస్తానని, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారని సొసైటీ పేర్కొంది.



జాతీయ వాలీబాల్ విజేత ఎస్ఆర్ఎం

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నాదెళ్ల బసవ పూర్ణయ్య (ఎన్‌బీపీ) ట్రస్ట్ అఖిల భారత ఇన్విటేషన్ వాలీబాల్ మహిళల టోర్నీ విజేతగా ఎస్ఆర్ఎం వర్సిటీ టీమ్ నిలిచింది. నాలుగు రోజులుగా విజయవాడ నగరంలోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఆదివారం నాటి చివరి లీగ్ మ్యాచ్‌లో బ్యాంక్ మహారాష్ట్రపై విజయం సాధించిన ఎస్ఆర్ఎం టీమ్ రూ. 75వేల నగదు, ట్రోఫీని వశం చేసుకుంది. ఈ ఓటమితో బ్యాంక్ మహారాష్ట్ర మూడోస్థానానికి పడిపోగా, తమిళనాడు క్రీడాప్రాధికార సంస్థ టీమ్ రన్నరప్ వరించింది. విజేతలకు ట్రోఫీలు, నగదు పారితోషికాల అందజేతకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)హాజరై అందజేశారు. అర్జునఅవార్డీ అరికెపూడి రమణరావు, నిర్వాహకులు నాదెళ్ల బ్రహ్మాజీరావు, దోనేపూడి దయాకర్‌రావులతో ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) ఎంపీని మెమెంట్, దుశ్సావాలుతో సత్కరించారు. అమరావతి యూనియన్ బ్యాంక్ డీజీఎం శారదామూర్తి, హెల్ప్ హాస్పిటల్ డైరెక్టర్ పువ్వాడ రవితేజ, వీవీ అప్పాజీలు పాల్గొన్నారు.

గోవిందానంద స్వామి వ్యాఖ్యలు అసంబద్ధం

విజయవాడ కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోవిందానంద స్వామి వ్యాఖ్యలు అసంబద్ధమైనవని ఘనపాటి చింతలపల్లి అంజనేయులు విమర్శించారు. శృంగేరీ పీఠాధిపతులు భారతీ తీర్థ మహాస్వామి, విధుశేఖర మహాస్వాములపై గోవిందానంద స్వామి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శృంగేరీపీఠం ఆదిశంకరాచారుయలు స్థాపనలో అత్యంత ప్రాముఖ్యత గలదని, నాటి నుంచి పీఠాధిపతులు ధర్మరక్షణకు కట్టుబడి ఉన్నారన్నారు. శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్ణా హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి గురువు పట్ల గౌరవ భావన ఉండాలని, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేయకుండా ధర్మపరమైన స్థిరత్వాన్ని కాపాడాలన్నారు. మల్లాది రామనాథశర్మ, కప్పగంతు పండరీనాథ్, గోరుగుంట రవి పాల్గొన్నారు.

స్వరరాగ సుధారసం రామ్మూర్తి గానం

విజయవాడ కల్చరల్ : శ్రీ సుబ్రమణ్య మహతి సంగీత సమితి నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం దుర్గాపురం సుందర్ నగర్‌లోని శ్రీ సుబ్రహ్మణ్య మహతి కళాపీఠంలో జరిగిన రామ్మూర్తి గాత్ర సంగీత కచేరీ ఆద్యంతం శ్రోతలను సంగీత రస జగత్తులో విహరింపజేసింది. చక్కని మనోధర్మంతో రాగం పాడటంలో విన్యాస స్వర కల్పన వేయడంలో తనదైన ప్రతిభను కనబరుచుకొంటూ స్వరరాగసుధను పంచారు. ఆట తాళ వర్ణం, బేగడ రాగంలో వల్లభ నాయకశ్య, పూర్తి కల్యాణిలో దేవదేవ జగదీశ్వర, దేవమనోహరిలో ఎవరికై అవతారమెత్తితివి, సారంగలో అరుణాచలనాథం, తోడి రాగంలో రాగం తానం పల్లవి తదితర అంశాలను హృద్యంగా గానం చేసి ప్రజ్ఞను చాటుకొన్నారు. వీరికి వయొలిన్‌తో పెరవలి నందకుమార, మృదంగంతో కె.సద్గురు చరణ్‌లు ప్రతిభాన్వితంగా సహకరిస్తూ రామ్మూర్తి గానానికి నిండుదనాన్ని చేకూరి వారి అనుభవాన్ని చాటుకొన్నారు. ఈ సందర్భంగా సమితి ప్రధాన కార్యదర్శి సీవీ రావు కళాకారులను సత్కరించారు.

ఆంధ్రుడికి ఆద్యుడు.. అమరజీవి

» ఘనంగా పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు బొండా ఉమా, యార్లగడ్డ

విజయవాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రులకు ఒక గుర్తింపు తెచ్చి.. తెలుగువారంటే పోరాటయోధులని నిరూపించి.. స్వరాష్ట్రం, స్వపరిపాలన కోసం తమిళులతో తగువ పెట్టుకుని.. ప్రాణాలకు తెగించి ఆంధ్రరాష్ట్రాన్ని సాధించారు అమరజీవి పొట్టి శ్రీరాములు. ఆయన వర్ధంతిని పొట్టిశ్రీరాములు ఆత్మార్పణదినంగా ప్రభుత్వం ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన జీవిత ఘట్టాలను పుస్తక రూపంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మంత్రి పి.నారాయణ, అచ్చెన్నాయుడు, కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకటరావు, శ్రీరాం తాతయ్య, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బలిదానంతోనే రాష్ట్రం వచ్చింది

– బొండా ఉమా, సెంట్రల్ ఎమ్మెల్యే

పొట్టి శ్రీరాములు ఆత్మార్పణకు స్ఫూర్తిగా భావితరాలను తయారు చేయాలి. ఆయన ఆత్మబలిదానం చేయకపోతే మనకు రాష్ట్రం ఉండేది కాదు. మనం ఇంకా మదరాసీలుగా ఉండేవాళ్లం. పొరుగున ఉన్న తెలంగాణ వివిధ కారణాల రీత్యా విడిపోయిన స్వర్ణాంధ్రప్రదేశ్ కోసం లక్ష్యాలను సీఎం చంద్రబాబు నిర్దేశించారు. పొట్టి శ్రీరాములుకు ఉన్న పట్టుదలతో చంద్రబాబుతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తారు.

ఆరంభ శూరత్వం నానుడిని తొలగించారు

– కేశినేని చిన్ని, విజయవాడ ఎంపీ

భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అమరజీవి కారణం. ఆంధ్రులు ఆరంభ శూరత్వం అనుకునే ధోరణిని పొట్టి శ్రీరాములు మార్చారు. ఆయన స్ఫూర్తిని కొనసాగించాలి. చంద్రబాబు విజన్ డాక్యుమెంట్‌తో పిల్లల భవిష్యత్తు స్వర్ణయుగంగా ఉంటుంది.

గొప్ప సామాజికవేత్త

– కె.పార్థసారథి, సమాచార మంత్రి

అమరజీవి పొట్టి శ్రీరాములు గొప్ప సామాజికవేత్త. స్వాతంత్రానికి ముందు హరిజనోద్ధరణ ఉద్యమం చేశారు. దళితులకు దేవాలయాల్లో ప్రవేశం కల్పించాలని పోరాటం చేశారు. ఆయన పోరాట ఫలితంగా మద్రాసు ప్రెసిడెన్సీలో అనేక ఉత్తర్వులు వచ్చాయి. రాజ్యాంగం, చట్టాలను గౌరవించి పాలన సాగించే ప్రభుత్వాలు అధికారంలో ఉండాలి. స్వార్థంతో కూడిన నేతలు అధికారంలో ఉంటే వారికి మాత్రమే లాభం. ప్రజలకు ఏమాత్రం ఉపయోగం ఉండదు. చంద్రబాబు విజన్ భావితరాల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగం.

ఎయిర్‌పోర్టుకు ఆర్టీసీ ఏసీ బస్సు!

» ఐదేళ్ల తర్వాత పునఃప్రారంభం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆర్టీసీ అధికారులు ఏసీ బస్సును నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా విమానాశ్రయానికి నిలిచిపోయిన ఆర్టీసీ బస్సును తిరిగి పునరుద్ధరించాలని ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ విమానాశ్రయం అనూహ్య వృద్ధిని నమోదు చేసింది. అమరావతి రాజధాని కార్యకలాపాల నేపథ్యంలో, విమానాశ్రయానికి రాకపోకలు పెరిగాయి. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వంలో విమాన ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ఏసీ బస్సును నడిపారు. గత ఐదేళ్లపాటు విమానాల సంఖ్య తగ్గటం, బస్సు ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఆర్టీసీ అధికారులు సర్వీసును నిలిపివేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో మళ్లీ విమానయానం పుంజుకుంది. దేశీయంగా, అంతర్జాతీయంగానూ సర్వీసులు పెరిగాయి. దీంతో విమాన ప్రయాణికులు బస్సును పునరుద్ధరించాల్సిందిగా అభ్యర్థిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు మెట్రో ఏసీ బస్సును నడపాలని నిర్ణయించారు. ఆర్ఎం ఎంవై దానం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు అధికారుల నుంచి ఫ్లైట్స్ షెడ్యూల్ తీసుకుని దానికి అనుగుణంగా బస్సులు తిప్పేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దుర్గమ్మపై ప్రత్యేక డాక్యుమెంటరీ



డాక్యుమెంటరీని పరిశీలిస్తున్న ఈవో రామారావు, అదిరాజ్ సినీ క్రియేషన్ నిర్వాహకురాలు కార్తీక

వన్‌టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానం సరికొత్తగా ఓ డాక్యుమెంటరీని రూపొందించింది. భవానీ దీక్షల విరమణ సమయంలో ఆవిష్కరించటానికి సన్నాహాలు చేస్తోంది. ఇంద్రకీలాద్రిపై స్వయంభువుగా వెలసిన కనకదుర్గమ్మను 8వ శతాబ్దంలో ఆది శంకరాచార్యులు దర్శించుకున్నారు. మహిషాసురమర్ధినిగా ఉగ్ర రూపంలో ఉన్న అమ్మవారిని ఆయన తన ధ్యానం ద్వారా ప్రసన్నం చేసుకున్నారు. పూర్వ కాలం నుంచి కనకదుర్గమ్మ లీలలను గురించి అనేక మంది పలు రచనలు చేశారు. ఇటీవల ఈవో కె.ఎస్.రామారావు దుర్గమ్మ వైభవాన్ని మరింతగా ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు కొన్ని గ్రంథాలను ప్రచురించారు. ఇదే క్రమంలో తాజాగా డాక్యుమెంటరీని కూడా రూపొందించారు. ఈ డాక్యుమెంటరీలో ఆలయంలో నిత్యం అమ్మవారికి జరిగే సేవలు, పూజలు, ఉత్సవాలు, దీక్షలు తదితరాలు ఎన్నింటినో సంక్షిప్తం చేశారు. 30 నిమిషాలు నిడివి గల ఈ డాక్యుమెంటరీని హైదరాబాద్‌కు చెందిన అదిరాజ్ సినీ క్రియేషన్స్ రూపొందించింది. డాక్యుమెంటరీ తుది మెరుగులు దిద్దుకుంటుంది. ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే భవానీ దీక్షల విరమణ మొదటి రోజు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కమిషనర్ ఎస్.సత్యనారాయణ సమక్షంలో ఈ డాక్యుమెంటరీని ఆవిష్కరించనున్నట్లు ఈవో రామారావు, అదిరాజ్ సినీ క్రియేషన్ నిర్వాహకురాలు కార్తీకా తెలిపారు.

మావోయిస్టు నేత ఐదుగుళ్లపల్లి వాసే!

11న ఒడిస్సా ఎన్‌కౌంటర్‌లో మరణించిన కార్తీక్‌దాదా అలియాస్ పృథ్వి మోహనరావు

30 ఏళ్ల కిందట స్వగ్రామం కృష్ణాజిల్లా గూడూరు మండలం ఐదుగుళ్లపల్లికి రాక.. బెంగుళూరులో నివాసం ఉంటున్న భార్య, కుమార్తె

మచిలీపట్నం/గూడూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒడిస్సా రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా కుమ్మంలోని లక్‌వేద వద్ద ఈ నెల 11వ తేదీన జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు నేత కార్తీక్ దాదా అలియాస్ పృథ్వి మోహనరావు(65) కృష్ణాజిల్లా గూడూరు మండలం ఐదుగుళ్లపల్లి గ్రామానికి చెందిన వారే. ఆయన ఒడిస్సా మావోయిస్ట్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా పనిచేస్తున్నారు. వృద్ధాప్యంలో ఉన్న ఆయన వేరొకరి సహాయం లేకుండా నడవలేని స్థితిలో ఉన్నారు. అటువంటి స్థితిలో ఉన్న ఆయన్ను, ఆయనకు సహాయకురాలిగా ఉన్న రమీలాను పోలీసులు పట్టుకుని బూటకపు ఎన్‌కౌంటర్ చేసినట్లు కమ్యూనిస్టులు ఆరోపించారు.



ఐదుగుళ్లపల్లిలో కార్తీక్‌దాదా సోదరుడి ఇల్లు

మోహనరావు నేపథ్యం ఇలా..

గూడూరు మండలంలోని ఐదుగుళ్లపల్లి, పోలవరం, కప్పలదొడ్డి గ్రామాల్లో కమ్యునిస్టులు అధికంగా ఉంటారు. కమ్యునిస్టు భావజాలాన్ని ఔపాసన పట్టిన పృథ్వి మోహనరావు మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లి దీర్ఘకాలంపాటు పనిచేశారు. ఆయన ఐదుగుళ్లపల్లిలో ఐదో తరగతి వరకు చదువుకున్నారు. 6, 7 తరగతులు పోలవరం ప్రాథమికోన్నత పాఠశాలలో, 8 నుంచి 10వ తరగతి వరకు మల్లవోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివారు. గుంటూరు జిల్లా నల్లపాడులో పాలిటెక్నిక్ కోర్సు చదివిన ఆయన, కొంతకాలంపాటు గుంటూరులో ఆర్అండ్‌బీ విభాగంలో సూపర్‌వైజర్ పనిచేశారు. అక్కడి నుంచి మావోయిస్టులలో చేరి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. 1986లో తన సోదరుడు యోగానాందరావు వివాహం సమయంలో ఒకసారి, 30 సంవత్సరాల కిందట రెండు సార్లు ఐదుగుళ్లపల్లికి వచ్చారు. తనకు ఇల్లు, ఇతరత్రా ఆస్తులు ఏమీ అవసరం లేదని, తల్లిదండ్రులను జాగ్రత్తగా చూసుకోమని సోదరులకు బాధ్యతలు అప్పగించి వెళ్లిపోయారు. ఆయన భార్య జ్యోతి అలియాస్ పద్మ ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నారు. ఉద్యమంలో ఉండగానే జ్యోతిని ఆయన వివాహం చేసుకున్నారు. కుమార్తె భారతిని ఐదు సంవత్సరాల పాటు తన తల్లిదండ్రుల వద్ద ఐదుగుళ్లపల్లిలోనే ఉంచారు. అనంతరం బంధువులు మోహనరావు కుమార్తెను తమతో తీసుకువెళ్లారు. కొంతకాలం తర్వాత ఉద్యమం నుంచి బయటకు వచ్చిన మోహనరావు భార్య జ్యోతి తన కుమార్తెతో సహా బెంగళూరు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. గత 30 సంవత్సరాలుగా మోహనరావుకుఐదుగుళ్లపల్లితో సంబంధాలు తెగిపోయాయి. ఆయన భార్య ఎప్పుడో ఒకసారి ఐదుగుళ్లపల్లికి వచ్చేవారు. ఆమె ఆరోగ్యం బాగుండకపోవడంతో కొన్ని సంవత్సరాలుగా ఆమె ఇక్కడకు రాలేదని బంధువులు చెబుతున్నారు.

మృతదేహం కోసం కుమార్తె అభ్యర్థన

ఎన్‌కౌంటర్‌లో మరణించిన మోహనరావు మృతదేహాన్ని తమకు ఇవ్వాలని, గ్రామంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన కుమార్తె భారతి పోలీస్ అధికారులకు లేఖ రాసినట్లు మోహనరావు సోదరుడు యోగానందరావు తెలిపారు.

30 ఏళ్లుగా రాలేదు



నా సోదరుడు మోహనరావు ఐదుగుళ్లపల్లికి 30 ఏళ్లుగా రాలేదు. ఆయన ఎన్‌కౌంటర్‌లో మరణించారని శనివారం రాత్రి పొద్దుపోయాక మా కుమార్తె భారతి ద్వారా తెలిసింది. ఇక్కడే పదో తరగతి వరకు చదుకున్న మోహనరావును పాలిటెక్నిక్ చదివేందుకు నా తల్లిదండ్రులు గుంటూరుకు పంపారు. 1986లో నా వివాహానికి వచ్చారు. ఆ తర్వాత రెండు సార్లు ఐదుగుళ్లపల్లికి వచ్చి వెళ్లారు. మళ్లీ 30 ఏళ్లుగా కనిపించలేదు. ఐదునెలల కిందట ఎన్ఐఏ అధికారులు మా ఇంటికి వచ్చి ఇల్లంతా సోదాచేశారు. మోహరావు ఇక్కడకు వస్తే తెలియజేయాలని చెప్పి వారు వెళ్లిపోయారు.

– యోగానందరావు, కార్తీక్‌దాదా సోదరుడు, ఐదుగుళ్లపల్లి

కేంద్రానికి మెట్రో..

(5వ పేజీ తరువాయి)

అధికారులకు గతంలో ఇచ్చిన అండర్ గ్రౌండ్ మెట్రో ప్లాన్‌లో ఎలాంటి మార్పు లేదని తెలుస్తోంది. విమానాశ్రయం నుంచి బయటకు వచ్చేటపుడు మళ్లీ రెండో అండర్ గ్రౌండ్ మార్గంలో కేసరపల్లి మెట్రో స్టేషన్‌కు అనుసంధానమవుతుంది.

డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌కు అంచనాలు పూర్తి

మెట్రో కారిడార్ వస్తున్న మార్గంలోనే నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు ఎన్‌హెచ్-16పై 6.5 కిలోమీటర్ల ఫ్లై ఓవర్ వస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఫ్లై ఓవర్ వల్ల మెట్రో కారిడార్‌కు ఇబ్బందులు లేకుండా ఉండటానికి ఈ ఫ్లై ఓవర్‌ను డబుల్ డెక్కర్‌గా నిర్మించాలని నిర్ణయించారు. కింద రోడ్డు ఆ పైన ఫ్లై ఓవర్, దీనిపై మెట్రో ఎలివేటెడ్ కారిడార్ లైన్ వెళ్లేలా డిజైన్‌కు ఏపీఎంఆర్‌సీఎల్ శ్రీకారం చుట్టింది. దాదాపుగా డిజైన్లు ఖరారయ్యాయి. నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు వరకు 4.5 కి లోమీటర్ల మేర మాత్రం డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ వస్తుంది.



ఓవరాల్ చాంపియన్ కృష్ణా జట్టుకు బహుమతి ప్రదానం

మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ కృష్ణా

» ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

గుడివాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న 44వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్‌గా ఆతిథ్య కృష్ణాజిల్లా జట్టు నిలిచింది. రెండు రోజులుగా జరుగుతున్న పోటీలు ఆదివారం ముగిసాయి. పురుషుల విభాగంలో పరుగుపందెం పోటీల్లో విజయనగరం జట్టు, మహిళల విభాగంలో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచాయి. 50ఏళ్ల పైబడి పురుషుల, మహిళల విభాగాల్లో రిలే పరుగుపందెంలో ఆతిథ్య కృష్ణాజిల్లా జట్టు విజేతగా నిలిచింది. 5 కి.మీల వాకింగ్ పురుషుల విభాగంలో డీవీఎస్ బాబురావు, మహిళల విభాగంలో ఎం.జ్యోతిరెడ్డిలు ప్రథమ స్థానంలో నిలిచారు. 1500మీ పరుగుపందెంలో ఎం.ఎస్ రాజు ప్రథమ స్థానం, 50ఏళ్ల మహిళల విభాగంలో కోటేశ్వరమ్మ, 400 మీ విభాగంలో అప్పలస్వామి, మహిళల విభాగంలో వి.లక్ష్మమ్మ, 45ఏళ్ల విభాగంలో హేమర్‌త్రో లో వి.సుబ్బలక్ష్మిలు విజేతలుగా నిలిచారు. 70ఏళ్ల విభాగంలో హ్యామర్ త్రో లో పురుషుల్లో వై.వెంకటేశ్వరరావు, మహిళల విభాగంలో టి.విజయకుమారి, 45ఏళ్ల విభాగంలో డిస్కస్ త్రో.. పురుషుల్లో వీవీఎం కృష్ణారావు ప్రథమ, సురేష్‌బాబు ద్వితీయ స్థానం, మహిళల విభాగంలో కె.మర్చికుండా ప్రథమ, పెంచులమ్మ ద్వితీయ స్థానంలో నిలిచారు. ఓవరాల్ చాంపియన్‌గా ఆతిథ్య కృష్ణాజిల్లా జట్టు నిలిచింది. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తా చంటి, ఇండియా మాస్టర్స్ అథెటిక్స్ రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎంపీ ప్రసాద్, ఆర్గనైజర్లు అప్పలస్వామి, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జూడో పోటీలు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కండ్రిక కేఆర్‌వీఆర్ ఇంటర్నేషనల్ స్పోర్ట్సు క్లబ్‌లో ఆదివారం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల జూడో టోర్నమెంట్ ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నేషనల్ ఎస్సీ కమిషన్ చైర్‌పర్సన్ కిషోర్ మక్‌వానా హాజరై విజేతలకు పతకాలు అందజేశారు. విజయవాడలో ఈ నెల 24, 25 తేదీల్లో జరగనున్న సీనియర్ స్టేట్ జూడో టోర్నీలో సత్తాచాటాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను బీజేపీ రాష్ట్ర మోర్చా అధ్యక్షుడు దేవానంద్ అభినందించారు. ఈ సందర్భంగా ఏపీ జూడో సంఘం సీఈవో నామిశెట్టి వెంకట్, అధ్యక్షుడు గణేశ సుబ్బారావు, ఉపాధ్యక్షుడు గమిడి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి ఎన్.పవన్‌సందీప్‌లు పాల్గొన్నారు.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు నిఖిల్, ఆషియా

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : జమ్మూ కాశ్మీర్‌లో ఈ నెల 18 నుంచి 23 వరకు జరగనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాకారులు బాలుర విభాగంలో ఆర్ నిఖిల్(పాయకాపురం సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్‌మీడియం), బాలికల విభాగంలో షేక్ ఆషియా(విజయవాడ చైతన్య స్కూల్)లు ఎంపికయ్యారని జిల్లా అసోసియేషన్ కార్యదర్శులు గమిడి సాంబశివరావు, గరికపాటి మారుతీలు తెలిపారు.



మాట్లాడుతున్న ఆర్డీ ప్రసాద్, పక్కన క్రీడాసంఘాల ప్రతినిధులు

సీఎంగారూ స్పందించండి!

» ఆడుదాం- ఆంధ్రా అవినీతిపై విచారణ చేపట్టాలి

» అత్యా-పాత్యా సీఈవో ఆర్డీ ప్రసాద్ డిమాండ్

విజయవాడస్పోర్ట్సు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన 'ఆడుదాం- ఆంధ్రా' కార్యక్రమం ద్వారా రూ.100 కోట్ల మేర అవినీతి, అక్రమాలు జరిగాయని ఆధారాలతో సీఐడీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు అతీగతీ లేదని, ఈ విషయంలో సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని నిజ నిర్ధారణకు ఆదేశాలివ్వాలని జాతీయ కబడ్డీ మాజీ క్రీడాకారుడు, అత్యా-పాత్యా సీఈవో ఆర్డీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పటి మంత్రి రోజా, శాప్ చైర్మన్ సిద్దార్థరెడ్డిలు కుంభకోణంలో ప్రధాన సూత్రధారులని, వీరికి నలుగురు శాప్ అధికారులు కొమ్ముకాసి కోట్లలో అవినీతికి సహకరించారని ఆరోపించారు. దీనిపై సీఐడీ అధికారులకు ఆర్నెల్ల క్రితం ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. భారీ అవినీతిపై సీఐడీ విచారణలో ఒక్కరోజు తనను విజయవాడ పోలీసులు విచారించి తర్వాత మిన్నకుండిపోయారని, ఈ విషయంలో క్రీడా మంత్రి, సీఎం స్పందించి అవినీతి పరుల ఆటకట్టించాలని, లేకుంటే హైకోర్టును ఆశ్రయిస్తానన్నారు. సమావేశంలో వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు జోసెఫ్, అప్పలస్వామి, ఎం.శివ, కృష్ణారెడ్డి, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

రేపు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గన్నవరం రాక

గన్నవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం గన్నవరం విమానాశ్రయానికి రానున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. 17న ఢిల్లీలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి 11.30 వచ్చి ఇక్కడి నుంచి రోడ్డు మార్గాన మంగళగిరి ఎయిమ్స్‌కు వెళతారు. ఎయిమ్స్ తొలి స్నాతకోత్సవంలో పాల్గొని తిరిగి విమానాశ్రయానికి చేరుకుని హైదరాబాద్ వెళ్లనున్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 120, 131
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.630

ఘనంగా దత్తాత్రేయ జయంతి

గవర్నర్‌పేట, డిశంబరు 15 (ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు ఆదివారం లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీ షిర్డినాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులు దత్తాత్రేయుడి కి పాలాభిషేకం చేశారు. అనంతరం వల్లభదాసు మాధవరావు, విజయలక్ష్మీ దంపతులు, కనకమేడల భరత్‌భూషణ్, శివపార్వతి దంపతులు, వెన్నా రామాంజనేయులు, లక్ష్మీరమాదేవి దంపతుల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది. మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు. పది మందికి, మీ ప్రాంత వాసులందరీ సమస్య అయి ఉండాలి.

మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602

సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి



గుత్తికొండ నాగేశ్వరరావు, తిరుతమ్మపార్కు



ఎండిపోయిన ఉద్యానవనం





తుప్పుపట్టిన తిరిగే ఊయల , తాడుకట్టిన ఊయల గొలుసు

శిథిలావస్థలో పార్కు

● ఐదేళ్లుగా పట్టించుకోని అధికారులు - తప్పు పట్టిన పిల్లల ఆటవస్తువులు

గుత్తికొండ నాగేశ్వరరావు, తిరుపతమ్మ పార్కును పట్టించుకునేవారు లేక శిథిలావస్థకు చేరింది. జారుడు బల్లకు పైన ఉండే ఇనుప ప్లేట్ పూర్తిగా తప్పుపట్టాయి. దీంతో పార్కుకు వచ్చే చిన్నారులు నిరాశకు లోనవుతున్నారు.

(పటమట, ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం 10వ డివిజన్ విజయనగర్ కాలనీ 4వ రోడ్డు టవర్‌లైన్ రోడ్డులోని గుత్తికొండ నాగేశ్వరరావు, తిరుపతమ్మ పార్కును పట్టించుకునేవారు లేక శిథిలావస్థకు చేరింది. ఈ ప్రాంతంలోని మహిళలు, విద్యార్థినులు ఉదయం, సాయంత్రం పూట ఈ పార్కులో వాకింగ్ చేస్తారు. గతంలో ఇక్కడ పార్కులో ఉండే బోరు పాడవ్వగా, చెట్లకు సరిగా నీరందక ఎండిపోతున్నాయి. వారానికి ఒకసారి కార్పొరేషన్ అధికారులు వాటర్ ట్యాంకర్‌తో నీళ్ల సర ఫరా చేస్తున్నా అవి సరిపోవటం లేదు. ఉయ్యాలకు వేళాడే గొలుసులకు ఒకదానికి గుడ్డ కట్టారు. జారుడు బల్లకు పైన ఉండే ఇనుప ప్లేట్ పూర్తిగా తప్పుపట్టాయి. బెంచీలకు ఉన్న సిమెంట్ ఊడిపోయి, విరిగిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. అధికారులు, నాయకులు స్పందించి పార్కును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పాలకుల నిర్లక్ష్యం వల్లే



గత ఐదేళ్లలో పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం ఈ పార్కు. నా సొంత నిధులు రూ. లక్ష ఖర్చుపెట్టి మరమ్మతులు చేయించా.సంబంధిత అధికారులు స్పందించి పార్కును అభివృద్ధి చేసి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకురావాలి.

నాయుడు రత్తయ్య,స్థానికుడు

సామాజక సేవలో తూర్పు కాపులు

సత్యనారాయణపురం , డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): తూర్పు కాపు సామజికవర్గానికి ఎంతో చరిత్ర ఉందని, సమాజక సేవలో ముందుంటారని ప్రభుత్వ విప్,సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 27వ డివిజన్ గులాబీతోట బీఆర్‌టీఎస్‌రోడ్డు సమీపంలో తూర్పు కాపు విద్యావిజ్ఞాన అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భవనాన్ని ఆదివారం కార్పొరేటర్ వీరమాచినేని లలితతో కలిసి ప్రారంభించారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి నవనీతం సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

సత్యనారాయణపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులను ఆదరించడం సామజక బాధ్యతగా గుర్తించాలని ప్రముఖ ఆడిటర్, సమీర ఈస్ట్ లయన్స్ కంటి హాస్పటల్ ట్రస్ట్ సభ్యులు పి.సుబ్బారాయుడు అన్నారు. అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని విజయ్‌నర్సింగ్‌స్కూల్‌లో ఆదివారం సాయంత్రం వయోవృద్ధా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఈస్ట్ సహకారంతో వృద్ధులకు నిత్యావసర వస్తువులు, మందుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారాయుడు మాట్లాడుతూ ట్రస్టు 210 నెలలుగా ప్రతీ నెలా నాణ్యమైన సరుకులను వృద్ధులకు అందజేస్తుందన్నారు. డాక్టర్ బి.హనుమయ్య, మేనేజింగ్ ట్రస్టీలు తేజ్‌రాజ్‌సోలంకీ ,తట్టి అర్జునరావు, పి.లక్ష్మీనరసింహారావు, వెంకటేష్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

● ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రహదారులను అభివృద్ధితోపాటు విస్తరించి ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాలను అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని టవర్‌లైను రోడ్డు విస్తరణ పనులపై స్థల యజమానులు, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో ఆదివారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ప్రధాన రహదారులు, అంతర్గత రహదారులపై గోతులు లేకుండా చేయాలని నిధులు విడుదల చేశారన్నారు. విజయవాడ పార్లమెంట్ పరిధిలో పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ టవర్‌లైన్ రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగలేదు. ఎన్‌ఏసీ కల్యాణ మండపం స్థలం ఉండటంతో పనులు మధ్యలో ఆగాయన్నారు. ఆ స్థలం ఇచ్చినందుకు ఎన్‌ఏసీ యజమానులు బాండ్లు అడుగుతున్నారు. దీనిని కమిషనర్ పరిష్కరించాలని ఆదేశించారు. బందరు రోడ్డు విస్తరణ మీద కూడా అధికారులు దృష్టి పెట్టాలన్నారు. లయోలా కళాశాల వద్ద పుల్లేటి డ్రెయిన్ కూడా అభివృద్ధి చేసి రైవస్ కాల్వలో ఆ నీరు కలిసేలా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, వల్లూరు అఖిల్, వియంసి ప్రణాళికా విభాగం అధికారి జి.వి.ఎస్.వి.ప్రసాద్, ఏసీపీ మోహన్ బాబు, ట్రాఫిక్ సీఐ రవికిరణ్, గద్దె రమేష్ తదితరులు పాల్గొన్నారు.



స్థల యజమానులతో సమావేశం నిర్వహిస్తున్న పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

విజువల్ కమ్యూనికేషన్‌తో ఉద్యోగ అవకాశాలు

లబ్బీపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విజువల్ కమ్యూనికేషన్ కోర్సు చేసిన విద్యార్థులకు మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జి.అనిత అన్నారు. నలంద డిగ్రీ కళాశాలలో విజువల్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో విజనరీ విస్తాన్ 2కే4 ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అనిత మాట్లాడుతూ ప్రతి రంగంలో డిజిటల్ మార్కెటింగ్ అవశ్యకత ఉందని, దీనిలో నిపుణుల కొరత ఉందన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ మాట్లాడుతూ క్రియేటివిటి, వినూత్నంగా అలోచించే విధంగా విద్యార్థులు ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ, క్విజ్, మోడలింగ్ తదితర అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, ఫిరోజ్‌ఖాన్, కుమారి భార్గవి తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికేట్లు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ అనూరాధ తదితరులు

ర్యాంపు నిర్మాణంతో తీరనున్న వెతలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

లబ్బీపేట, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): శ్రీరామ్ నగర్‌లోకి వెళ్లేందుకు రోడ్డు ర్యాంప్ నిర్మాణం చేపట్టలేదు. రోడ్డు నిర్మించి ర్యాంప్ వేయకపోవడంతో ఆరు నెలలుగా ఇబ్బందులు పడుతున్న వైనాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు స్పందించారు. కాంట్రాక్ట్ సంస్థ ర్యాంప్ నిర్మించడంతో స్థానికులు ఆనందం వ్యక్తంచేశారు. బెంజిసర్కిల్ జ్యోతి కన్వేషన్ సమీపంలో సర్వీస్ రోడ్డు, సైడ్ కాల్వ నిర్మించారు. అనంతరం ర్యాప్ నిర్మాణాన్ని విస్మరించారు.



ర్యాంప్ నిర్మిస్తున్న కార్మికులు

ఆటో ఢీకొని మహిళకు గాయాలు

వన్‌టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళ ప్రయాణిస్తున్న ఆటోను ఆటో ఢీకొనటంతో మహిళ గాయపడిన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. విద్యాధరపురం, బెజవాడ రాజరావు స్కూల్ సమీపంలో జె.లక్ష్మి కుటుంబ సభ్యులతో నివాసం ఉంటుంది. ఆమె ఆదివారం ఉదయం తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి సరుకులు కొనుగోలు చేసేందుకు బైక్‌పై గొల్లపూడిలోని దుకాణానికి వెళ్లింది. సరుకులు కొనుగోలు చేసి ఆటోలో ఇంటికి బయలుదేరింది. ఫ్లైఓవర్ దాటిన తరువాత ఎదురుగా వచ్చిన ఆటో లక్ష్మి ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో బాధితురాలికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న బాధితురాలి భర్త ఆమెను 108లో భవానీపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై కేసు...

విద్యాధరపురం నాలుగుస్తంభాల సెంటర్ కొండపైన ఎరుకలవారి వీధిలో పెండం శ్రీలక్ష్మి ఆమె భర్త రమేష్‌కు మనస్పర్థలు తలెత్తడంతో వేర్వేరుగా ఉంటున్నారు. శ్రీలక్ష్మి కుమారుడు, కుమార్తెతో కలిసి ఉంటుంది. ఆమె ఈనెల 11వ తేదీన ఇంటికి తాళం వేసి డ్యూటీకి వెళ్లింది. అదేరోజు ఆమె భర్త తనవద్ద ఉన్న మరో తాళంతో ఇంటిలోపలికి వెళ్లి బీరువాలో భద్రపరచిన సుమారు 44 గ్రాముల బంగారు ఆభరణాలు, 10 తులాల వెండి ఆభరణాలు అపహరించాడని శ్రీలక్ష్మి భర్తపై పోలీసుల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏకగ్రీవం

ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణా జిల్లా ఎన్నికలు ఆదివారం ఎస్ఆర్ఆర్ కళాశాలలో జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడు జి.రవీంద్రబాబు పర్యవేక్షకులుగా, ఎన్నికలాధికారిగా ఎన్.వెంకటేశ్వరరావు, ఎస్.కె.ఆలీ అబ్జర్వర్‌గా వ్యవహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.వి.దుర్గారావు, సలహాదారుడిగా వి.వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా ఎం.వి.రంగారావు, ప్రధాన కార్యదర్శిగా బి.జమలయ్య, మహిళా కార్యదర్శిగా ఎ.ప్రశాంతి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఆర్.చార్లెస్, కోశాధికారిగా పి.విజయ్, ఉపాధ్యక్షులుగా టి.గాయత్రి, మురళీ, సంయుక్త కార్యదర్శులుగా రామబ్రహ్మం, ఎన్.హరీష్ ఎకగ్రీవంగా ఎన్నియ్యి ప్రమాణస్వీకారం చేశారు.



దివ్యాంగుల ఎంప్లాయిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



గొడవపడిన వ్యక్తులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

మందుబాబుల హల్‌చల్

● భయాందోళనలో ప్రజలు ● పట్టించుకొని పోలీసులు

చిట్టినగర్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నారు. అటుగా రాకపోకలు సాగించాలంటే మహిళలు, స్కూల్, కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేటీరోడ్డుతోపాటు టేనర్‌పేట అడ్డరోడ్డు., బ్రహ్మంగారిమఠం, శ్రీనివాస్‌మహాల్ కొండపైకి వెళ్లే అడ్డరోడ్డు, పితాని అప్పలస్వామివీధి రాజా హైస్కూల్ పక్కన, కె.ఎల్.రావు నగర్ అవుట్ ఫాల్ డ్రెయిన్ తదితర ప్రాంతాల్లో ముందుబాబులు, పలువురు గంజాయి బాబులు ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. ఆదివారం కేటీరోడ్డు కలరా హస్పటల్ ప్రాంతంలో ఇద్దరు యువకులు మద్యం మత్తులో గొడవపడ్డారు. ఒకరిని ఒకరు తిట్టుకుంటూ రోడ్డుపై నానాయాగి చేశారు. ఇంతలో మూడో వ్యక్తి వచ్చి ఇద్దరిలో ఒక వ్యక్తిని చితకబాదాడు. వారు ఎవరు? ఎందుకు కొట్టుకుంటున్నారనేది ఎవరికి అర్థం కాని పరిస్థితి. ప్రజలు తమపై దాడి చేస్తారేమోనని భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న కొత్తపేట పోలీసులు గొడవ పడిన ఇద్దరిని పోలీస్ స్టేషన్ తీసుకెళ్లారు. మూడో వ్యక్తి పరారీలో ఉన్నాడు. నిత్యం ఇటువంటి సంఘటన కొత్తపేట స్టేషన్ పరిధిలో జరుగుతున్న పోలీసులు మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మాదిగ దాసుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

● జాతీయ ఎస్సీ కమిషన్‌కు వినతి

గవర్నర్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ సామాజిక వర్గంలో ఉపకులంగా ఉన్న మాదిగ దాసుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాకు మాదిగదాసు జాతీయ సంక్షేమ సంఘం నేతలు వినతిపత్రం అందజేశారు. లెనిన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ ఐక్యతా భవన్‌లో ఆదివారం కిషోర్ మక్వానాను కలిసిన సంఘం అధ్యక్షుడు మంగళగిరి రాజేంద్రప్రసాద్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికంలో ఉన్న మాదిగదాసు వర్గానికి ఎస్సీ కార్పోరేషన్ ద్వారా రావాల్సిన రాయితీలు రావడం లేదన్నారు. ప్రభుత పథకాలు చేరడం లేదని వివరించారు. హిందూ దేవాలయాల ఆలయ కమిటీ నియామకాల్లో సభ్యులుగా తమ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. సామాజిక వర్గం అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సహకారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన మక్వానా సంఘ నేతలు తన దృష్టికి వచ్చిన అంశాలను పరిశీలన చేసి ప్రభుతానికి నివేదిక అందజేస్తానని హామీ ఇచ్చారని రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు తాళ్లూరి విష్ణువు, సహాయ కార్యదర్శి టి.హనుమంతరావు, సభ్యులు ఎం. రమణ, టి. అంకినీడు ప్రసాద్, టి. ప్రవీణ్, ఎం. పవన్‌కుమార్‌దాసు, బి. వెంకటరమణ పాల్గొన్నారు. అనంతరం మక్వానాను సత్కరించారు.



జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానాకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ఎంపీ శివనాథ్‌ను కలిసిన సాగునీటి సంఘం అధ్యక్షుడు బాబురెడ్డి

వన్‌టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు మండలం, రేపూడి సాగునీటి సంఘ అధ్యక్షుడిగా గెలిచిన కొప్పుల బాబురెడ్డి ఆదివారం విజయవాడలోని ఎన్టీఆర్ భవన్‌లో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాబురెడ్డికి ఎంపీ అభినందనలు తెలిపారు. నాయకులు ఆలవాల రమేష్, బత్తుల జమలయ్య, మల్లమట్టి ఏలియా, రేగళ్ల సాంబశివరెడ్డి, నరేష్ రెడ్డి, దొడ్డి బ్రహ్మరెడ్డి, బూత్ కన్వీనర్లు కొండబోయిన వెంకటేశ్వర్లు, వేల్పుల మరియదాసు, బత్తుల వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాయకాపురం : మంగళగిరి ఎయిమ్స్ పాలక మండలి సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా ఎంపీ కేశినేని చిన్నిని సెంట్రల్ టీడీపీ నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్ గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో ఎంపీ కేశినేని చినిని సత్కరించారు.



ఎంపీని కలిసిన రేపూడి సాగునీటి సంఘ అధ్యక్షుడు బాబురెడ్డి



కేసముద్రంలోని ఎంకే కన్వెన్షన్ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

'తెలుగు' రాజకీయాలను శాసించేది కాపులే!

▸ పార్టీలు వేరైనా కాపులంతా కలిసికట్టుగా ఉండాలి: గంటా

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల రాజకీయాలను శాసించే శక్తి ఒక్క మున్నూరు కాపులకే ఉందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అమినాపురంలో మున్నూరుకాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఎంకే కన్వెన్షన్‌ను సంఘం అధ్యక్షుడు చందా గోపితో కలిసి గంటా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లోని కాపుల్లో రకరకాల పేర్లతో విభజించి ఐక్యతను దెబ్బతీయాలని చూస్తున్నారని, అన్ని రకాల కాపులు ఒక్కటేనని పేర్కొన్నారు. పార్టీలు వేరైనా మున్నూరుకాపులంతా కలిసికట్టుగా ఉండాలని సూచించారు. ఇక్కడి కన్వెన్షన్ హాల్‌కు రూ.5 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు.

జమిలి మంచిదే: కేంద్ర మంత్రి పెమ్మసాని

పెదకాకాని, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు పెట్టడం మంచిదేనని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. అయితే జమిలి ఎన్నికలకు ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. ఆదివారం గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని వీవీఐటీ కళాశాల ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ విధంగా చెప్తే ఆ విధంగా నడుచుకుంటామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల కోసం పార్లమెంట్లో చట్టం చేయబోతోందని, దానిని అందరూ ఆమోదించాల్సి ఉందని చెప్పారు.

అల్లు అర్జున్‌కు జగన్ వత్తాసు నీచాతినీచం

▸ సీపీఐ రామకృష్ణ

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్.. సినీ హీరో అల్లు అర్జున్‌కు వత్తాసుగా మాట్లాడటం నీచాతినీచమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఓట్ల కోసం రాజకీయ నేతలు సినిమా హీరోలకు ఊడిగం చేయడం సిగ్గుచేటన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'హైదరాబాద్ సంధ్య థియేటర్ ఘటనలో కనీస మానవత్వంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా రూ.వందల కోట్లు రెమ్యునరేషన్ తీసుకున్న సినిమా హీరోకి జగన్, బండి సంజయ్ వత్తాసు పలకడం సిగ్గుచేటు. పుష్ప-2 సినిమా టిక్కెట్ ధర రూ.1200లకు పెంచడం దారుణం. అని రామకృష్ణ వివరించారు.

వర్సిటీలకు వీసీలను నియమించండి

యూనివర్సిటీలకు వెంటనే వీసీలను నియమించాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు. ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలైనా ఇంకా ఉన్నత విద్యామండలికి చైర్మన్‌ను నియమించలేదని పేర్కొన్నారు. 4,439 ప్రొఫెసర్ పోస్టుల భర్తీ మధ్యలోనే ఆగిపోయిందన్నారు.

అల్లుడూ ఎలా ఉన్నావ్?.. అర్జున్‌కు చిరంజీవి పలకరింపు

హైదరాబాద్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట కేసులో శనివారం జైలు నుంచి విడుదలైన అల్లు అర్జున్.. తన మామ, సినీనటుడు చిరంజీవిని ఆదివారం కలిశారు. భార్య స్నేహారెడ్డి, పిల్లలు అయాన్, అర్హతో కలిసి ఆదివారం మధ్యాహ్నం చిరంజీవి నివాసానికి వెళ్లారు. మరో కారులో అల్లు అరవింద్ వారిని అనుసరించారు. కాగా, చాలాకాలం తర్వాత తమ ఇంటికి వచ్చిన అల్లు అర్జున్‌ను చిరంజీవి దంపతులు సాదరంగా ఆహ్వానించారు. 'అల్లుడూ ఎలా ఉన్నావ్' అని అడుగుతూ చిరంజీవి ఆలింగనం చేసుకున్నారు.

రాష్ట్రంలో సాహితీ పర్యాటకం..!

▸ తెలుగు భాష అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

▸ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆధ్యాత్మిక పర్యాటకం, చారిత్రక స్థలాల పర్యాటకం ఉన్న మాదిరిగానే సాహితీ పర్యాటకం కూడా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిప్రాయపడ్డారు. ఆదివారమిక్కడ మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ కమిటీ ప్రతినిధులు ఆయన్ను కలిశారు. 35 ఏళ్ల నుంచి విజయవాడలో పుస్తక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని చెబుతూ అందుకు సంబంధించిన వివరాలను వారు తెలియజేశారు. కొన్నేళ్లుగా పుస్తక మహోత్సవం నిర్వహణకు అవసరమైన స్థలం లేక ఇబ్బందులుపడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. శ్రీశ్రీ, గురజాడ, చలం, గుర్రం జాషువా, విశ్వనాథ సత్యనారాయణ, తిలక్, దేవులపల్లి కృష్ణశాస్త్రి లాంటి గొప్ప కవులు, రచయితల స్వస్థలాలు, అక్కడ వారి జ్ఞాపకాలను కాపాడడం.. వారి సాహిత్య సేవలు తెలిపే స్మారక కేంద్రాల నిర్మాణం వంటి వాటి ద్వారా ఆ ప్రాంతాలను అభివృద్ధి చేయవచ్చన్నారు. మాతృ భాషపై నవతరంలోనూ, చిన్నారుల్లోనూ ప్రేమాభిమానాలు పెంచడంతో పాటు మన కవులు, రచయితల గొప్పదనాన్ని తెలియజేసేలా తెలుగు సాహితీ యాత్రలు నిర్వహించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. 'వేటపాలెం గ్రంథాలయం, రాజమహేంద్రవరం గౌతమి గ్రంథాలయం, కడప సి.పి.బ్రౌన్ గ్రంథాలయం లాంటి ప్రముఖ గ్రంథాలయాలు ఏపీలో ఉన్నాయి. వీటిని, కవులు, రచయితల నివాసాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్స్ ఏర్పాటు చేయవచ్చు. ఈ అంశంపై భాషా, సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ ప్రణాళికలు రూపొందించాలి' అని చెప్పారు. ఆయన్ను కలిసినవారిలో బుక్ ఫెస్టివల్ ప్రతినిధులు టి.మనోహర్ నాయుడు, కె.లక్ష్మయ్య, గొల్లనారాయణరావు, సాందీపని ఉన్నారు.



విజయవాడలో జరగనున్న బుక్ ఫెస్టివల్‌కు రావాలని కోరుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఆహ్వానం అందిస్తున్న బుక్ ఫెస్టివల్ ప్రతినిధులు

తప్పు నాదే.. క్షమించండి

▸ జర్నలిస్టు రంజిత్‌తో మోహన్ బాబు

▸ కొడుకు విష్ణుతో కలిసి ఆస్పత్రికి వెళ్లి పరామర్శ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుపై దాడి ఘటనలో సినీనటుడు మోహన్ బాబు తన తప్పును అంగీకరించారు. బాధిత జర్నలిస్టు రంజిత్, అతని కుటుంబ సభ్యులకు స్వయంగా క్షమాపణలు చెప్పారు. జల్‌పల్లిలోని తన నివాసం వద్ద తాను చేసిన దాడిలో గాయపడి ఆస్పత్రిపాలైన జర్నలిస్టు రంజిత్‌ను మోహన్ బాబు ఆదివారం పరామర్శించారు. తన కుమారుడు మంచు విష్ణుతో కలిసి సోమాజీగూడలోని యశోద ఆస్పత్రికి ఆదివారం మధ్యాహ్నం వెళ్లిన ఆయన.. బాధిత జర్నలిస్టుకు క్షమాపణ చెప్పారు. రంజిత్ కుమార్తె, ఇతర కుటుంబసభ్యులకు కూడా క్షమాపణలు తెలియజేశారు. ఆ రోజు జరిగిన ఘటనకు తాను బాధపడుతున్నానని, అలా జరిగి ఉండాల్సింది కాదని, తప్పు తనదేనని రంజిత్‌తో అన్నారు. క్షమించమని అడగడం తప్ప.. ఏమీ మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నానని రంజిత్, అతని భార్యాపిల్లలకు వివరణ ఇచ్చుకున్నారు. అలాగే, రంజిత్ కుమార్తెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఎత్తుకున్నారు. సారీ తల్లి నా వల్లే మీ నాన్నకు ఈ పరిస్థితి వచ్చిందని ఆ చిన్నారితో అన్నారు. అనంతరం, రంజిత్, అతని కుటుంబసభ్యులతో మాట్లాడి.. రంజిత్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రెండు కాళ్లు, భుజాలు, కళ్లకు శస్త్రచికిత్స చేయించుకున్న తనకు.. శస్త్రచికిత్సల బాధ ఎలా ఉంటుందో తెలుసునని ఈ సందర్భంగా వారితో అన్నారు. రంజిత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రంజిత్ కుటుంబానికి అండగా ఉంటానని, ఏ సాయం చేయడానికైనా సిద్ధమని హామీ ఇచ్చారు. సుమారు 15 నిమిషాల పాటు మోహన్‌బాబు.. జర్నలిస్టు రంజిత్ వద్ద ఉన్నారు.



రంజిత్ కుటుంబసభ్యులతో మంచు కుటుంబం



కిందపడిన టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల, ఇతర నేతలను పైకి లేవదీస్తున్న దృశ్యం

కౌడా చైర్మన్ ప్రమాణస్వీకారోత్సవంలో అపశ్రుతి

▸ ఎక్కువ మంది ఎక్కడంతో కూలిన వేదిక

▸ ఇద్దరు ఎమ్మెల్యేలు సహా పలువురికి స్వల్ప గాయాలు

సర్పవరం జంక్షన్ (కాకినాడ), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కౌడా) చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అపశ్రుతి చోటు చేసుకుంది. చైర్మన్‌గా జనసేన నేత తుమ్మల రామస్వామి(బాబు) ప్రమాణస్వీకారం చేయాల్సి ఉండగా.. వేదిక పైకి ఎక్కువ మంది ఎక్కడంతో అకస్మాత్తుగా అది కుప్పకూలింది. దీంతో స్టేజీపై ఉన్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, తుమ్మల రామస్వామితో సహా పలువురు కూటమి నాయకులు కింద పడిపోయారు. ఈ పరిణామంతో సభా ప్రాంగణంలో కొంత తొక్కిసలాట జరిగింది. పోలీసులు, భద్రతా సిబ్బంది, నాయకులు తేరుకుని కిందపడిన వారికి రక్షణ వలయంగా ఉండి.. పైకి లేపి సపర్యలు చేశారు. ఎమ్మెల్యే చినరాజప్ప కాలికి స్వల్ప గాయం కాగా, ఆయన సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయారు. యనమల ప్రమాణస్వీకారం వరకు ఉండకుండా మధ్యలోనే తన క్యాంపు కార్యాలయానికి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే నానాజీకి వీపు, తలకు దెబ్బలు తగిలాయి. అనంతరం నానాజీ అధ్యక్షతన మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా కౌడా చైర్మన్‌గా తుమ్మల రామస్వామితో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో కౌడా వైస్ చైర్‌పర్సన్, కమిషనర్ భావన, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మాజీ ఎమ్మెల్యే వర్మ, ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణు అనుచరులతో ప్రాణహాని ఉంది

▸ జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోశారు: మంచు మనోజ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంచు మోహన్‌బాబు కుటుంబంలో మరో వివాదం తెరపైకి వచ్చింది. అన్నదమ్ములు విష్ణు, మనోజ్ మధ్య మళ్లీ విభేదాలు భగ్గుమన్నాయి. జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్‌ను పోసి విద్యుత్తు సరఫరా నిలిపివేయడం ద్వారా విష్ణు అనుచరులు నన్ను, నా కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేశారని మంచు మనోజ్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం మీడియాకు ఓ లేఖ విడుదల చేశారు. "నన్ను, నా కుటుంబాన్ని మంచు విష్ణు, అతడి అనుచరులు పలు విధాలుగా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. శనివారం నేను షూటింగ్‌కు వెళ్లగా.. నా భార్య కుమారుడి స్కూల్‌లో జరుగుతున్న కార్యక్రమానికి వెళ్లారు. మా అమ్మ పుట్టిన రోజు సందర్భంగా కేక్ ఇచ్చే నెపంతో మంచు విష్ణుతోపాటు అతడి అనుచరులు రాజ్ కందూరు, కిరణ్, విజయ్ రెడ్డితోపాటు కొంతమంది బౌన్సర్లు ఇంటికి వచ్చారు. ఈ సమయంలో వారు నా జనరేటర్‌లో పంచదార కలిపిన డీజిల్ పోశారు. దీని కారణంగా కరెంట్ సరఫరాలో తీవ్ర అంతరాయంతోపాటు జనరేటర్ నుంచి నిప్పు రవ్వలు ఎగిసిపడ్డాయి. జనరేటర్‌కు సమీపంలోనే కార్లు, గ్యాస్‌కు సంబంధించిన కనెక్షన్లు ఉన్నాయి. ఒకవేళ నిప్పురవ్వల కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉంటే ఇంట్లో ఉన్న నా 9 నెలల పాప, వృద్ధురాలైన నా తల్లి, అంకుల్, ఆంటీల ప్రాణాలకు ముప్పు ఏర్పడేది. మా అమ్మ పుట్టిన రోజున ఇలా జరగడం నా మనసును కలిచివేసింది. ఇది పూర్తిగా కుటుంబ సమస్య.. కానీ నా కుటుంబ క్షేమం, రక్షణ కోసం అన్ని అంశాలను బహిరంగపర్చాల్సి వస్తోంది. నేడు ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా" అని పేర్కొన్నారు.

వెంటిలేటర్‌పైనే శ్రీతేజ

▸ బాలుడి కుటుంబానికి అల్లు అర్జున్ రూ.కోటి ఇవ్వాలి: మంద కృష్ణ

హైదరాబాద్, రాంగోపాల్‌పేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న శ్రీతేజకు ఇంకా వెంటిలేషపై ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సికింద్రాబాద్‌లోని కిమ్స్ కడిల్స్ ఆస్పత్రి వైద్యులు తెలిపారు. శ్రీతేజకు అందిస్తున్న చికిత, అతడి ఆరోగ్యస్థితిపై ఆదివారం సాయంత్రం ఆస్పత్రి హెల్త్‌బులిటెన్ విడుదల చేసింది. ఆస్పత్రిలో బాబుకు పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ)లో చికిత్స కొనసాగుతోందని వైద్యులు చేతన్ ఆర్. ముందాడ, విష్ణు తేజ్ తెలిపారు. శ్రీతేజ వైటల్ పారామీటర్స్ స్థిరంగా ఉన్నాయని, ట్యూబ్ ద్వారా ఇచ్చే ఆహారం బాగానే తీసుకుంటున్నాడని పేర్కొన్నారు. జ్వరం వస్తోందని.. మెదడు, నాడి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నాడని వివరించారు. నాడీ సంబంధిత ఆరోగ్య స్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కాగా శ్రీతేజను పరామర్శించేందుకు ఆదివారం ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆస్పత్రికి వచ్చారు. అతడి ఆరోగ్యస్థితి గురించి వైద్యులను, బాలుడి తండ్రి భాస్కర్‌ను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. శ్రీతేజ కుటుంబానికి అల్లు అర్జున్ రూ.కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీతేజను సినీ పరిశ్రమ, మా అసోసియేషన్ సభ్యులు కూడా ఆదుకోవాలని కోరారు. శ్రీతేజను పరామర్శించడానికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి కూడా ఆస్పత్రికి వచ్చారు.

నవ్య | చిత్రజ్యోతి

విడుదల తేదీ ఖరారు

క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క శెట్టి నటిస్తున్న 50వ చిత్రం 'ఘాటి'. రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేసి సినిమాపై అంచనాలను పెంచేశారు. ఆదివారం ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు మేకర్స్. సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 18న విడుదలవుతున్నట్లు ఓ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో అనుష్క లుక్‌ను ప్రజెంట్ చేస్తూ.. 'విక్టిమ్.. క్రిమినల్.. లెజెండ్' అని పేర్కొన్నారు. అనుకోని పరిస్థితుల్లో లోతైన సమస్యలో కూరుకుపోయిన ఓ మహిళ.. తనకు జరిగిన అన్యాయంపై పోరాడి ..వారిపై ప్రతీకారం తీర్చుకోవడమే కథాంశంగా ఈ సినిమా తెరకెక్కనుంది. కాగా, క్రిష్ దర్శకత్వంలో దాదాపు 14 ఏళ్ల తర్వాత అనుష్క నటిస్తుండటం విశేషం. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'వేదం' విమర్శకుల ప్రశంసలతో పాటు క్లాసికల్ హిట్ స్టేటస్‌ను సంపాదించుకుంది.





శివకార్తికేయన్‌తో శ్రీలీల

తమిళ హీరో శివకార్తికేయన్ కథానాయకుడిగా నటిస్తున్న నూతన చిత్రం ఖరారైంది. 'ఎస్‌కే 25' వర్కింగ్ టైటిల్. సుధాకొంగర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయిక. జయం రవి, అథర్వ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఆకాశ్ భాస్కరన్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శివకార్తికేయన్ ప్రతిభావంతుడైన నటుడు. ఆయనతో సినిమా చేసే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది. భారీ బడ్జెట్‌తో గ్రాండ్‌గా నిర్మిస్తున్నాం' అని చెప్పారు. జీవీ ప్రకాశ్‌కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కె. చంద్రన్.



బిగ్‌బాస్ సీజన్ 8 గెలుపుగుర్రం నిఖిల్

ఒక టీవీ షో.. ప్రతి సంవత్సరం దాదాపు మూడు నెలల పాటు ప్రేక్షకులు టీవీలకు అతుక్కుపోయేలా చేస్తోంది. కొన్ని సంవత్సరాలుగా ప్రేక్షకులకు అంతులేని వినోదంతో పాటు మరిచిపోలేని జ్ఞాపకాల్ని పంచిన ఆ షో బిగ్‌బాస్. గత ఏడు సీజన్‌లు అందించిన వినోదానికి ఏ మాత్రం తగ్గకుండా సెప్టెంబర్ 1న మొదలైంది తెలుగు బిగ్‌బాస్ సీజన్ 8. 105 రోజుల పాటు ఆసక్తికరమైన మలుపులతో ప్రేక్షకులను విశేషంగా అలరించి.. ఆదివారం జరిగిన గ్రాండ్ ఫినాలేతో ముగిసింది. బిగ్‌బాస్ సీజన్ 8 గేమ్ షో విజేత ఎవరో తెలిసిపోయింది. ఈ ఏడాది షో విన్నర్‌గా నిఖిల్‌ను వ్యాఖ్యాత నాగార్జున ప్రకటించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రామ్‌చరణ్.. విజేతకు ట్రోఫీతో పాటు రూ.55 లక్షల ప్రైజ్‌మనీ, మారుతీ సుజుకీ డాజ్లింగ్ డిజైర్ కారుని అందజేశారు. ఇప్పటివరకు జరిగిన అన్ని సీజన్ల కన్నా ఈ సీజన్ ప్రైజ్ మనీ ఎక్కువ కావడం విశేషం. విజేతకు చివరి వరకు గట్టి పోటీనిచ్చిన గౌతమ్‌కృష్ణ రన్నరప్‌గా మిగిలారు. టాప్ 5 కంటెస్టెంట్లుగా పోటీ చేసిన నబీల్, ప్రేరణ, అవినాశ్‌లకు ప్రేక్షకుల నుంచి వచ్చిన ఓట్ల ఆధారంగా వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాలు దక్కాయి. ఎలిమినేషన్ ప్రక్రియలో ఐదో స్థానంలో నిలిచిన అవినాశ్‌ను హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ .. నాలుగో స్థానంలో ఉన్న ప్రేరణను కన్నడ స్టార్ ఉపేంద్ర.. మూడో స్థానంలో మిగిలిన నబీల్‌ను విజయ్‌సేతుపతి, మంజు వారియర్ బయటకు తీసుకుని వచ్చారు.

నభానటేష్ స్టెప్పులు

ఈ ఏడాది గ్రాండ్ ఫినాలేలో హీరోయిన్ నభా నటేశ్ స్పెషల్ పర్ఫామెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. 'పుష్ప 2'లోని 'వస్తున్నాయ్ పీలింగ్స్' పాటతో పాటు మరికొన్ని సాంగ్స్‌కు స్టెప్పులేసి అలరించారు. పలువురు సినీతారలు తళుక్కుమనడం.. శ్రీకృష్ణ, గీతా మాధురి పాటల ప్రదర్శన.. టాప్ 5 కంటెస్టెంట్స్ ఆటపాటలతో షో ఆకట్టుకుంది. నాగార్జున జరిపిన సరదా సంభాషణలు.. సీజన్ 8 హౌజ్‌ను చూపించి అందర్నీ గతంలోకి తీసుకెళ్లడం.. ఇలా ఫినాలే ఆరంభం నుంచి విన్నర్‌ని ప్రకటించేదాకా వరకు హౌజ్‌లో జరిగిన హంగామా అంతా ప్రేక్షకులకు వినోదాన్ని పంచింది.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

సీజన్ 7 ఫినాలే తర్వాత జరిగిన గొడవల్ని, అల్లర్లను దృష్టిలో పెట్టుకున్న పోలీసులు.. ఈ ఏడాది అలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 300 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. అభిమానులు ఎవ్వరూ స్టూడియోస్‌కు రావొద్దని.. విజేతను ప్రకటించాక ఊరేగింపులు, ర్యాలీలు చేయొద్దని పోలీసులు సూచించారు.



సినీ ఫైనాన్షియర్ బంగారు బాబు (ఈ.వి.రాజారెడ్డి) తనయుడు క్రాంతి రెడ్డి నిశ్చితార్థం పారిశ్రామికవేత్త సీతారామిరెడ్డి కుమార్తె శిరీషతో ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి గ్రూప్స్ అధినేత వేమూరి రాధాకృష్ణ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. అలాగే పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కథానాయిక కీర్తిసురేశ్ ఇటీవలే తన ప్రియుడు ఆంటోని తట్టిల్‌ను పెళ్లాడిన విషయం తెలిసిందే. తొలుత ఈ నెల 12న గోవాలో వీరి వివాహం హిందూ సంప్రదాయ పద్ధతిలో జరగ్గా, తర్వాత క్రైస్తవ సంప్రదాయాన్ని అనుసరించి వీరిద్దరూ ఒక్కటయ్యారు. ఆ ఫొటోలను కీర్తిసురేశ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

గర్వంగా ఉంది



వెట్రిమారన్ దర్శకత్వంలో విజయ్‌సేతుపతి నటించిన చిత్రం 'విడుదల 2'. గతేడాది రిలీజై విజయం సాధించిన 'విడుదల' పార్ట్ 1కు కొనసాగింపుగా ఇది తెరకెక్కింది. సూరి, మంజు వారియర్ కీలక పాత్రల్లో నటించారు. నిర్మాత చింతపల్లి రామారావు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయ్‌సేతుపతి మాట్లాడుతూ "ఈ సినిమాలో నటించినందుకు ఎంతో గర్వంగా ఉంది. నా సినిమాల్ని ఇంతలా ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకుల సపోర్ట్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. ఇళయరాజా అందించిన సంగీతం ఈ చిత్రానికి ప్రధానాకర్షణ. చిత్రం తప్పకుండా మీ అందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. "ఈ సినిమా ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. ఇది తెలుగు నేటివిటీకి దగ్గరగా ఉన్న సినిమా" అని నిర్మాత చింతపల్లి రామారావు అన్నారు.



శరవేగంగా చిత్రీకరణ

స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జీవిత విశేషాల ఆధారంగా దిలీప్ రాజా దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'బాబు జగ్జీవన్ రామ్'. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ప్రదీప్ దోనెపూడి. బాబు జగ్జీవన్ రామ్ పాత్రలో మిలటరీ ప్రసాద్ నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. హైదరాబాద్ ఫిల్మ్‌ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం షూటింగ్ వివరాలను వివరించింది. చిత్రదర్శకుడు దిలీప్ రాజా మాట్లాడుతూ 'జగ్జీవన్ రామ్ సేవల గురించి ప్రేక్షకులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. జగ్జీవన్‌రామ్ వర్ధంతి అయిన జూలై 6న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

అందరికీ నచ్చుతుంది



కేవీజీ రాజు దర్శకత్వంలో లోకేశ్ బాబు దాసరి, శిరీష హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'ఉల్లా సంగానే ఉత్సాహంగానే'. శ్రీ మైత్రీ క్రియేషన్స్ పతాకంపై యార్లగడ్డ ఉమామహేశ్వరరావు నిర్మిస్తున్నారు. ఎండీ కలామ్, ఖదీర్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకుడు కేవీజీ రాజు మాట్లాడుతూ' ఈ చిత్రంలో లోకేశ్ ఎనర్జిటిక్‌గా నటించాడు. త్వరలో సాంగ్స్ ట్రైలర్ రిలీజ్ చేస్తాం' అని తెలిపారు. నిర్మాత ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ' ఒక మంచి లవ్ స్టోరీని తెరకెక్కించాం. మీ అందరికీ నచ్చుతుందని భావిస్తున్నా' అని అన్నారు.

లైంగికంగా వేధించాడు





బాలీవుడ్ సంగీత దర్శకుడు రాజేశ్ రోషన్ తనను లైంగికంగా వేధించారని గాయని లగ్నజితా చక్రబర్తి ఆరోపించారు. సంగీత చర్చల కోసం తన ఇంటికి పిలిచిన రాజేశ్ రోషన్ అసభ్యకరంగా తాకారని ఆమె చెప్పారు. ఓ ఇంటర్వ్యూలో లగ్నజితా మాట్లాడుతూ 'నేను ముంబైలో ఉన్న రోజుల్లో ఓ సారి రాజేశ్ రోషన్ పిలవడంతో వారి ఇంటికి వెళ్లాను. వాద్య పరికరాలతో నిండి ఉన్న గదిలోకి నన్ను తీసుకెళ్లి కూర్చోబెట్టారు. నాక్కొంచెం దూరంలో ఆయన కూర్చున్నారు. నేను ఫోన్ చూస్తుండగా, రాజేశ్ రోషన్ నెమ్మదిగా నా వైపు కదలడం గమనించాను. అతను ఏం చేస్తాడో చూద్దాం అని నేను గమనించనట్లే ఊరుకున్నాను. రాజేశ్ రోషన్ నా స్కర్ట్‌లోకి తన చేతులను దూర్చాడు. నేను వెంటనే తేరుకొని అక్కడ నుంచి బయటకు పరుగుతీశాను. జుగుప్సాకరమైన ఆ సంఘటన గురించి కెమెరా ముందు మాట్లాడలన్నా సిగ్గుగా ఉంది. మొదట దిగ్భ్రాంతికి గురయ్యాను. అయితే జరిగిన దాంట్లో నా తప్పేం లేదు, అతనిది దిగజారుడు వ్యక్తిత్వం అని అర్థం చేసుకొని, ఆ సంఘటన వల్ల క్షోభకు గురికాకుండా నన్ను నేను కాపాడుకున్నాను' అని తెలిపారు. లగ్నజితా ఆరోపణలపై రాజేశ్ రోషన్ స్పందించలేదు.



మా త్యాగాల కంటే
నితీష్ శ్రమే ఎక్కువ

స్టార్ బ్యాట్స్‌మెన్ విఫలమైన చోట... అలవోకగా అతడు బౌండరీలు బాదాడు. బౌన్సీ పిచ్‌లు అయినా... బౌలర్ ఎవరైనా... సొగసైన ఆటతో ఆకట్టుకున్నాడు. అతడి విజయం వెనుక తల్లి అలుపెరుగని కృషి ఉంది. ఆమె నింపిన ఆత్మవిశ్వాసం ఉంది. ఆస్ట్రేలియా పర్యటనతో భారత టెస్టు జట్టులోకి వచ్చి... అరంగేట్రం సిరీస్‌లోనే అద్భుతంగా రాణిస్తున్న ఆల్‌రౌండర్ నితీష్‌కుమార్‌రెడ్డి తల్లి మానసతో 'నవ్య' ప్రత్యేక ఇంటర్వ్యూ.

"చిన్నప్పుడు నితీష్ యానిమేషన్ వీడియోలు, సినిమాలు విపరీతంగా చూసేవాడు. ఆ సమయంలో 'వీడు క్రికెట్‌ను సీరియస్‌గా తీసుకొంటాడా' అనే సందేహం కలిగేది. అంతేకాదు... బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌పై కూడా దృష్టి పెట్టినప్పుడు... 'ఆల్‌రౌండర్‌గా వాడి కెరీర్ ఎలా ఉంటుందో'నని భయమేసింది. కానీ ప్రస్తుత ఆస్ట్రేలియా సిరీస్‌లో నితీష్ ఆటను ఉద్దండులు సైతం మెచ్చుకొంటుంటే మనసు ఉప్పొంగుతోంది. విశాఖపట్టణం 'హిందుస్థాన్ జింక్ స్కూల్‌'లో మూడో తరగతి చదువుతున్నప్పుడే వాడికి క్రికెట్ మీద మోజు మొదలైంది. రోజూ బ్యాట్ పట్టుకుని గ్రౌండ్‌కు వెళ్లేవాడు. మావారు ముత్యాల రెడ్డికి కూడా ఆటలపై ఆసక్తి ఉండడంతో కొడుకును మంచి క్రికెటర్‌ను చేయాలనుకున్నారు. దగ్గరుండి గ్రౌండ్‌కు తీసుకువెళ్లేవారు. క్రికెట్‌లో లీనమై చదువును నిర్లక్ష్యం చేస్తాడేమోనని అనిపించేది నాకు. అయితే కోచ్‌లందరూ నితీష్ ఆటను మెచ్చుకుంటుంటే ఆనందంగా ఉండేది. 'భవిష్యత్తులో మంచి క్రికెటర్ అవుతాడ'ని వాళ్లు ఎప్పుడూ అంటుండేవారు.

ఆర్థికంగా ఇబ్బందులు పడినా...

మావారిది 'హిందుస్తాన్ జింక్‌'లో ఉద్యోగం. ఆర్థిక సమస్యలు లేకుండా జీవితం సాఫీగానే సాగిపోయేది. అయితే నితీష్ క్రికెట్ కెరీర్‌ను బాగా తీర్చిదిద్దాలనే తపనతో ఆయన ఉద్యోగానికి రాజీనామా చేశారు. దాంతో ఆర్థిక సమస్యలు తలెత్తాయి. అయినా నితీష్ కెరీర్‌కు ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. దానికోసం ఆటుపోట్లు ఎన్నిటినో తట్టుకుంటూ ముందుకుసాగాం. కాస్త పెద్దయ్యాక మా అబ్బాయికి మేము పడుతున్న కష్టాలు అర్థమయ్యాయి. కెరీర్‌పై మరింత శ్రద్ధ పెట్టాడు. కఠోర సాధన చేశాడు. వచ్చిన ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలనే పట్టుదల వాడిలో ఉంది. దాదాపు ప్రతి మ్యాచ్‌లో పరుగుల వరదతో సెలెక్టర్లను, కోచ్‌లను ఆకర్షించాడు. నితీష్ కోసం మేము చేసిన త్యాగాల కంటే... మా నమ్మకాన్ని నిలబెట్టడానికి వాడు పడిన శ్రమే ఎక్కువ.

అకాడమీలో వదల్లేకపోయాం...

కడప 'ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్' (ఏసీఏ) అకాడమీలో నితీష్‌కు అవకాశం వచ్చింది. అక్కడైతే వాడి ఆటతీరు మరింత మెరుగుపడుతుందని, కెరీర్ బాగుంటుందని చెప్పడంతో కడప తీసుకువెళ్లాం. అయితే అకాడమీలో వాడిని వదిలిపెట్టేందుకు మాకు మనసు రాలేదు. రెండు రోజులు అక్కడే ఉండి ప్రాక్టీస్ సెషన్‌కు బస్సులో వెళుతున్నప్పుడు చూసేవాళ్లం. నేనైతే తిరిగి రాలేకపోయాను. అక్కడ సాధన చేస్తే నితీష్ కెరీర్ బాగుంటుందని చెప్పి మావారు నన్ను ఓదార్చారు.

నాన్న పేరు చెబితే...

నాన్నంటే నితీష్‌కు చిన్నతనం నుంచి భయం. భోజనం తినేందుకు మారాం చేస్తే... 'నాన్న వస్తున్నార'ని చెప్పి తినిపించేదాన్ని. స్కూల్ హోమ్‌వర్కు చేయకపోయినా నాన్న పేరు చెబితే చాలు... చేసేసేవాడు. వాళ్ల అక్క తేజస్విని బాగా ఆటపట్టించేవాడు. తనంటే వాడికి ఎంతో ప్రేమ. మా అమ్మాయి మంచి ఆర్టిస్టు. తను వేసే చిత్రాలు చూసి



సరదాగా ఏదో ఒకటి అనేవాడు. కానీ మ్యాచ్‌ల కోసం వేరే ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఫోన్ చేసి అక్క గురించే ఎక్కువగా అడుగుతాడు. అలాగే నితీష్‌కు తన మామయ్య నరేందర్‌రెడ్డి అన్న చాలా ఇష్టం. ఆయనన్నా వాడికి భయం. కెరీర్‌లో ముందుకువెళ్లే క్రమంలో ఇద్దరూ మంచి స్నేహితుల్లా మారిపోయారు.

మాకు నమ్మకం కుదరలేదు...

'జింబాబ్వేలో టీ20 సిరీస్‌కు వెళ్లే భారత జట్టుకు ఎంపికయ్యా'నని మావారికి నితీష్ ఫోన్ చేసి చెప్పాడు. అయితే వాళ్ల నాన్న నమ్మలేదు. ఆ విషయం తను నాతో చెప్పి... 'నితీష్ సరదాగా చెప్పాడా' అని అడిగారు. 'సరదాకు మీకు అలా చెప్పడు కదా' అన్నాను. ఆయనకే కాదు... నాకూ నమ్మకం కుదరలేదు. మరుసటి రోజు జింబాబ్వే పర్యటనకు వెళ్లే భారత జట్టులో నితీష్‌కు స్థానం లభించినట్టు వార్తలు వచ్చాయి. అవి చూసి ఎంతో సంబరపడ్డాం. కానీ ఆ మర్నాడే గాయం కారణంగా నితీష్ జట్టు నుంచి తప్పుకోవాల్సిరావడం వాడినే కాదు... మమ్మల్ని కూడా ఎంతో బాధకు గురి చేసింది. గాయం తగ్గడానికి ఐదు వారాలు విశ్రాంతి తీసుకోవాల్సి రావడంతో తర్వాత జరిగిన శ్రీలంక పర్యటనకు కూడా సెలక్టర్లు నితీష్‌ను ఎంపిక చేయలేదు.

ఆటకు ముందు ఫోన్ చేస్తాడు...

చివరకు ప్రస్తుత ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్‌కు జాతీయ జట్టులో నితీష్‌కు స్థానం లభించింది. అతడి ఆరాధ్య క్రికెటర్ విరాట్ కోహ్లీ నుంచి వాడు క్యాప్ అందుకోవడం, తనతో కలిసి బ్యాటింగ్ చేయడం ఎప్పటికీ మరిచిపోలేని అనుభూతి. ఈ సిరీస్‌లో జట్టుకు ఉపయోగపడే ఇన్నింగ్స్‌తో రాణించడం చూస్తుంటే మాకు ఎంతో సంతోషంగా ఉంది. మ్యాచ్‌లో దిగే ముందు తప్పనిసరిగా నాకు ఫోన్ చేస్తాడు. నేను ఆల్ ద బెస్ట్ చెబుతాను. అది మా ఇద్దరికీ సెంటిమెంటుగా మారిపోయింది. మ్యాచ్ తర్వాత కూడా ఫోన్ చేస్తాడు. ఆటలో రాణించినా... విఫలమైనా సరే... నాతో తన అనుభవాలను పంచుకొంటాడు.

జాలి గుణం ఎక్కువ....

నితీష్‌కు జాలిగుణం ఎక్కువ. రోడ్ల మీద వృద్ధులు, దివ్యాంగులు, మానసిక రోగులను చూస్తే చలించిపోతాడు. అప్పటికప్పుడు ఏదో ఒక సాయం చేసేస్తాడు. సినిమాల్లో సెంటిమెంట్ సన్నివేశాలు కూడా చూడలేడు. ఒకవేళ చూసినా... కళ్ల వెంట నీళ్లు కారిపోతుంటాయి. ఈ మధ్య మా ఇంటి దగ్గరున్న అనాథ శరణాలయంలో నితీష్ పుట్టిన రోజు వేడుకలు చేశాం. మంచి వంటకాలతో మధ్యాహ్న భోజనం పెట్టాం. కార్యక్రమం పూర్తిచేసుకుని ఇంటికి వచ్చేశాం. ఆ తరువాత నితీష్ బయటకు వెళ్లి అనాథలందరికీ ఐస్‌క్రీమ్‌లు కొని ఇచ్చాడు. 'ఇంతగా చలించిపోయేవాడు... బౌండరీలు బాదినప్పుడు పొరపాటు బౌలర్ ముఖంలో బాధ కనిపిస్తే జాలితో అవుటైపోతాడా' అనిపించేది.

వాడి కోసం క్రికెట్ తెలుసుకున్నా...

ఒకప్పుడు నాకు క్రికెట్‌పై కనీస అవగాహన ఉండేది కాదు. నితీష్ బాగా ఆడుతున్నాడని మావారితోపాటు బయటవాళ్లు చెప్పినప్పుడు సంతోషించేదాన్ని. కెరీర్ కోసం వాడు చూపుతున్న శ్రద్ధ, పడుతున్న శ్రమ గ్రహించి, నా వంతుగా క్రికెట్ కోసం కొంతైనా తెలుసుకోవాలని అనుకున్నాను. ఇప్పుడు బ్యాట్ పట్టుకుని ఆడలేను కానీ తప్పొప్పులు చెప్పగలను."

● పి.భాస్కర్, విశాఖపట్నం

కెరీర్ గురించి ఆలోచిస్తాడా..!

చిన్నప్పటి నుంచి యానిమేషన్ వీడియోలు, పవర్ రేంజర్స్ సినిమాలు అంటే నితీష్‌కు ఎంతో ఆసక్తి. ఇప్పటికీ ఖాళీ సమయం దొరికితే యానిమేషన్ ఫిలిమ్స్ చూస్తూ ఆస్వాదిస్తాడు. 'పవర్ రేంజర్స్' సిరీస్‌లు వదలకుండా చూస్తాడు. 'వీడు యానిమేషన్ వీడియోలు తెగ చూస్తున్నాడు. క్రికెట్ కెరీర్ గురించి సీరియస్‌గా ఆలోచిస్తాడా' అని ఒక్కోసారి నాకు సందేహం కలిగేది. కానీ దేని సమయం దానికి కేటాయించేవాడు. యానిమేషన్ వీడియోలు చూడడంవల్ల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతున్నాడని కొంతకాలానికి నాకు అర్థమైంది.

పవన్, మహేష్ అభిమాని...

నితీష్‌కు క్రికెట్‌లో విరాట్ కోహ్లీ ఆరాధ్య దైవం. సినిమాల్లో పవన్‌కల్యాణ్, మహేష్‌బాబు అంటే చాలా ఇష్టం. వాళ్లద్దరి సినిమాలు వదలకుండా చూస్తాడు. మిగిలినవాళ్ల చిత్రాలంటే అంతగా ఆసక్తి చూపడు.

వంకాయ వండొద్దు ప్లీజ్...

నితీష్ మితాహారి. కాయగూరలు తినడానికి ఇష్టపడేవాడు కాదు. మాంసాహారం ఇష్టం. కాయగూరలు వండితే కాదనలేక తినేవాడు. బయటకు వెళ్లే ముందు... 'అమ్మా... వంకాయ, బెండకాయ వండొద్దు ప్లీజ్' అని బతిమలాడేవాడు. 'వండను' అని చెప్పినా, చిన్న పిల్లాడిలా గెడ్డం పట్టుకొనిమరీ మళ్లీ అదే చెప్పేవాడు... 'ప్లీజ్ అవి వండకమ్మా' అని. ఇప్పటికీ అందులో ఎలాంటి మార్పూ రాలేదు.

అక్క చాక్లెట్లు లాక్కొని...

నితీష్‌కు చాక్లెట్లంటే చాలా ఇష్టం. బడికి వెళ్లినప్పుడు తనతోపాటు అక్కకు పెట్టిన చాక్లెట్స్ కూడా బలవంతంగా లాక్కొని తినేవాడు. ఇప్పటికీ చాక్లెట్స్ ఇష్టంగా తింటాడు.

నల్లని శిరోజాలకు జోజోబా నూనె

శిరోజాల సమస్యలను నివారించడంలో జోజోబా నూనె అద్భుతంగా పనిచేస్తుంది. ఈ నూనెలో బి, ఇ విటమిన్లు; జింక్, కాపర్ మినరల్స్ ఫాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. మాడు మీద ఈ నూనెతో మెల్లగా మర్దన చేస్తే వెంట్రుకల కుదుళ్లు గట్టిపడతాయి. తలమీద ఉన్న చర్మానికి రక్తప్రసరణ జరిగి శిరోజాలు నల్లగా ఒత్తుగా పెరుగుతాయి. మాడు మీద సెబమ్ ఉత్పత్తి నియంత్రణలో ఉండి వెంట్రుకలు జిడ్డుగా మారవు. జోజోబా నూనె అందించే మరికొన్ని ప్రయోజనాలు...

ఇ-విటమిన్‌తో: ఇ విటమిన్‌లో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉంటాయి. ఇవి శిరోజాలు ఆరోగ్యంగా పెరిగేందుకు దోహదం చేస్తాయి. రెండు ఇ విటమిన్ ట్యాబ్లెట్స్ నుంచి నూనెను తీసి ఒక చిన్న గిన్నెలో వేయాలి. దీనికి రెండు చెంచాల జోజోబా నూనె కలపాలి. ఈ మిశ్రమాన్ని అరచేతుల్లోకి తీసుకుని మాడు మీద గుండ్రంగా రాస్తూ మర్దన చేయాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీళ్లు, గాఢత లేని షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే వెంట్రుకలు రాలడం తగ్గుతుంది.

తేనెతో: తేనెలో అధికంగా తేమతోపాటు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి మాడుమీద చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఒక గిన్నెలో రెండు చెంచాల జోజోబా నూనె, ఒక చెంచా తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తలంతా పట్టించాలి. తరవాత షవర్ క్యాప్‌తో మూసివేయాలి. నలభై నిమిషాల తరవాత తలస్నానం



చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేస్తూ ఉంటే చుండ్రు సమస్యలు రాకుండా ఉంటాయి. శిరోజాలు పొడవుగా పెరుగుతాయి.

కొబ్బరినూనెతో: ఒక గిన్నెలో రెండు చెంచాల జోజోబా నూనె, ఒక చెంచా కొబ్బరి నూనె వేసి బాగా కలపాలి. రాత్రి పడుకునేముందు ఈ మిశ్రమాన్ని తలకు పట్టించాలి. పది నిమిషాలు మాడు మీద మసాజ్ చేయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తూ ఉంటే వెంట్రుకల కుదుళ్లకు రక్తప్రసరణ జరిగి అవి గట్టిపడతాయి. శిరోజాలు నల్లగా మెరుస్తుంటాయి. వెంట్రుకల చివర్లు పగలడం తగ్గుతుంది.

కలబంద గుజ్జుతో: కలబంద గుజ్జు మంచి ఆయుర్వేద ఔషధం. ఇది తలలో చుండ్రు, కురుపులు రాకుండా చేస్తుంది. ఒక గిన్నెలో రెండు చెంచాల కలబంద గుజ్జు, రెండు చెంచాల జోజోబా నూనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని వెంట్రుకల కుదుళ్లకు పట్టించాలి. అరగంట తరవాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే మాడు మీద పీహెచ్ స్థాయి తటస్థంగా మారుతుంది. వెంట్రుకలు రాలడం తగ్గుతుంది. బట్టతల సమస్య తీరుతుంది. వెంట్రుకలు తెల్లబడకుండా ఉంటాయి.



బెండకాయలతో బ్రహ్మాండంగా!

బెండకాయలతో తయారుచేసిన రకరకాల కూరలు, వేపుళ్లు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. వారానికి రెండుసార్లు బెండకాయలను ఆహారంలో చేర్చుకుంటే శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గి గుండె జబ్బులు రావు. రక్తం శుద్ధి అవుతుంది. బెండకాయల్లో ఫోలిక్ ఆమ్లం ఎక్కువగా ఉంటుంది. ఇది మెదడు పనితీరుని మెరుగుపరుస్తుంది. కాబట్టి బెండకాయ కూరలను పెరిగే పిల్లలు, గర్భిణులు తప్పనిసరిగా తినాలి. లేత బెండకాయలతో చేసే ప్రత్యేక వంటకాల వివరాలు మీ కోసం......

బెండకాయ మసాలా వేపుడు

అరకేజీ బెండకాయలను శుభ్రంగా కడిగి తేమ లేకుండా తుడవాలి. తరవాత చిన్న ముక్కలుగా కోయాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి రెండు చెంచాల వేరుశనగ గుండ్లు, రెండు చెంచాల తెల్ల నువ్వులు, అర చెంచా జీలకర్ర, రెండు చెంచాల ఎండు కొబ్బరి పొడి, నాలుగు వెల్లుల్లి రెబ్బలు వేసి ఎర్రగా వేపాలి. వీటిని చల్లార్చి మెత్తని పొడిలా చేయాలి. స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి అయిదు చెంచాల నూనె వేసి వేడి చేయాలి. అందులో రెండు కరివేపాకు రెమ్మలు తుంచి వేయాలి. తరవాత బెండకాయ ముక్కలు వేసి గిన్నెను కదిలిస్తూ వాటిని దోరగా వేపాలి. ముక్కలు వేగాక వాటిపై ఒక చెంచా ఉప్పు, ముప్పావు చెంచా కారం, ముందుగా తయారు చేసుకున్న మసాల పొడి, చిటికెడు పసుపు వేసి గిన్నెను పైకి కింది ఊపుతూ నాలుగు నిమిషాలు కలపాలి. గరిటెతో కలపకూడదు. కావాలనుకుంటే గరం మసాలా పొడి కూడా చల్లుకోవచ్చు. కొత్తిమీర తరుగు వేసి స్టవ్ మీద నుంచి దించాలి. ఈ వేపుడు వేడి అన్నంలోకి బాగుంటుంది. పిల్లలు బాగా ఇష్టపడతారు.

బెండకాయ పకోడీ

పావు కేజీ బెండకాయలను నిలువుగా చీలికల మాదిరి కోయాలి. ఒక గిన్నెలో అర చెంచా గరం మసాలా, ఒక చెంచా కార్న్‌ఫ్లోర్, అయిదు చెంచాల బియ్యం పిండి, ఒక చెంచా ధనియాల పొడి, రెండు చెంచాల కారం, ఒక చెంచా ఉప్పు, అరగ్లాసు నీళ్లు పోసి బజ్జీల పిండిలా కలపాలి. ఇందులో బెండకాయ చీలికలు వేసి పావు గంట నాననివ్వాలి. స్టవ్ మీద కడాయి పెట్టి నూనె పోసి వేడిచేయాలి. నూనె బాగా వేడెక్కాక అందులో బెండకాయ చీలికలను ఒక్కోటి వేయాలి.



ఎర్రగా వేగిన తరవాత టిష్యూ పేపర్‌లోకి తీయాలి. ఈ బెండకాయ పకోడీని చిరుతిండిగా పిల్లలకు పెట్టవచ్చు. టీ సమయంలో పెద్దవాళ్లు తినడానికి కూడా బాగుంటుంది.

టమాటా-భిండీ మసాలా

పావుకేజీ బెండకాయలకు మధ్యలో పొడవుగా గాటు పెట్టాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి అయిదు చెంచాల నూనె వేసి వేడయ్యాక పావు చెంచా జీలకర్ర, పావు చెంచా ఆవాలు వేయాలి. ఒక పెద్ద సైజు ఉల్లిపాయను సన్నగా తరిగి వేయాలి. అది కొద్దిగా వేగాక బెండకాయలు, ఒక చెంచా ఉప్పు వేసి బాగా కలిపి మూతపెట్టి మగ్గించాలి. అయిదు నిమిషాల తరవాత సన్నగా తరిగిన టమాటా ముక్కలు, చిటికెడు పసుపు వేసి కలపాలి. టమాటా ముక్కలు మెత్తగా అయిన తరవాత రెండు చెంచాల కారం, ఒక చెంచా ధనియాల పొడి. అర చెంచా గరం మసాలా పొడి, అరచెంచా ఉప్పు వేసి కలపాలి. అయిదు నిమిషాల తరవాత స్టవ్ మీద నుంచి దించి రెండు చెంచాల నిమ్మరసం, కొద్దిగా కొత్తిమీర తరుగు వేసి మెల్లగా కలపాలి. ఈ మసాలా కూర పుల్కాలు, చపాతీల్లోకి బాగుంటుంది.

భిండీ-వెల్లుల్లి వేపుడు

బెండకాయలను మధ్యలో చీల్చి ఉంచుకోవాలి. స్టవ్ మీద గిన్నె పెట్టి కొద్దిగా నూనె వేసి వేడిచేయాలి. అందులో పచ్చిమిర్చి చీలికలు, పొడవుగా కోసిన వెల్లుల్లి రెబ్బలు, చిటికెడు పసుపు, రెండు కరివేపాకు రెమ్మలు వేసి దోరగా వేపాలి. తరవాత బెండకాయలు వేసి కలపాలి. బెండకాయలు బాగా వేగాక రుచికి తగినంత ఉప్పు, కొంచెం మిరియాల పొడి వేసి కలపాలి. రెండు నిమిషాల తరవాత స్టవ్ మీద నుంచి దించి ఒక చెంచా నిమ్మరసం వేసి కలపాలి. ఈ వేపుడు కూడా వేడి అన్నంలోకి బాగుంటుంది.



కుటుంబ సభ్యుల బెదిరింపులు, ఊళ్లోవారి ఈసడింపులు... వేటికీ భయపడలేదు. బాగా చదువుకోవాలన్న తన కల... బాల్య వివాహం వల్ల నాశనమైపోతూ ఉంటే తలవంచుకొని కూర్చోలేదు. పరిస్థితుల మీద తిరగబడింది. తన ఆశయాన్ని నెరవేర్చుకోవడమే కాదు, ఎందరికో మార్గదర్శిగా నిలుస్తోంది. 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్' అందుకున్న పదిహేడేళ్ల జ్యోత్స్నా అఖ్తర్ స్ఫూర్తిదాయకమైన కథ ఇది...

మార్పునకు నాందిగా...
బాలికలకు అండగా

"కిందటి ఏడాది మే నెల. ఆ రోజు నేను బడి నుంచి ఇంటికి వచ్చేసరికి మా ఇల్లంతా సందడిగా ఉంది. ఎవరో కొత్త మనుషులు మా ఇంట్లో ఉన్నారు. నన్ను పెళ్లి చూపులు చూడడానికి వాళ్లు వచ్చారని అర్థమయింది. నన్ను అలంకరించడానికి మా అమ్మ, బంధువులు గదిలోకి తీసుకువెళ్లినప్పుడు నేను అభ్యంతరం చెప్పాను. కానీ ఎవరూ వినిపించుకోలేదు. పెళ్లి సంబంధం కోసం వచ్చిన వాళ్లు వెళ్లిపోయిన తరువాత... ఏడ్చాను, మొత్తుకున్నాను. నాకు బాగా చదువుకోవాలని ఉందనీ, పదహారేళ్ల వయసుకే పెళ్లి చేసుకోలేననీ చెప్పాను. మా కుటుంబ సభ్యులు నన్ను బెదిరించారు. ఇంట్లోంచీ గెంటేస్తామన్నారు. ఈ సంగతి తెలిసిన ఇరుగుపొరుగువారు కూడా నన్ను సూటిపోటి మాటలన్నారు. సంప్రదాయానికి విరుద్ధంగా ప్రవర్తిస్తే నాశనమైపోతావని శాపనార్థాలు పెట్టారు. కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ అప్పుడే పెళ్లి చేసుకోకూడదని నేను గట్టిగా నిశ్చయించుకున్నాను.

మేజిస్ట్రేట్ జోక్యంతో...

మాది దక్షిణ త్రిపురలోని బెలోనియా గ్రామం. మైనారిటీ జనాభా ఎక్కువ. పాత సంప్రదాయాలను పాటించడం, కట్టుబాట్లను కఠినంగా అమలు చేయడం కూడా ఎక్కువే. హైస్కూలు చదువు పూర్తవకుండానే ఆడపిల్లలకు పెళ్లి చేయడం సర్వసాధారణం. ఇరవయ్యేళ్లకే ముగ్గురు నలుగురు పిల్లలతో... వారి జీవితం ఇంటి పనులకే పరిమితమైపోతుంది. వారు పడుతున్న ఇబ్బందులు కళ్లారా చూశాను. నేను కూడా అలా కాకుండా ఉండాలంటే బాగా చదువుకోవాలి. నా కాళ్లమీద నేను నిలబడి స్వతంత్రంగా బతకాలి అనేది నా కల. కానీ సామాజికమైన ఒత్తిడికి లొంగిపోయి... నాకు పెళ్లి చెయ్యడానికి మావాళ్లు నిర్ణయించడంతో... నా కలలన్నీ కూలిపోతున్నాయనిపించింది. బాల్య వివాహం అంటే... జీవితం అక్కడితో ముగిసిపోతుంది. నా విషయంలో అలా జరగకూడదనుకున్నాను. నేను ఎంత చెప్పినా ఇంట్లో వాళ్లు వినకపోవడంతో... 'బాలికా మంచ్'ను ఆశ్రయించాను. పాఠశాలల్లో బాలికలకు సురక్షితమైన పరిస్థితులను ఏర్పాటు చేయడం కోసం, బాల్య వివాహాల నుంచి వారిని రక్షించుకోవడం కోసం ఏర్పాటైన విభాగం అది. దానిలో నా స్నేహితులు కొందరు సభ్యులుగా ఉన్నారు. నా సమస్యను విభాగం ఇన్‌ఛార్జిగా ఉన్న టీచర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సంగతి తెలిసిన నా తల్లితండ్రులు రెండు రోజుల్లో నా పెళ్లి జరపడానికి ఏర్పాట్లు చేశారు. పరిస్థితి తీవ్రతని గుర్తించిన మా టీచర్ నేరుగా జిల్లా మేజిస్ట్రేట్‌ను కలిసి విషయం చెప్పారు. మేజిస్ట్రేట్ జోక్యంతో అధికారులు రంగంలోకి దిగారు. నా పెళ్లి ఆగిపోయింది. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం కాబట్టి మళ్లీ అలాంటి ప్రయత్నం చేస్తే అరెస్ట్ చెయ్యాల్సి వస్తుందని అధికారులు హెచ్చరించడంతో... మా వాళ్లు మళ్లీ ఆ ప్రస్తావన తేలేదు.



బాల్య వివాహం అంటే... జీవితం అక్కడితో ముగిసిపోతుంది. నా విషయంలో అలా జరగకూడదనుకున్నాను. నేను ఎంత చెప్పినా ఇంట్లో వాళ్లు వినకపోవడంతో... 'బాలికా మంచ్'ను ఆశ్రయించాను.


ఎన్నడూ అనుకోలేదు...

ఈ సంఘటనతో నా పేరు మా ప్రాంతమంతా మారుమోగిపోయింది. అప్పటివరకూ తమకు ఇష్టం లేకపోయినా... బాల్య వివాహాలకు అమ్మాయిలు తలవంచేవారు. మొదటిసారి ఎదిరించింది నేనే కావడంతో... నా తోటి బాలికల్లో నేను ప్రేరణ కలిగించగలనని అనిపించింది. మా పాఠశాల యాజమాన్యం, అధికారులు కూడా ఇదే ఆలోచనతో 'బాలికా మంచ్'కు కన్వీనర్‌గా నన్ను నియమించారు. అప్పటి నుంచి తరగతుల్లో, ఇతర వేదికల మీద బాలికల హక్కుల గురించి మాట్లాడడం ప్రారంభించాను. జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే బాగా చదువుకోవాలనీ, సాధికారత సాధించాలనీ, తమ ఆకాంక్షలకు ముప్పుగా నిలిచే ఒత్తిడులను ప్రతిఘటించాలని ప్రధానంగా చెబుతూ వచ్చాను. ఒక రోజు నాకు ఫోన్ కాల్ వచ్చిందని హెడ్మాస్టర్ నుంచి కబురు వచ్చింది. 'నాకోసం ఎవరు చేస్తారు?' అనుకుంటూ వెళ్లాను. "హలో!' అనగానే నాతో మాట్లాడినాయన నా వివరాలు కనుక్కొని... వేరొకరికి ఫోన్ అందించారు. "నేను మాణిక్ సహాను మాట్లాడుతున్నాను" అంటూ అవతలి వ్యక్తి అనగానే... నాకు ఒక్క క్షణం ఏం చెయ్యాలో అర్థం కాలేదు. సాక్షాత్తూ త్రిపుర ముఖ్యమంత్రి నాతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడతారని ఎన్నడూ అనుకోలేదు. ఆయన నా ధైర్యాన్ని అభినందించారు. అనంతరం ఒక కార్యక్రమానికి నన్ను ఆహ్వానించి సత్కరించారు. అలాగే ఈ ఏడాది 'ప్రధానమంత్రి బాల పురస్కార్'ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నాను. నాయకత్వ లక్షణాలున్న బాలలకు మన దేశంలో ఇచ్చే అత్యున్నత పురస్కారం అది. నాలాంటి ఒక సామాన్యమైన అమ్మాయికి ఇంతటి గౌరవం దక్కుతుందని నేను ఊహించలేదు. ఇది నాలో మరింత ఉత్సాహాన్ని నింపింది. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడానికి మా ప్రాంతంలో 'బాలికా మంచ్' ద్వారా నా వంతు కృషి చేస్తున్నాను. బాల్య వివాహాలు బాలికలను శారీరకంగా, మానసికంగా కుంగదీస్తాయి. వారి ఎదుగుదలకు అవరోధంగా మారుతాయి. వారికి భవిష్యత్తు లేకుండా చేస్తాయి. వాటి నివారణకు ప్రభుత్వం తీసుకొనే చర్యలు కీలకం అయినప్పటికీ, ఈ దురాచారాన్ని రూపుమాపాలంటే సమాజంలో మార్పు కూడా ఎంతో ముఖ్యం. స్వయంగా ఈ సమస్యను ఎదుర్కొన్న వ్యక్తిగా... అలాంటి మార్పునకు దోహదం చెయ్యాలనేదే నా ఆశయం."

శతక మోతెక్కించారు..

హెడ్, స్మిత్ సెంచరీలు

- ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 405/7
- బుమ్రాకు ఐదు వికెట్లు
- భారత్‌తో మూడో టెస్టు


హెడ్ (160 బంతుల్లో 152)
స్టీవ్ స్మిత్ (101)

బ్రిస్బేన్: ట్రావిస్ హెడ్ (160 బంతుల్లో 18 ఫోర్లతో 152) భారత జట్టుపై తన 'ప్రేమ'ను మరోసారి చాటుకున్నాడు. గాబాలో తన చివరి మూడు టెస్టుల్లోనూ గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరిగిన హెడ్ ఈసారి తన ప్రియమైన ప్రత్యర్థిపై కసితీరా బాదేస్తూ అదే మైదానంలో భారీ శతకం అందుకున్నాడు. ఈ సిరీస్‌లో అతడికిది వరుసగా రెండో సెంచరీ. అతడికి జతగా స్టీవ్ స్మిత్ (101) కూడా ఎట్టకేలకు ఫామ్‌ను అందుకుంటూ మూడంకెల స్కోరుతో ఆకట్టుకున్నాడు. ఇది స్మిత్‌కు 25 ఇన్నింగ్స్‌ల తర్వాత వచ్చిన సెంచరీ కావడం విశేషం. వీరిద్దరి ఆటతీరుతో మూడో టెస్టులో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 405/7 స్కోరుతో పటిష్ట స్థితిలో నిలిచింది. భారత బౌలర్లలో ఎప్పటిలాగే పేసర్ బుమ్రా (5/72) మాత్రమే ఆసీస్‌ను కాస్తయినా కట్టడి చేయగలిగాడు. శనివారం తొలి రోజు వర్షం కారణంగా 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం కాగా.. రెండో రోజు ఆసీస్ వన్డే తరహాలో చెలరేగి పరుగులు రాబట్టింది. నేటి తొలి సెషన్‌లో మిగతా మూడు వికెట్లు వేగంగా తీసి బ్యాటింగ్‌లో చెలరేగితేనే భారత్ పోటీలోకి రాగలుగుతుంది.

తొలి సెషన్ మనదే..: రెండో రోజు అర్ధగంట ముందే తొలి సెషన్ ఆరంభం కాగా.. పిచ్ బౌలింగ్‌కు సహకరించింది. 28/0 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్‌ను బుమ్రా వరుస ఓవర్లలో దెబ్బతీశాడు. ఓపెనర్లు ఖవాజా (21), మెక్‌స్వీనే (9)ల వికెట్లను పడగొట్టడంతో 38/2 స్కోరుతో నిలిచింది. కాసేపటికి లబుషేన్ (12)ను నితీశ్ అవుట్ చేయడంతో ఆసీస్ ఒత్తిడిలో పడింది. ఈ సెషన్‌లో ఆసీస్ 76 పరుగులు సాధించింది.

హెడ్, స్మిత్ హవా: రెండో సెషన్‌లో హెడ్, స్మిత్‌ల ధాటికి భారత బౌలర్లు చెమటోడ్చాల్సివచ్చింది. హెడ్‌ను ఎలా కట్టడి చేయాలో తెలీక బౌలర్లు చేష్టలుడిగిపోయారు. మరోవైపు ఫీల్డింగ్ సెటప్ కూడా సరిగ్గా లేకపోవడం రోహిత్ కెప్టెన్సీపై విమర్శలకు తావిచ్చింది. ఫీల్డర్లను డీప్ పాయింట్, డీప్ స్క్వేర్ లెగ్‌లో మోహరించడంతో హెడ్ ఇబ్బంది లేకుండా సింగిల్స్, డబుల్స్‌తో వేగంగా రన్స్ రాబట్టాడు. ఈ జోడీ వికెట్ కోల్పోకుండా సెషన్‌ను ముగించింది.

బుమ్రా కట్టడి చేసినా..: ఆఖరి సెషన్‌లో బుమ్రా కొత్త బంతితో మరో మూడు వికెట్లు తీశాడు. కానీ అటు ఆసీస్ బ్యాటర్లు సైతం వేగంగా పరుగులు సాధించారు. స్మిత్, హెడ్ పోటాపోటీ బౌండరీలతో చెలరేగారు. అయితే హెడ్ 112 పరుగుల దగ్గర ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో రోహిత్ వదిలేశాడు. 80 ఓవర్లు పూర్తయ్యాక రెండో కొత్త బంతి అందుబాటులోకి రాగా అటు స్మిత్ కెరీర్‌లో 33వ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కానీ బుమ్రా అతడిని అవుట్ చేయడంతో దాదాపు 50 ఓవర్ల తర్వాత లభించిన వికెట్‌తో భారత్ ఊపిరి పీల్చుకుంది. అటు నాలుగో వికెట్‌కు 241 పరుగుల భారీ భాగస్వామ్యం కూడా ముగిసింది. స్వల్ప వ్యవధిలోనే బుమ్రా ఒకే ఓవర్‌లో మార్ష్ (5), హెడ్‌ను కూడా అవుట్ చేయడంతో ఆసీస్ తడబడినట్టు కనిపించింది. కానీ క్యారీ నిలకడగా ఆడుతూ రెండో రోజు ఆలౌట్ కాకుండా అడ్డుకున్నాడు. అలాగే కమిన్స్ (20)తో కలిసి ఐదో వికెట్‌కు 58రన్స్ జోడించడంతో స్కోరు 400 దాటింది.



బుమ్రాపై వివాదాస్పద వ్యాఖ్యలు

భారత స్టార్ పేసర్ బుమ్రాపై ఇంగ్లండ్ మహిళా కామెంటేటర్ ఇసా గుహ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. రెండో రోజు ఆట ఆరంభంలోనే తను రెండు వికెట్లు తీయడంతో సహచర ఫాక్స్ క్రికెట్ కామెంటేటర్ బ్రెట్ లీ కొనియాడాడు. దీనికి ఇసా బదులిస్తూ.. 'అవును. బుమ్రాను ఎంవీపీగా పిలవొచ్చు. అత్యంత విలువైన ప్రైమేట్ బుమ్రా' అని పేర్కొంది. తన ఉద్దేశం ఏమిటో కానీ తోకలేని కోతిని ప్రైమేట్ అని పిలుస్తుంటారు.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఖవాజా (సి) పంత్ (బి) బుమ్రా 21; మెక్‌స్వీనే (సి) విరాట్ (బి) బుమ్రా 9; లబుషేన్ (సి) విరాట్ (బి) నితీశ్ 12; స్మిత్ (సి) రోహిత్ (బి) బుమ్రా 101; హెడ్ (సి) పంత్ (బి) బుమ్రా 152; మార్ష్ (సి) విరాట్ (బి) బుమ్రా 5; క్యారీ (బ్యాటింగ్) 45; కమిన్స్‌ (సి) పంత్ (బి) సిరాజ్ 20; స్టార్క్ (బ్యాటింగ్) 7; **ఎక్స్‌ట్రాలు: 33; మొత్తం: 101 ఓవర్లలో 405/7. వికెట్ల పతనం:** 1-31, 2-38, 3-75, 4-316, 5-326, 6-327, 7-385; **బౌలింగ్:** బుమ్రా 25-7-72-5; సిరాజ్ 22.2-4-97-1; ఆకాశ్ 24.4-5-78-0; నితీశ్ 13-1-65-1; జడేజా 16-2-76-0.

'సెనా' (ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా) జట్లపై ఎక్కువ (8) సార్లు 5+ వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా బుమ్రా. కపిల్ (7 సార్లు)ను అధిగమించాడు.

1 భారత్‌పై ఎక్కువ టెస్టు శతకాలు (10) బాదిన బ్యాటర్‌గా రూట్‌తో కలిసి టాప్‌లో ఉన్న స్మిత్. అలాగే ఆసీస్ తరఫున పాంటింగ్ (41) తర్వాత రెండో స్థానం (33)లో నిలిచాడు.

3 టెస్టుల్లో ఒకే జట్టుపై ఎక్కువ క్యాచ్‌లు (ఆసీస్‌పై 71) పట్టిన మూడో ప్లేయర్‌గా విరాట్. బోర్డర్ (ఇంగ్లండ్‌పై) కూడా అన్నే క్యాచ్‌లు పట్టగా.. టాప్‌లో స్మిత్ (ఇంగ్లండ్‌పై 76), జయవర్ధనె (ఇంగ్లండ్‌పై 72) ఉన్నారు.

సీఏకు రూ.5.4 కోట్ల నష్టం

భారత్-ఆసీస్ జట్ల మధ్య జరిగిన మూడో టెస్టు తొలి రోజు ఆట వర్షం కారణంగా 13.2 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. దీంతో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) తమ పాలసీ ప్రకారం ప్రేక్షకులకు టిక్కెట్ల పూర్తి సొమ్మును రిఫండ్ చేయనుంది. ఈ కారణంగా బోర్డు రూ.5.4 కోట్ల సొమ్ము నష్టపోనుంది. మరో 10 బంతుల ఆట జరిగుంటే 15 ఓవర్ల ఆట అయ్యేది కాబట్టి.. సీఏ పూర్తి రిఫండ్ నుంచి బయటపడేది.




ఈనెల 22న జరిగే తన వివాహానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు ఆదివారం ఆహ్వానించింది. సింధు వెంట ఆమె తండ్రి వెంకటరమణ ఉన్నారు.

భారత్‌దే జూనియర్ హాకీ ఆసియా కప్

ఫైనల్లో చైనాపై విజయం



మస్కట్: మహిళల జూనియర్ ఆసియా కప్ హాకీ టోర్నీలో భారత జట్టు వరుసగా రెండోసారి చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం చైనాతో జరిగిన ఈ ఫైనల్లో భారత్ పెనాల్టీ షూటౌట్ ద్వారా 4-2 తేడాతో విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. మొదట పెనాల్టీ స్ట్రోక్ ద్వారా చైనా గోల్ సాధించి 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత 41వ నిమిషంలో దీపిక గోల్‌తో భారత్ పోటీలోకి వచ్చింది. విజేతను తేల్చేందుకు పెనాల్టీ షూటౌట్ అనివార్యమైంది. ఇందులో భారత్ 4 గోల్స్ చేసి ఒక్కసారి మాత్రమే విఫలం కాగా.. అటు చైనా ప్రయత్నాలను గోల్‌కీపర్ నిధి అద్భుతంగా అడ్డుకోవడంతో కేవలం రెండు గోల్స్ చేసి నిరాశలో మునిగింది. కాగా భారత ప్లేయర్లకు తలా రెండేసి లక్షల నజరానాను హాకీ ఇండియా ప్రకటించింది.

అన్‌క్యాప్డ్ అధరహో!

డబ్ల్యూపీఎల్ వేలం

- సిమ్రన్‌కు రూ. 1.90 కోట్లు
- కమలినికి రూ. 1.60 కోట్లు
- ప్రేమకు రూ. 1.20 కోట్లు
- తెలుగమ్మాయి శ్రీచరణికి రూ. 55 లక్షలు


సిమ్రన్


కమలిని

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2025 సీజన్‌కు నిర్వహించిన మినీ వేలంలో భారత్‌కు చెందిన అన్‌క్యాప్డ్ క్రికెటర్లపై కాసుల వర్షం కురిసింది. బరిలో నిలిచిన సీనియర్లను కాదని ఐదు ఫ్రాంచైజీలు, ఇంకా భారత సీనియర్ జట్టుకు ఆడని కుర్ర క్రికెటర్లపట్ల మొగ్గు చూపాయి. దాంతో ఆల్‌రౌండర్లకు కళ్లుచెదిరే మొత్తం లభించింది. ముంబైకి చెందిన సిమ్రన్ షేక్ రూ.1.90 కోట్లతో ఈ వేలంలో అత్యధిక ధర పలికిన క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పింది. గుజరాత్ జెయింట్స్ ఆమెను కైవసం చేసుకుంది. తమిళనాడుకు చెందిన కమలిని (16) రూ. 1.60 కోట్ల ధర పలికింది. ముంబై ఇండియన్స్ కమలినిని సొంతం చేసుకుంది. ఉత్తరాఖండ్‌కు చెందిన ప్రేమా రావత్‌ను రూ.1.20 కోట్లకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కొనుగోలు చేసింది. సీనియర్ల విషయానికొస్తే..వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డియాండ్ర డాటిన్‌ను రూ. 1.70 కోట్లకు గుజరాత్ జెయింట్స్ దక్కించుకుంది. డాటిన్ వేలంలో రెండో అత్యధిక మొత్తానికి అమ్ముడైన క్రికెటర్‌గా నిలిచింది. ఐదు జట్లలో మొత్తం 19 స్థానాలే ఉండగా 120 మంది క్రికెటర్లు వేలంలో నిలిచారు.

శ్రీ చరణి..లక్షాధికారి..: ఆంధ్ర ఆల్‌రౌండర్ నల్లపురెడ్డి శ్రీ చరణికి కూడా ఊహించని మొత్తం లభించింది. రూ. 10 లక్షల ప్రాథమిక ధర కలిగిన ఆమె కోసం ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి. ఆఖరికి రూ. 55 లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్ శ్రీ చరణిని కొనుగోలు చేసింది. వేలంలో టాప్-5గా శ్రీ చరణి నిలవడం విశేషం. కడప జిల్లాకు చెందిన 20 ఏళ్ల శ్రీ చరణి ఎడమ చేతి బ్యాటింగ్‌తోపాటు లెఫ్టామ్ స్పిన్ బౌలింగ్ చేయగలదు.

అమ్ముడైన వారిలో కొందరు..

1. సిమ్రన్ షేక్-రూ.1.90 కోట్లు-గుజరాత్
2. డియాండ్ర డాటిన్-రూ.1.70 కోట్లు-గుజరాత్
3. కమలిని-రూ.1.60 కోట్లు-ముంబై
4. ప్రేమా రావత్-రూ.1.20కోట్లు-బెంగళూరు
5. శ్రీ చరణి-రూ. 55 లక్షలు-ఢిల్లీ
6. డి క్లెర్క్-రూ.30 లక్షలు-ముంబై
7. డానిలి గిబ్సన్-రూ.30లక్షలు-గుజరాత్
8. అలనా కింగ్-రూ.30లక్షలు-యూపీ
9. అక్షితా మహేశ్వరి-రూ.20లక్షలు-ముంబై


శ్రీ చరణి

పాక్‌పై భారత్ గెలుపు

అండర్-19 ఆసియాకప్

కౌలాలంపూర్: అండర్-19 ఆసియాకప్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. ఆదివారం పాకిస్థాన్‌తో జరిగిన తమ తొలి మ్యాచ్‌లో 9 వికెట్లతో విజయం సాధించింది. మహిళల ప్రీమియర్ లీగ్ వేలంలో కోటీ 60 లక్షలతో అదరగొట్టిన ఓపెనర్ కమలిని (29 బంతుల్లో 44 నాటౌట్) అలరించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాక్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 67 పరుగులు చేసింది. సోనమ్ యాదవ్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత భారత్ 7.5 ఓవర్లలోనే 68/1 స్కోరుతో మ్యాచ్‌ను ముగించింది. మరో ఆరంభ మ్యాచ్‌లో శ్రీలంక జట్టు మలేసియాపై గెలిచింది.

'ముస్తాక్ అలీ' విజేత ముంబై


కెప్టెన్ శ్రేయాస్

బెంగళూరు: రెండేళ్ల తర్వాత ముంబై జట్టు మరోసారి సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ విజేతగా నిలిచింది. ఆదివారం ఇక్కడ జరిగిన ఫైనల్లో ఆ జట్టు 5 వికెట్లతో మధ్యప్రదేశ్‌పై గెలుపొందింది. టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన ఎంపీ 20 ఓవర్లలో 174/8 స్కోరు సాధించింది. కెప్టెన్ రజత్ పటీదార్ (81 నాటౌట్) అదరగొట్టాడు. అనంతరం ముంబై 17.5 ఓవర్లలో 180/5 స్కోరు చేసి విజయం అందుకుంది. సూర్యకుమార్ (48), రహానె (37), సూర్యాంశ్ (36 నాటౌట్) మెరిశారు. ముంబై ఈ టైటిల్ గెలవడం ఇది రెండోసారి.

ఘనమైన బోణీ

తొలి టీ20లో భారత్ గెలుపు

ముంబై : వెస్టిండీస్‌తో మూడు టీ20ల సిరీస్‌లో ఆదివారం ఇక్కడ జరిగిన తొలి మ్యాచ్‌లో 49 పరుగులతో విజయం సాధించారు. మొదట భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 195 పరుగులు చేసింది. జెమీమా (73), మంధాన (54) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. ఛేదనలో టిటాస్ (3/37) ధాటికి వెస్టిండీస్ 7 వికెట్లకు 146 పరుగులే చేసి ఓడింది. డాటిన్ (52), క్వియానా (49) రాణించారు. స్పిన్నర్లు దీప్తిశర్మ, రాధా యాదవ్ చెరో రెండు వికెట్లు కైవసం చేసుకున్నారు.


సంక్షిప్తస్కోర్లు : భారత్ 20 ఓవర్లలో 195/4 (జెమీమా 73, మంధాన 54, ఉమ 24, రిచా 20, హర్మన్ 13 నాటౌట్, కరిష్మా 2/18); **వెస్టిండీస్ 20 ఓవర్లలో 146/7** (డాటిన్ 52, క్వియానా జోసెఫ్ 49, టిటాస్ సిద్ధూ 3/37, దీప్తిశర్మ 2/21, రాధ 2/28).

బిజినెస్

ఎన్‌సీఎల్ఏటీలో ఈఐహెచ్‌కి చుక్కెదురు

న్యూఢిల్లీ: హైదరాబాద్‌కు చెందిన గోల్డెన్ జూబ్లీ హోటల్స్ విక్రయానికి అనుమతిస్తూ ఎన్‌సీఎల్‌టీ జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ ఈఐహెచ్ లిమిటెడ్ దాఖలు చేసిన అప్పీలును ఎన్‌సీఎల్ఏటీ కొట్టివేసింది. గోల్డెన్ జూబ్లీ హోటల్స్ సంస్థ హైదరాబాద్‌లోని ట్రైడెంట్ హోటల్‌ను నిర్వహిస్తోంది. ఈ అప్పీలుపై తీర్పు చెప్పిన ఎన్‌సీఎల్ఏటీ ఈ హోటల్ కోసం సింగపూర్ సంస్థ ఒకటి దాఖలు చేసిన బిడ్‌ను అనుమతిస్తూ ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన తీర్పును ఎన్‌సీ ఎల్ఏటీ ధ్రువీకరించింది. సీఓసీ (కమిటీ ఆఫ్ క్రెడిటార్స్) మెజారిటీ నిర్ణయాన్ని ప్రశ్నించేందుకు లేదా దాన్ని మరోసారి పరిశీలించాలని కోరేందుకు ఎవరికీ హక్కు లేదని తేల్చి చెప్పింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	620	విజయవాడ	630
వరంగల్	622	గోదావరి	630
చిత్తూరు	633	విశాఖపట్నం	620
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	101	విజయవాడ	104
వరంగల్	101	గుంటూరు	107
కరీంనగర్	101	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	101	చిత్తూరు	93
కర్నూలు	101	నెల్లూరు	93
విశాఖపట్నం	108	అనంతపురం	93
గోదావరి	104		

క్యూఐపీల రికార్డు

11 నెలల్లో రూ. 1.21 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ఈ ఏడాదిలో నవంబరుతో ముగిసిన 11 నెలల కాలంలో భారత కంపెనీలు క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) మార్గం ద్వారా సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి ఏకంగా రూ.1.21 లక్షల కోట్లు సమీకరించాయి. క్యూఐపీల ద్వారా వార్షిక నిధుల సమీకరణ రూ.లక్ష కోట్లు దాటడం ఇదే తొలిసారి అని ప్రైమ్ డేటాబేస్ వెల్లడించింది. గత ఏడాదిలో నమోదైన రూ.52,350 కోట్లతో పోలిస్తే, క్యూఐపీల ద్వారా నిధుల సేకరణ ఈ ఏడాది రెండింతలకు పైగా పెరిగింది. మార్కెట్లో మెరుగైన పరిస్థితులతో పాటు అధిక వేల్యుయేషన్లు ఇందుకు కలిసి వచ్చాయి. ప్రైమ్ డేటాబేస్ తాజా డేటా ప్రకారం.. ఈ ఏడాదిలో నవంబరు వరకు 82 కంపెనీలు క్యూఐపీల ద్వారా రూ.1,21,321 కోట్లు సమీకరించాయి. గత ఏడాదిలో ఇదే కాలానికి 35 ఇష్యూల ద్వారా రూ.38,220 కోట్ల సమీకరణ జరిగింది. లిస్టెడ్ కంపెనీలు, పెట్టుబడి ట్రస్టులు నియంత్రణ మండలికి ముందస్తుగా పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేకుండా త్వరితగతిన నిధులు సమీకరించేందుకున్న మార్గాల్లో క్యూఐపీ ఒకటి.

మైనింగ్ దిగ్గజం వేదాంత, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో ఈ ఏడాది క్యూఐపీల ద్వారా అత్యధిక నిధులు సమీకరించిన కంపెనీలుగా నిలిచాయి. ఈ రెండూ చెరో రూ.8,500 కోట్లు సేకరించాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ రూ.8,373 కోట్లు, వరుణ్ బెవరేజెస్ రూ.7,500 కోట్లతో ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. సంవర్ధన మదర్సన్ ఇంటర్నేషనల్ రూ.6,438 కోట్లు, గోద్రేజ్ ప్రాపర్టీస్ రూ.6,000 కోట్లు, కేఈఐ ఇండస్ట్రీస్ రూ.2,000 కోట్లు పోగేశాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ), జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ నెలలో టొరెంట్ పవర్, భారత్ ఫోర్జ్, సెన్కో గోల్డ్, సమ్మాన్ క్యాపిటల్ కూడా క్యూఐపీల ద్వారా రూ.8,000 కోట్లకు పైగా సేకరించాయి. ఏడాది చివరి నాటికి లెక్క మరింత పెరగనుంది.

మళ్లీ ఎఫ్‌పీఐల జోరు

గత రెండు నెలల్లో భారీగా అమ్మకాలు సాగించిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ).. ఈ నెలలో మళ్లీ కొనుగోళ్ల జోరు పెంచారు. గడిచిన రెండు వారాల్లో (డిసెంబరు 1 నుంచి 13 వరకు) ఎఫ్‌పీఐలు దేశీయ ఈక్విటీల్లో నికరంగా రూ.22,766 కోట్ల పెట్టుబడులు పెట్టారు. అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీరేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు ఇందుకు దోహదపడ్డాయి. నవంబరులో ఎఫ్‌పీఐలు నికరంగా రూ.21,612 కోట్ల నిధులు ఉపసంహరించుకున్నారు. అక్టోబరులోనైతే ఏకంగా రూ.94,017 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. మన మార్కెట్ నుంచి ఎఫ్‌పీఐలు ఏదైనా నెలలో ఉపసంహరించుకున్న పెట్టుబడుల్లో ఇదే అత్యధికం. ఈ సెప్టెంబరులో మాత్రం ఎఫ్‌పీఐలు నికర పెట్టుబడులు తొమ్మిది నెలల గరిష్ఠ స్థాయి రూ.57,724 కోట్లుగా నమోదయ్యాయి. కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐల నికర పెట్టుబడులు మాత్రం రూ.7,747 కోట్లకు పరిమితమయ్యాయి. అక్టోబరు, నవంబరులో ఇన్వెస్ట్‌మెంట్లు భారీగా తరలిపోవడం ఇందుకు కారణం.

చెల్లింపుల్లో యూపీఐ కింగ్

జనవరి -నవంబరు మధ్య కాలంలో రూ.223 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: నవంబరుతో ముగిసిన 11 నెలల కాలంలో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా రూ.223 లక్షల కోట్ల విలువైన 15,547 కోట్ల చెల్లింపుల లావాదేవీలు జరిగాయని కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. దేశంలో ఆర్థిక లావాదేవీల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులకు ఇదే నిదర్శనమని పేర్కొంది. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఈ విషయాన్ని పోస్ట్ చేసింది. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) 2016లో యూపీఐ సేవలను అందుబాటులోకి తెచ్చింది. యూపీఐ చెల్లింపులను వేగవంతం, సురక్షితం, సులభతరం చేయడంతో పాటు వ్యక్తులు, చిరు వ్యాపారాలు, వర్తకుల ఆర్థిక సాధికారతను పెంచింది. భారతదేశం నగదు రహిత చెల్లింపుల ఆర్థిక వ్యవస్థగా మారేందుకు బాటలు వేసింది.

వివోతో డిక్సన్ టెక్ జాయింట్ వెంచర్

న్యూఢిల్లీ: స్మార్ట్ ఫోన్లు సహా ఎలక్ట్రానిక్ డివైస్‌ల తయారీ కోసం చైనా మొబైల్ కంపెనీ వివో, ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ డిక్సన్ టెక్నాలజీస్ జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయనున్నాయి. రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో ఈ విషయం వెల్లడించారు. జాయింట్ వెంచర్‌లో డిక్సన్ టెక్ 51 శాతం వాటాలు కలిగి ఉంటుంది. మిగతా వాటాలు వివో చేతిలో ఉంటాయి. ఇందుకోసం ఉభయ సంస్థలు ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. అయితే డిక్సన్, వివో రెండూ ఒక కంపెనీలో మరోటి ఎలాంటి వాటా కలిగి ఉండదు. ఈ జాయింట్ వెంచర్ కంపెనీ ఇండియాలో వివో ఓఈఎం ఆర్డర్లను స్వీకరించడంతో పాటు ఇతర బ్రాండ్లకు చెందిన వివిధ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ఓఈఎం కాంట్రాక్టులు కూడా చేపడుతుంది. అయితే ఈ జాయింట్ వెంచర్ ఎప్పటి నుంచి వాణిజ్యపరమైన ఉత్పత్తిని ప్రారంభిస్తుందని గాని, దీనికి సంబంధించిన ఆర్థిక వివరాలు గాని ఆ ప్రకటనలో తెలియచేయలేదు.

25000 పైన బుల్లిష్

ఆస్ట్రో గైడ్

(డిసెంబరు 16-20 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 24769 (+91)

నిఫ్టీ గత వారం 24792-24180 పాయింట్ల మధ్యన కదలాడి 91 పాయింట్ల లాభంతో 24769 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25000 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24588, 24607, 24424, 24169 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైకి రావడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 25000 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 24500
నిరోధ స్థాయిలు: 24970, 25070, 25170 (24870 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24570, 24470, 24370 (24670 దిగువన బేరిష్)

నిర్ణయాత్మక దిశ దొరికేనా...

ఈక్విటీ మార్కెట్ ఈ వారం రేంజ్ బౌండ్ నుంచి బుల్లిష్‌గా ట్రేడ్ కావచ్చు. అయితే నిర్ణయాత్మక దిశ మాత్రం ఏర్పడకపోవచ్చు. గత శుక్రవారం సూచీలు తీవ్ర ఆటుపోట్లకు గురయ్యాయి. భారీ నష్టాల నుంచి అనూహ్యంగా లాభాల్లోకి వచ్చాయి. అంతర్జాతీయంగా పరిస్థితులు మెరుగవుతుండడం, క్రూడాయిల్ ధరల్లో స్థిరత్వం, విదేశీ సంస్థాగత మదుపరులు తిరిగి వస్తుండడం ఇందుకు దోహదపడ్డ కీలకాంశాలు. క్రితం వారం కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, టూరిజం, మెటల్, రియల్టీ రంగాల షేర్లు రాణించాయి. మీడియా, ఎనర్జీ, పీఎస్‌యూ బ్యాంకులు, ఆయిల్ అండ్ గ్యాస్, ఫార్మా షేర్లు నష్టపోయాయి.

స్టాక్ రికమండేషన్స్

క్రిసిల్: ఈ రేటింగ్ కంపెనీ షేర్లు చక్కని మూమెంటమ్ కనబరుస్తున్నాయి. నిఫ్టీతో పోలిస్తే జోరుమీదున్నాయి. రిస్క్ రివార్డ్ అనుకూలంగా ఉంది. ఏడాదిన్నర నిరోధాన్ని అధిగమించడమే కాకుండా పై స్థాయిలో నిలదొక్కుకుంటున్నాయి. గత శుక్రవారం ఈ షేరు 5.27 శాతం లాభంతో రూ.5817 వద్ద ముగిసింది. రూ.6250/6300 టార్గెట్‌తో రూ.5800 శ్రేణిలో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ రూ.5720.

భారతీ ఎయిర్‌టెల్: ఆర్పూ పెరగడం, టెలికాం రంగంలో ఎఫ్‌పీఐలు పొజిషన్లు తీసుకుంటుండడంతో ఇన్వెస్టర్లు ఈ షేరుపై ఆసక్తి కనబరుస్తున్నారు. మూమెంటమ్, ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. చివరి 2 సెషన్లలోనే 8శాతం మేరకు పెరిగిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1750/1800 టార్గెట్‌తో రూ.1650 స్థాయిలో పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ రూ.1610.

ఇండియన్ హోటల్స్: పెళ్లిళ్ల సీజన్ కావడం, ఈపీఎస్, అమ్మకాల వృద్ధిరేటు గణనీయంగా పెరగడంతో ఈ షేరు జోరుమీదుంది. నిఫ్టీతో పోల్చితే అత్యధిక రాబడి అందిస్తోంది. త్రైమాసిక ఫలితాలు వెలువడిన అనంతరం డెలివరీ వాల్యూమ్ విపరీతంగా పెరిగింది. గత శుక్రవారం 2.26 శాతం లాభంతో రూ.855 వద్ద ముగిసింది. రూ.980 టార్గెట్ ధరతో రూ.830 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ రూ.800.

భారత్ డైనమిక్ లిమిటెడ్: జూన్ త్రైమాసిక ఫలితాలు నిరాశావహంగా ఉండడంతో ప్రారంభమైన డౌన్ ట్రెండ్ సెప్టెంబరు ఫలితాల తర్వాత నిలిచిపోయింది. రూ.1000 వద్ద ఈ షేరు టర్న్ అరౌండ్ అయి రూ.1200 వద్ద నిరోధాన్ని అధిగమించింది. డిఫెన్స్ రంగం మళ్లీ పుంజుకోవడంతో ఈ షేర్లకు డిమాండ్ నెలకొంది. శుక్రవారం ఈ షేరు రూ.1260 వద్ద ముగిసింది. రూ.1450 టార్గెట్ ధరతో రూ.1200 వద్ద ప్రవేశించవచ్చు. స్టాప్‌లాస్ రూ.1140.

బజాజ్ ఫిన్‌సర్వ్: 40 సెషన్లుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు 52 వారాల గరిష్ఠ స్థాయికి 17 శాతం దూరంలో ఉంది. డిసెంబరు నుంచి మళ్లీ మూమెంటమ్ పెరిగింది. రూ.1550 స్థాయిలో మద్దతు తీసుకుని వరుస లాభాల్లో ముగుస్తోంది. గత శుక్రవారం ముగింపు రూ.1679. ఇన్వెస్టర్లు రూ.1960 టార్గెట్‌తో రూ.1650 వద్ద పొజిషన్ తీసుకోవచ్చు. స్టాప్‌లాస్ రూ.1600.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

నిరోధ స్థాయి 25000

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం తొలి నాలుగు రోజుల్లో 24,500 స్థాయిలో బలమైన కన్సాలిడేషన్ సాధించింది. శుక్రవారం ఒక దశలో 350 పాయింట్ల మేరకు ఇంట్రాడే రియాక్షన్ సాధించినా బలంగా కోలుకుని వారం మొత్తానికి 90 పాయింట్ల లాభంతో 24,770 వద్ద ముగిసింది. పుల్‌బ్యాక్ రియాక్షన్ అనంతరం మద్దతు స్థాయిలకు పైనే బలమైన రికవరీ సాధించి ట్రెండ్ పటిష్ఠంగా నిలబెట్టుకుంది. వరుసగా నాలుగు వారాలుగా అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ 1500 పాయింట్ల మేరకు రిలీఫ్ ర్యాలీ సాధించింది. గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 290 పాయింట్ల మేరకు లాభపడి 59,000 సమీపంలో ఉంది. అయితే స్మాల్‌క్యాప్-100 సూచీ మాత్రం 85 పాయింట్ల మేరకు నష్టపోయింది. టెక్నికల్‌గా ప్రస్తుతానికి ట్రెండ్ సానుకూలంగానే ఉంది. అయితే శుక్రవారం అమెరికన్ మార్కెట్లో ఏర్పడిన బలహీనత కారణంగా ఈ వారం మరింత అప్రమత్త ట్రెండ్ సాధించవచ్చు. అలాగే నిఫ్టీ మానసిక అవధి 25,000 చేరువకు వస్తోంది.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీ పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం తదుపరి నిరోధం 24,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన స్వల్పకాలిక నిరోధం 25,000. సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు: సూచీకి మైనర్ మద్దతు స్థాయి 24,650. ప్రధాన మద్దతు స్థాయి 24,500. బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం ఈ స్థాయిల్లో నిలదొక్కుకుని తీరాలి. 24,500 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుంది. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత శుక్రవార 1500 పాయింట్ల మేరకు రికవరీ సాధించి 53,850 వద్ద నిలకడగా ముగిసింది. జీవితకాల గరిష్ఠ స్థాయి 54,000కి చేరువవుతోంది. ప్రధాన నిరోధం 54,100. మరింత సానుకూలత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 54,500. బలహీనత ప్రదర్శించినా సానుకూలతను కొనసాగించేందుకు మద్దతు స్థాయి 53,000 వద్ద నిలదొక్కుకోవాలి.

పాటర్న్: గత వారం నిఫ్టీ 50, 100 డీఎంఏల వద్ద రికవరీ సాధించింది. 25000 వద్ద "అడ్డంగా ఏర్పడిన ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన నిరోధం ఉంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ నిరోధాన్ని ఛేదించాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.


సోమవారం స్థాయిలు	
నిరోధం	24,850, 24,940
మద్దతు	24,680, 24,600





విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మౌనం పాటిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, నారాయణ, కొలుసు పార్థసారథి తదితరులు, కార్యక్రమానికి హాజరైన ప్రజలు

విభజన కంటే జగన్‌తోనే ఎక్కువ నష్టం



అమరజీవి ఆశయాలను కొనసాగించాలి

» డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

జగమంతా తన కుటుంబమని పొట్టి శ్రీరాములు భావించారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన ఆశయాలను, స్ఫూర్తిని కొనసాగించడానికి అంతా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. మనుషులకు మరుపు చాలా సహజమని అయితే మనకు ఎవరి వల్ల ఉపయోగం కలిగిందో వారిని మర్చిపోకూడదని చెప్పారు. పొట్టి శ్రీరాములు 50రోజులకు పైగా అన్నపానీయాలు లేకుండా, పేగులు మండుతున్నా, బంకమట్టిని తడిపి వస్త్రంలో పెట్టి పొట్టకు చుట్టుకునేవారని తెలిపారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన ఆద్యుడని, ఆయనపై సమాచార శాఖ రూపొందించిన ఏవీ మనసును కదిలించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ఆత్మార్పణ చేసిన వ్యక్తి పాడె మోయడానికి ఎవరూ రాకపోవడం చాలా బాధకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మనమంతా ఆంధ్రులమని చెప్పుకుంటున్నామంటే దానికి కారణం పొట్టి శ్రీరాములు అన్నారు. రాష్ట్ర ప్రజలకు గుర్తుండేలా ఆయన వర్ధంతి చేయాలని నిర్ణయించామని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి చంద్రబాబు రూపొందించిన విజన్-2047ను కులం, మతం, ప్రాంతం లేకుండా అందరూ అందిపుచ్చుకోవాలని పవన్ కోరారు.

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం పేరుతో నిర్వహించిన ఆయన వర్ధంతి కార్యక్రమానికి సీఎం, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో త్వరలో పొట్టి శ్రీరాములు పేరుతో తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని, రాజధాని అమరావతిలో ఆయన నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. తెలుగు జాతి కోసం అమరజీవి చేసిన ప్రాణత్యాగానికి గుర్తుగా అప్పటి సీఎం ఎన్టీఆర్ హైదరాబాద్‌లో ఆయన పేరుతో తెలుగు వర్సిటీని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. తర్వాత తాను సీఎంగా ఉన్నప్పుడు ఆయన జన్మించిన నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా నామకరణం చేశానని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌లో తెలుగు వర్సిటీ మార్చే పేరు పరిస్థితి వచ్చిందన్నారు. వచ్చే ఏడాది మార్చి 16న పొట్టి శ్రీరాములు 125వ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని, ఆయన పుట్టిన గ్రామాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఇంటిని మ్యూజియంగా మారుస్తామని ప్రకటించారు. కొద్దిమంది మాత్రమే జాతి కోసం ఆలోచిస్తారని, ఆయన మాత్రం తెలుగు జాతి కోసం ఆలోచించారన్నారు. దేశంలో రాష్ట్ర ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన త్యాగమే కారణమన్నారు. ఆ త్యాగం లేకుండా రాష్ట్రాలను ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఆయన స్ఫూర్తిని ప్రజల్లో నింపాలని పవన్ కల్యాణ్ చెప్పారని, అది లేకపోతే జాతికి మనుగడ ఉండదని వాదించారని చెప్పారు. పొట్టి శ్రీరాములు స్వాతంత్ర్యం, హరిజనుల హక్కుల కోసం పోరాడిన సామాజిక, మానవతావాది అని చెప్పారు. ఆయన జన్మించిన పడమటిపల్లెను అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం కార్యక్రమాలు రూపొందిస్తే తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని విమర్శించారు. జాతి ప్రయోజనాల కోసం పోరాటాలు, త్యాగాలు చేసిన నేతల స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పాలన పరంగా కష్టమైన పరిస్థితులు ఉన్నప్పటికీ పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్ స్ఫూర్తి తమను ముందుకు నడిపిస్తుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. వారి స్ఫూర్తితోనే విజన్ 2047 డాక్యుమెంట్‌ను రూపొందించామని తెలిపారు. ఇది ఒక వ్యక్తి, కులం, మతం, కుటుం బం కోసం కాదని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఏం చేస్తామో చెప్పే హామీ అని పేర్కొన్నారు.



పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు మేనల్లుడు వెంకటేశ్వర్లు, కుమారులు గుణిపూడి సుబ్రహ్మణ్యం, నరసింహారావును సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

రాష్ట్రాన్ని నాశనం చేశారు

కొంతమంది నేతలు స్వార్థం కోసం రాష్ట్రాన్ని నాశనం చేశారని, మూడు రాజధానుల పేరుతో అమరావతిని, పోలవరాన్ని నాశనం చేశారని చంద్రబాబు విమర్శించారు. ఐదేళ్ల పాలనలో వైసీపీ రూ. లక్షల కోట్ల అప్పులు చేసిందని చెప్పారు. రాష్ట్రానికి అప్పు ఇచ్చేవారు లేరని, అప్పు వచ్చే పరిస్థితి లేదని తెలిపారు. 15వ ఆర్థిక సంఘం కాల పరిమితి మరో రెండేళ్లు ఉందని, ఈ సంఘం ఇచ్చే ఐదేళ్ల నిధులను వైసీపీ ప్రభుత్వం డ్రా చేసేసిందని చెప్పారు. ఓపిక, అనుభవం ఉన్నా ఏం చేయాలో అర్థం కావడం లేదని తెలిపారు. కేంద్రంలో ఎన్డీఏ ఉంది కాబట్టి ఆక్సిజన్ ఇస్తున్నారన్నారు. రాజకీయ నేతల్లో ఐటీ కోసం మాట్లాడేది తానేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ దీని గురించి మాట్లాడతానని చెప్పారు. రైతులకు ధాన్యం డబ్బులను 48 గంటల్లో వారి ఖాతాల్లో జమ చేయాలని సూచిస్తే, సాయంత్రానికి జమ చేస్తున్నామని అధికారులు చెప్పారని పేర్కొన్నారు. ఆ సమయం కూడా తీసుకోకుండా రైతు మిల్లులో ధాన్యం ఇచ్చినట్టు నమోదు కాగానే వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమ కావాలని, ఇదంతా ఐటీ ద్వారా సాధ్యమని అన్నారు. త్వరలో వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొస్తున్నామని వెల్లడించారు. ప్రజలు న్యాయమైన సమస్యలను అందులో పోస్ట్ చేస్తే వాటి పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేతలు, అధికారుల చుట్టూ ప్రజలు తిరగడం కాకుండా వాళ్లే ప్రజలకు వద్దకు వెళ్తారని, ఆ విధమైన పాలనను త్వరలో తీసుకొస్తామని తెలిపారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు.





'పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ' పుస్తకాన్ని ఆసక్తిగా పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్

'పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ' పుస్తకం ఆవిష్కరణ

బాష, సాంస్కృతిక సంచాలకుడు మల్లికార్జునరావు రాసిన 'పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ' పుస్తకాన్ని చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. అమరావతి బౌద్ధస్థూపాన్ని మల్లికార్జునరావు చెక్కారని, ఆ ప్రాజెక్టును ఆయనే పూర్తి చేశారని చంద్రబాబు చెప్పారు. కార్యక్రమం అనంతరం పొట్టి శ్రీరాములు మేనల్లుడు వెంకటేశ్వర్లు, కుమారులు గుణిపూడి సుబ్రహ్మణ్యం, నరసింహారావు, హనుమంతరావును సీఎం, డిప్యూటీ సీఎం శాలువాలు కప్పి సత్కరించారు. ప్రకాశం జిల్లా మారెళ్ల గ్రామంలో పొట్టి శ్రీరాములు స్వయంగా నిర్మించిన ఆసుపత్రి ఉందని, అక్కడ ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయించాలని హనుమంతరావు విన్నవించగా సీఎం సానుకూలంగా స్పందించారు.

ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటులో పొట్టి శ్రీరాములు కీలక పాత్ర: గవర్నర్

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చారని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో ఆత్మార్పణ దినం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్... పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో ఆయన కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఆయన అత్యుత్తమ త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడని గవర్నర్ కొనియాడారు.

వల్లభాయ్ పటేల్ గొప్ప నాయకుడు

» సీఎం చంద్రబాబు



మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి ఉండవల్లిలోని నివాసంలో నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రయోజనాల విషయంలో ఎవరైనా సరే.. ఎలాంటి పరిస్థితులకూ లొంగకుండా ఉక్కు సంకల్పంతో ముందుకెళ్లాలని మార్గదర్శనం చేసిన గొప్ప నాయకుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని సీఎం చంద్రబాబు కొనియాడారు. వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఉండవల్లిలోని తన నివాసంలో పటేల్ చిత్రపటానికి సీఎం చంద్రబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉక్కుమనిషి వల్లభాయ్ పటేల్ బ్రిటీషు వారి మెడలు వంచి, ప్రజల మదిలో సర్దార్‌గా నిలిచిపోయారని మంత్రి నారా లోకేశ్ కొనియాడారు. పటేల్‌కు 'ఎక్స్' వేదికగా నివాళులర్పించారు.

సమన్వయంతో చేనేతకు చేయూత

» కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్



అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు గిరిరాజ్ సింగ్, సవిత

తిరుపతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేనేత కార్మికుల ఆర్థిక స్థితిని మెరుగురిచేందుకు ప్రాధాన్యమిస్తామని కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. మార్కెట్ నెట్‌వర్క్ విస్తరణ, చేనేత ఉత్పత్తులకు న్యాయమైన ధర నిర్ధారణకు ప్రయత్నిస్తామని అన్నారు. తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో ఆదివారం రాష్ట్ర చేనేత, జౌళ శాఖ మంత్రి ఎస్ సవితతో కలిసి.. చేనేత, ఆప్కో, టెక్స్‌టైల్స్ రంగాల అభివృద్ధిపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో చేనేత పరిశ్రమలు, టెక్స్‌టైల్స్ పార్కుల అభివృద్ధికి సుమారు రూ.1350 కోట్లతో ప్రతిపాదనలను అధికారులు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆ ప్రతిపాదనల పట్ల మంత్రి గిరిరాజ్ సానుకూలంగా స్పందించారు. దేశంలో చేనేత రంగాన్ని కాపాడి, అభివృద్ధి చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. చేనేత, హస్త కళలపై సంపద సృష్టించే అంశంపై సమీక్షించి అభివృద్ధి కృషి చేస్తామని, అలాగే టెక్స్‌టైల్స్, కలంకారి, హస్త కళల అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని పత్తి పంటను రక్షించడం, ఉత్పాదకత పెంచడం, జనపనార ఉత్పత్తులు, చేనేత శాఖలోని అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాల గురించి కేంద్ర మంత్రికి రాష్ట్ర మంత్రి సవిత వివరించారు.

జగన్ పాపం రైతులకు శాపం

(మొదటి పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్లు ఆపడం, రీసర్వే సమస్యలతో ఆదాయానికి భారీగా గండిపడింది. రీసర్వే జరిగిన గ్రామాల్లో సర్వే నంబర్లకు బదులు ల్యాండ్ పార్సిల్ (ఎల్‌పీ) నంబర్లను కేటాయించిన గత ప్రభుత్వం వాటిని ఆన్‌లైన్‌లో ఉంచింది. ఒక సర్వే నంబరులో పలు సబ్‌డివిజన్లు ఉన్నా చాలాచోట్ల అన్నింటికీ కలిపి ఒకే ఎల్‌పీ నంబరు కేటాయించారు. దాని పరిధిలో ఏ ఒక్కరు తమ భూమిని అమ్ముకోవాలన్నా ఆ నంబరు కింద ఉన్నవారందరి భూమి విస్తీర్ణం చూపిస్తోంది. పాత సర్వే నంబర్లపై రిజిస్ట్రేషన్లు చేయాలంటే వాటిని నిషేధిత జాబితాలో చూపుతున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత ఎల్‌పీ నంబరు నమోదు చేస్తే రిజెక్ట్ చేస్తోంది.

బ్యాంకు రుణాలకు తిప్పలు

రీసర్వే జరిగిన ప్రాంతాల్లో ప్రజలు భూమి తనఖా పెట్టి బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాలన్నా సాధ్యం కావట్లేదు. బ్యాంకులో రుణం పొందాలంటే పట్టాదారు పాస్‌బుక్‌తో పాటు 1బీ, అడంగల్ తప్పనిసరి. పాస్‌బుక్ ఉన్నా వెబ్‌ల్యాండ్ నుంచి 1బీ, అడంగల్ రావడం లేదు. రుణాల రీషెడ్యూల్‌లోనూ ఇదే సమస్య ఎదురవుతోంది. రీసర్వే తర్వాత ఒకటి కంటే ఎక్కువ సర్వే నంబర్లకు కలిపి ఒకే ఎల్‌పీ నంబరు కేటాయించడంతో ఇలాంటి కేసుల్లో హద్దులు నిర్ణయించడం అసాధ్యంగా మారింది. మూడు వేర్వేరు విలువలు కలిగిన భూములకు ఒకే ఎల్‌పీ నెంబర్ ఇచ్చారు. వీటికి విలువ కట్టే సమయంలో మూడు విలువలు కాకుండా ఆ భూముల్లో దేనికి ఎక్కువ విలువ ఉంటే దాన్నే నమోదు చేస్తున్నారు. దీనివల్ల తక్కువ విలువ కలిగిన భూములకూ ఎక్కువ విలువ చూపిస్తుండటంతో కొనుగోలుదారులు నష్టపోతున్నారు. ఇలాంటి రిజిస్ట్రేషన్లన్నీ ఇప్పుడు వివాదాస్పదమయ్యాయి. ఎల్‌పీ నంబర్లు కేటాయించిన అన్ని జిల్లాల్లోనూ రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలంటే సబ్‌డివిజన్ చేయించుకొని రమ్మని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకటి, రెండు జిల్లాల్లో మాత్రమే కొంతమేర సబ్‌డివిజన్లు జరుగుతున్నాయి. మిగతా జిల్లాల్లో ఈ ప్రక్రియ చాలా మందకొడిగా నడుస్తోంది.

ఖజానాకు గండి

ఈ ఏడాది భూముల రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.14,500 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. కానీ, ఇప్పుడు రూ.10,500 కోట్లు మాత్రమే వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి నవంబరు వరకు రిజిస్ట్రేషన్ల ఆదాయం దాదాపు రూ.7,000 కోట్లు మాత్రమే వచ్చింది. ఎల్‌పీ నంబర్ల సమస్యకు చెక్ పెట్టాలంటే సీసీఎల్‌ఏ, సర్వే సెటిల్‌మెంట్లు, రిజిస్ట్రేషన్ల శాఖ సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. పాత సర్వే నంబర్లతో కూడా రిజిస్ట్రేషన్లు చేసేలా నిబంధనలు సవరించేందుకు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సిద్ధం చేసిన ప్రతిపాదనలు సీఎం దగ్గర నుంచి సర్వే సెటిల్‌మెంట్ శాఖకు చేరాయి. ఇవి అమలైతే ప్రజలకు సమస్యలు తప్పడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయమూ పెరగనుంది.

ఎక్సైజ్‌లో కేసుల రగడ!

బెల్టుషాపులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దూకుడు

- సీసాపై హోలోగ్రామ్‌తో షాపుల ట్రాకింగ్
- దాని ఆధారంగా షాపుపైనా కేసు నమోదు
- రూ.5లక్షల జరిమానాతో లైసెన్సీల బెంబేలు
- ఇప్పటికే మార్జిన్లో సగమే వస్తోందని గగ్గోలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో మద్యం వ్యాపారం గందరగోళంగా మారింది. పాలసీ సమయంలో ఉత్సాహంగా పదుల సంఖ్యలో దరఖాస్తులు వేసిన వ్యాపారులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం ఇస్తామన్న మార్జిన్‌లో సగమే వస్తోందని ఓవైపు ఆందోళన చెందుతుంటే తాజాగా జరిమానాలు రూ.5 లక్షలకు పెంచడం వారిని బెంబేలెత్తిస్తోంది. వ్యాపారుల పరిస్థితి గమనించిన ఎక్సైజ్ శాఖ కేసుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది. కానీ అదే శాఖలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం మాత్రం దూకుడుగా వ్యవహరిస్తూ, నిత్యం దాడులతో బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ దాడుల్లో దొరికిన మద్యం సీసాలపై ఉన్న హోల్‌గ్రామ్ ఆధారంగా షాపులకు అనుసంధానం చేయడం లైసెన్సీలను మరింత భయపెడుతోంది. ఎక్కువ వ్యాపారం చేస్తే బెల్టుల పేరుతో కేసుల్లో చిక్కుకుంటామన్న భయం వారిలో పెరుగుతోంది. అలాగని వ్యాపారం తగ్గితే పెట్టుబడి వెనక్కి రాదని ఆందోళన చెందుతున్నారు. అక్రమాలను అరికట్టడంతోపాటు ఆదాయం తగ్గకుండా చూసే బాధ్యత కూడా ఎక్సైజ్ శాఖకు ఉంటుంది. బెల్టులపై దూకుడు పెంచితే అమ్మకాలు తగ్గిపోయి ఆదాయం పడిపోతుందేమోనన్న వాదన ఆ శాఖలో వినిపిస్తోంది. మొత్తంగా కేసులు పెట్టాలా? వద్దా? అనే సందిగ్ధంలో ఆ శాఖ ఉండగా, వ్యాపారం కష్టంగా మారిందని లైసెన్సీలు వాపోతున్నారు.



మార్జిన్‌లోనే అసలు చిక్కు

ఇష్యూ ప్రైస్‌పై 20శాతం మార్జిన్ వస్తుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఎక్సైజ్ శాఖ చివరికి అందులో సగమే లైసెన్సీలకు ఇస్తోంది. అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్(ఏఆర్‌ఈటీ)లో వాటా ఇవ్వకపోవడంతో తమకు దాదాపు 10శాతమే మార్జిన్ దక్కుతోందని వారు గగ్గోలుపెడుతున్నారు. దీనిపై కోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు. అదే సమయంలో బెల్టు షాపులు, ఎమ్మార్పీ ఉల్లంఘనలకు జరిమానాలను ప్రభుత్వం రూ.5లక్షలకు పెంచింది. రెండోసారి కేసు పెడితే ఏకంగా లైసెన్స్ రద్దుచేసేలా నిబంధనలు మార్చింది.

మంత్రి పేషీ నుంచే ఫోన్లు

కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చిన తర్వాత ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఈడీ) విభాగం దాదాపు 400 కేసులు పెట్టింది. అయితే కేసుల విషయంలో అధికారులపై రాజకీయ ఒత్తిడి పెరుగుతోంది. ఎక్కడైనా దాడులు చేసినా వెంటనే రాజకీయ నేతలు ఫోన్లు చేసి వాటిని అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర పేషీలోని ఓ అధికారి స్వయంగా ఫోన్లు చేసి కేసులు పెట్టొద్దని ఒత్తిడి చేస్తున్నారు. ఓవైపు అక్రమాలపై కేసులు పెట్టాలని సీఎం చెబుతుంటే, మంత్రి పేషీ నుంచే కేసులు వద్దని అడ్డుకోవడంతో అధికారులు ఏం చేయలేని పరిస్థితి ఏర్పడింది.

షాపులతో అనుసంధానం

బెల్టుషాపుల్లో పట్టుబడిన సీసాలపై ఉన్న హోల్‌గ్రామ్‌ను స్కాన్‌చేస్తే అది ఏ షాపులో విక్రయించారో తెలుస్తుంది. దాని ఆధారంగా ఆ షాపుపైనా అధికారులు కేసు నమోదు చేస్తున్నారు. దాన్ని పరిశీలించి కమిషనర్ షాపును సస్పెండ్ చేస్తే జరిమానా చెల్లించాలి. అదే ఉల్లంఘనకు రెండోసారి పాల్పడితే లైసెన్సు రద్దవుతుంది. అయితే నిబంధనల ప్రకారం ఒక వ్యక్తి ఒకసారి గరిష్ఠంగా మూడు సీసాలు కొనుగోలు చేయవచ్చని, అలా తీసుకెళ్లిన ఎవరైనా బెల్టుల్లో అమ్మితే దానికి తమను బాధ్యుల్ని చేయడమేంటని లైసెన్సీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మార్జిన్ సగమే వస్తోందని బాధపడుతుంటే, ఈ స్థాయిలో జరిమానాలు విధిస్తే ఇక వ్యాపారం ఎలా చేయాలని ప్రశ్నిస్తున్నారు.

వైసీపీ ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలి

» అసెంబ్లీకి హాజరుకాకుండా ఎన్నుకున్న ప్రజల్ని అవమానిస్తున్నారు: బుద్దా వెంకన్న



విజయవాడ(వన్‌టౌన్), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీకి హాజరుకాని 11మంది వైసీపీ ఎమ్మెల్యేలు తక్షణమే రాజీనామా చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు. విజయవాడలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరు కాకుండా ఎన్నుకున్న ప్రజలనే అవమానిస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీకి హాజరుకాకున్నా ప్రతినెలా వారి బ్యాంకు ఖాతాల్లో రూ.1.75 లక్షలు పడుతున్నాయని చెప్పారు. అయినా వారు ప్రజల గురించి ఏ ఒక్కరోజూ మాట్లాడలేదన్నారు. అసెంబ్లీకి హాజరుకాని వైసీపీ ఎమ్మెల్యేలను మేకలుగా పరిగణిస్తామని, వైసీపీలో 11మేకలు ఉన్నాయని, అవి ప్రజాధనాన్ని శుభ్రంగా మేస్తున్నాయని మండిపడ్డారు. వాటిలో పెద్ద మేక ఎప్పుడు ఏం మాట్లాడుతుందో తెలియదని, గతంలో సీఎంగా పనిచేసిన ఆ వ్యక్తికి ప్రజలు తగిన బుద్ధి చెప్పటంతో బెంగళూరుకు పారిపోయాడని విమర్శించారు. అసెంబ్లీకి హాజరుకాని వారికి ఎమ్మెల్యేలుగా కొనసాగే అర్హత లేదన్నారు. అసెంబ్లీకి హాజరుకాని వైసీపీ ఎమ్మెల్యేలు ప్రతినెలా తీసుకునే డబ్బులు వెనక్కు ఇచ్చేసి రాజీనామా చేయాలని తేల్చిచెప్పారు. జగన్‌కు ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకివెళ్లి ప్రజల తరపున మాట్లాడాలని డిమాండ్ చేశారు. అడ్రస్ లేకుండా పోయిన కొడాలి నాని, వల్లభనేని వంశీల ఆచూకీ తెలిపితే రూ.1,116 బహుమానంగా ఇస్తానని చెప్పారు. జగన్ విధానాలు, పోకడలు నచ్చక అనేక మంది వైసీపీని వీడుతున్నారని, త్వరలో వైసీపీ ఖాళీ అవటం ఖాయమన్నారు.

2027లోనే జమిలి ఎన్నికలు

» వైసీపీ శ్రేణులు సిద్ధం కావాలి: సాయి రెడ్డి

విశాఖపట్నం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలకు సంబంధించి పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందే అవకాశం ఉన్నందున 2027లో ఎన్నికలు తథ్యమని వైసీపీ ఎంపీ, ఆ పార్టీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త విజయసాయి రెడ్డి అన్నారు. ఇందుకోసం వైసీపీ శ్రేణులు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని పిలుపిచ్చారు. విశాఖలోని మద్దిలపాలెంలో వైసీపీ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వైసీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు, పోలీసు కేసులతో భయాందోళనకు గురిచేస్తోందని ఆరోపించారు., వాటికి భయపడొద్దని సూచించారు. తనపై కూడా లుకవుట్ నోటీసులు జారీచేశారని, అంత అవసరం లేదని, పిలిస్తే ఎప్పుడైనా సీఐడీ కార్యాలయానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానని, ముందస్తు బెయిల్‌కు కూడా దరఖాస్తు చేసుకోనని స్పష్టం చేశారు. పార్టీ నుంచి కొంత మంది నాయకులు వెళ్లిపోతున్నా ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. సమావేశంలో శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ, అరకు ఎంపీ తనుజారాణి, మాజీ మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.



పాలకొల్లులో 'సేవ్ ద గర్ల్ చైల్డ్' 2కే రన్ లో పాల్గొన్న మంత్రులు అనిత, రామానాయుడు

ఆడబిడ్డల రక్షణ సామాజిక బాధ్యత

- ఆపదలో ఉన్నవారిని రక్షించడమే హీరోయిజం: హోం మంత్రి అనిత

పాలకొల్లు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ఆడపిల్లలను రక్షించడమే నిజమైన హీరోయిజమని, డ్రగ్స్ తీసుకుంటేనో, మద్యం తాగితేనో, స్మగ్లింగ్ చేస్తేనో కాదన్న విషయాన్ని యువత గ్రహించాలని హోంమంత్రి వంగలపూడి అనిత హితవు పలికారు. 'ఆడ పిల్లలను రక్షించుకుందాం.. భ్రూణ హత్యలు నిర్మూలిద్దాం.. దాడులు, అత్యాచారాలు, హత్యలను అరికడదాం' అనే నినాదంతో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఆదివారం 2కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. పుట్టిన తర్వాత ఆడబిడ్డ రక్షణను కూడా ఒక సామాజిక బాధ్యతగా తీసుకొని అందరూ ముందుకు వెళ్లాలన్నారు. ఎందుకంటే కొంతమంది యువకులు డ్రగ్స్‌కు బానిసలై ఆడపిల్లలను ఇబ్బందులను పెడుతున్నారన్నారు. డ్రగ్స్, మద్యం తీసుకుని అఘాయిత్యాలకు పాల్పడితేనే హీరోలం అనుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. ఆడపిల్లల రక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలిగి హీరోలు అనిపించుకోవాలని హితవు పలికారు. ఆడపిల్లల రక్షణ పేరుతో పాలకొల్లులో ప్రతి రెండేళ్లకోసారి ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'సేవ్ ద గర్ల్ చైల్డ్ 2కే రన్' కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ ఆదాయానికి గండి

- రూ.293 కోట్ల నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టి
- కీలక వ్యక్తిని అరెస్టు చేసిన విశాఖ డీజీజీఐ
- మరో 22 మంది నిందితుల గుర్తింపు



విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి కొట్టేలా నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టిస్తున్న వ్యక్తుల్లో కీలక నిందితుడిని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్(డీజీజీఐ) విశాఖపట్నం జోనల్ అధికారులు అరెస్టు చేశారు. నిందితుడిని కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మనోహర్(34)గా గుర్తించారు. ఇతడికి సహకరించిన వారిలో ముగ్గురు ఏపీలో ఉండగా మరో 19 మంది ఇతర ప్రాంతాలకు చెందిన వారిగా నిర్ధారించారు. కడప, బెంగళూరు, హైదరాబాద్, కర్నూలు కేంద్రాలుగా చేసుకుని మోసాలకు పాల్పడినట్టు అధికారుల విచారణలో తేలింది. వ్యాపార లావాదేవీల కోసం బోగస్ ఖాతాలు సృష్టించి, వాటి నుంచి రూ.293 కోట్ల విలువైన నకిలీ ఇన్‌వాయిస్‌లు తయారు చేశారు. పలు కంపెనీలతో నిర్వహించిన వ్యాపారంలో భాగంగా రూ.30 కోట్ల నకిలీ ఇన్‌వాయిస్‌లు బదిలీ చేసి ఇన్‌పుట్ క్రెడిట్‌గా వాడుకున్నారు. దీంతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.30 కోట్లను నకిలీ ఇన్‌వాయిస్‌ల ద్వారా ఎగవేసినట్టు అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. దీంతో నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించిన వ్యవహారంలో మనోహర్‌ను అరెస్టు చేసి విశాఖపట్నంలో ఎకనమిక్ అఫైర్స్ కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశించారు. కాగా, విశాఖ జోన్ పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.84 కోట్ల విలువైన నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించి మోసం చేసిన 79 కేసులకు సంబంధించి విచారణ కొనసాగుతోందని జీఎస్టీ ప్రిన్సిపల్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఎంఆర్‌ఆర్ రెడ్డి తెలిపారు.

తినే మాంసంలో యాంటీబయాటిక్స్



(మొదటి పేజీ తరువాయి)

114 మిల్లీగ్రాముల మేర యాంటీబయాటిక్స్ ఆనవాళ్లున్నాయి.

ఎందుకు వాడుతారు?

మనదేశంలో పాడి రైతుల్లో అవగాహనారాహిత్యంతో పశువులకు అధికంగా యాంటీబయాటిక్స్ ఇస్తుంటారని వెటర్నరీ డాక్టర్లు చెబుతున్నారు. ఒక కోడిపిల్ల 40 రోజులకే ఎదిగి మార్కెట్‌కు రావాలంటే.. యాంటీబయాటిక్స్ ఇంజక్షన్ ఇవ్వక తప్పదని ఓ కోళ్లఫారం యజమాని చెప్పారు. దీని వల్ల కోడి బరువు పెరగదని, కోడిలో ఆకలి పెరిగి.. ఎక్కువగా తిని, త్వరగా లావు అవుతుందన్నారు. పైగా.. కోడి ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా ఉంటుందన్నారు. ఇక చాలా చోట్ల పశువుల శాలలు అపరిశుభ్రంగా ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో పశువులు తరచూ జబ్బు చేస్తుంటాయి. దాంతో.. పాడి రైతులు వాటికి యాంటీబయాటిక్స్ ఇంజక్షన్లు ఇస్తుంటారు.



మటన్‌లో ఎక్కువ

భారత్‌లో ప్రతి కిలో మటన్(గొర్రె/మేక మాంసం)లో యాంటీబయాటిక్స్ ఆనవాళ్లు 243 మి.గ్రా. మేర ఉన్నట్లు ఈ పరిశోధన జరిపింది. ఆ తర్వాతి స్థానాల్లో పందిమాంసం(173 మి.గ్రా.), గొడ్డుమాంసం(60మి.గ్రా.), కోడిమాంసం/చికెన్(35మి.గ్రా.) ఉన్నాయి. యాంటీబయాటిక్స్ ఆనవాళ్లున్న మాంసాన్ని తిన్న మానవుల ఆరోగ్యంపై దుష్ప్రభావాలుంటాయని పరిశోధకులు హెచ్చరించారు. పశ్చిమబెంగాల్‌లోని పశు, మత్స్య విజ్ఞాన శాస్త్ర విశ్వవిద్యాలయం కూడా 'మాంసం ఉత్పత్తుల్లో యాంటీబయాటిక్స్ అవశేషాలు' పేరుతో ఓ పరిశోధన పత్రాన్ని ప్రచురించింది. జాతీయ మాంసం పరిశోధన శాస్త్రవేత్తలు, వెటర్నరీ పరిశోధన సంస్థ, భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు దీనిలో పాల్గొన్నారు. పశువులకు ఇచ్చే యాంటీబయాటిక్స్.. వాటిని తినే మానవుల శరీరంలోకి ప్రవేశిస్తాయని గుర్తించారు. పశువులకు యాంటీబయాటిక్స్ ఇచ్చిన 14 రోజుల వరకు వాటి మాంసాన్ని వినియోగించకూడదని సూచించారు. "మేము చికెన్‌లో సిప్రోఫ్లాక్సాసిన్, ఎన్రోఫ్లాక్సాసిన్, డాక్సీసైక్లిన్, స్ట్రెప్టోమైసిన్ లాంటి యాంటీబయాటిక్స్ అవశేషాలను చూశాం. పశువుల్లో టెట్రాసైక్లిన్ యాంటీబయాటిక్స్ అవశేషాలను గుర్తించాం" అని పరిశోధకులు వెల్లడించారు.

నిజానికి పశువుల కొట్టాలను పరిశుభ్రంగా ఉండేలా చూసి, సరిపడా వెంటిలేషన్ ఏర్పాట్లు చేస్తే.. ఈ సమస్యలను అధిగమించవచ్చని వెటర్నరీ డాక్టర్లు చెబుతున్నారు. 2010లో వెలువడిన ఓ అధ్యయనం ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న యాంటీబయాటిక్స్‌లో 70% పశువులకే వినియోగిస్తున్నారు. "పలు చోట్ల పాడిరైతులు ఎక్కువ పాల ఉత్పత్తికి పశువులకు ఆక్సీటోసిన్‌లు ఇస్తుంటారు. ఆ పాలను తాగే ఆడపిల్లలు 9-10 సంవత్సరాల వయసులోనే రజస్వల అవుతుంటారు. కోళ్లు, గొర్రెలకు కూడా ఆక్సీటోసిన్ ఇస్తుంటారు" అని పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ వెటర్నరీ వైద్యుడు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. యాంటీబయాటిక్స్ ఇంజక్షన్లు ఇవ్వడం వల్ల కోళ్లు, గొర్రెలు/మేకలు త్వరగా పెరుగుతాయనేది అపోహేనని మరో వెటర్నరీ వైద్యుడు డాక్టర్ మల్లేశ్ చెప్పారు.

మానవులకు ప్రమాదమే

మాంసంలోని యాంటీబయాటిక్స్ అవశేషాలు మానవుల్లో చేరితే.. దీర్ఘకాలంలో ప్రమాదకరంగా మారుతాయని కిమ్స్ ఆస్పత్రిలో ఇంటర్నల్ మెడిసన్ స్పెషలిస్ట్ డాక్టర్ శివరాజ్ చెప్పారు. పశు, మత్స్య విజ్ఞానశాస్త్ర విశ్వవిద్యాలయంలోని లైవ్ స్టాక్ ఉత్పత్తుల విభాగం పరిశోధనలో కూడా.. మాంసంలోని యాంటీబయాటిక్స్ వల్ల మానవుల్లో జీర్ణక్రియ సమస్యలు, కొన్నిరకాల క్యాన్సర్లు, నరాలకు సంబంధించిన సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందని తేలింది. మాంసంలో ఉండే బీటా లాక్టమ్స్ కారణంగా చర్మ వ్యాధులు వస్తాయని, టెట్రాసైక్లిన్ అవశేషాల కారణంగా గర్భంలోని పిండం సరిగా ఎదగక పోవడం, పిల్లల పళ్లపై మరకలు, పేగులలో సమస్యలు రావొచ్చని నిర్ధారణ అయ్యింది. పశువులు, కోళ్లలో వాడే పలు రకాల యాంటీబయాటిక్స్ వల్ల పలురకాల క్యాన్సర్లు కూడా వచ్చే ప్రమాదముందని పరిశోధకులు హెచ్చరించారు.



ఈ జాగ్రత్తలు పాటించాలి

- మన రాష్ట్రంలో మాంసం వినియోగం ఎక్కువే..! చాలా మందికి ముక్కలేనిదే ముద్ద దిగదు. వేడుక ఏదైనా.. ముక్క ఉండాల్సిందే..! అయితే.. మాంసంలో యాంటీబయాటిక్స్ నేపథ్యంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు
- పాడి రైతులు పశువుల కొట్టాలు/పాకలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. తగినంత వెంటిలేషన్ ఉండేలా జాగ్రత్తపడాలి. దీని వల్ల పశువులు ఆరోగ్యంగా ఉంటాయి
- పశువుల మేతలో యాంటీబయాటిక్స్ గ్రోత్ ప్రమోటర్లను వాడొద్దని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆఫ్ పౌల్ట్రీ ఫీడ్ చేసిన హెచ్చరికలను పాటించాలి
- మాంసాన్ని వండడం.. శీతలీకరించే విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువగా ఉడికించడం ద్వారా బీటా లాక్టమేజ్, టెట్రాసైక్లిన్ వంటి యాంటీబయాటిక్స్ ప్రభావాన్ని తగ్గించవచ్చు
- ప్రభుత్వాలు కూడా ర్యాండమ్‌గా మాంసంలో యాంటీబయాటిక్స్ అవశేషాలపై పరీక్షలు నిర్వహించాలి

మైక్రోబియామ్‌పై ప్రభావం చూపుతున్నాయి



మాంసంలో యాంటీబయాటిక్స్ వల్ల మానవులకు కచ్చితంగా నష్టం జరుగుతుంది. పశువులు/కోళ్లకు ఇచ్చిన యాంటీబయాటిక్స్ ఏమిటనేది తెలిస్తే.. ప్రభావం ఎంతవరకు ఉంటుందో చెప్పవచ్చు. ఉదాహరణకు అజిత్రోమైసిన్ ప్రభావం వారాలు, నెలల వరకు ఉంటుంది. యాంటీబయాటిక్-మెటబాలిజాన్ని బట్టి ఈ ప్రభావం ఆధారపడి ఉంటుంది. ప్రధానంగా యాంటీబయాటిక్స్ రెసిస్టెన్స్ ముప్పు పొంచి ఉంటుంది. అయితే.. తెలంగాణలో మాంసం వినియోగం ఎక్కువే. కానీ, ఇక్కడ యాంటీబయాటిక్స్ రెసిస్టెన్స్ ప్రభావం ఎక్కువగా ఉందా? అంటే.. శాస్త్రీయ నిరూపణలు లేవు. మాంసంలో ఉండే యాంటీబయాటిక్స్ కారణంగా.. గట్ మైక్రోబియామ్(కడుపులో ఉండే మంచి బ్యాక్టీరియా)పై ప్రతికూల ప్రభావం ఉంటుంది. పలు రుగ్మతలు, మధుమేహం వంటి వ్యాధులకు ఇది కూడా ఓ కారణంగా చెప్పవచ్చు.

- డాక్టర్ శివరాజ్, ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్, కిమ్స్

పరిమితంగానే తీసుకోవాలి



తీసుకునే ఆహారంపై పరిమితి ఉండాలి. మాంసంతో మన శరీరానికి అవసరమైన ప్రోటీన్ సహా కొన్ని పోషకాలు లభిస్తాయి. అయితే.. ఎక్కువగా తీసుకుంటే ప్రమాదం పొంచిఉంటుంది. మటన్ వినియోగం తక్కువగా ఉండాలి. చికెన్ రోజుకు గరిష్ఠంగా 50 గ్రాములు, వారానికి 200 గ్రాములకు పరిమితం చేసుకోవాలి. మాంసం వండే పద్ధతుల్లో మార్పులు అవసరం. యాంటీబయాటిక్స్ అవశేషాలు తొలిగిపోయేలా.. పోషకాలు ఏమాత్రం లోపించకుండా.. స్టీమ్డ్, గ్రిల్డ్ లాంటి పద్ధతులు ఒకవిధంగా మంచివే. బార్బిక్యూ లాంటి విధానాలు సరికాదు.

- డాక్టర్ ఎం.గాయత్రి, అపోలో ఆస్పత్రి డైటీషియన్

అమెరికాలో తెనాలి యువతి దుర్మరణం



వందన పరిమళ (ఫైల్)

- రెండేళ్ల క్రితం అగ్రరాజ్యానికి.. ఎంఎస్ పూర్తి
- ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా రోడ్డు ప్రమాదం
- తీవ్ర గాయాలతో మృతిచెందిన వందన పరిమళ
- మరో ఇద్దరు స్నేహితులకు కూడా గాయాలు
- తెనాలిలో విషాదం.. శోకసంద్రంలో తల్లిదండ్రులు
- స్వదేశానికి తీసుకువచ్చేందుకు పెమ్మసాని, మనోహర్ హామీ

తెనాలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నో కలలతో అమెరికాలో అడుగు పెట్టింది. కష్టపడి చదివి ఎంఎస్ పూర్తి చేసింది. త్వరలోనే ఉద్యోగం కూడా సాధించి అందరూ గర్వపడేలా చేస్తానని తల్లిదండ్రులకు మాటిచ్చింది. ఇంతలోనే రోడ్డు ప్రమాదం ఆమె కలలన్నింటినీ దూరం చేసింది. అమెరికాలోని టెన్నిసీ రాష్ట్రం మెంఫిస్ నగరంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుంటూరు జిల్లా తెనాలికి చెందిన యువతి నాగశ్రీ వందన పరిమళ (26) దుర్మరణం పాలైంది. ఈ ప్రమాదంలో ఆమెతో ఉన్న ఇద్దరు స్నేహితులు పవన్, నిఖిత్ కూడా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. తెనాలికి చెందిన గణేష్, రమాదేవి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వారిలో ఒకరైన నాగశ్రీ వందన పరిమళ 2022లో అమెరికా వెళ్లి మెంఫిస్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తిచేసింది. తన చదువు పూర్తయిందని, త్వరలోనే మంచి ఉద్యోగం సాధించి మిమ్మల్ని బాగా చూసుకుంటానని తల్లిదండ్రులతో చెప్పింది. త్వరలోనే ఒకసారి ఇంటికి వచ్చి వెళతానని తెలిపింది. అలా చెప్పి కొన్ని గంటలైనా గడవకముందే రోడ్డు ప్రమాదంలో మరణించింది. యూనివర్శిటీ నుంచి కారులో ఇంటికి తిరిగి వెళుతుండగా ఎదురుగా వేగంగా వచ్చిన ట్రక్ ఢీ కొట్టటంతో ఆమె మరణించినట్టు అక్కడి అధికారులు చెప్పారని కుటుంబసభ్యులు తెలిపారు. కారులో మొత్తం ముగ్గురు ఉన్నట్టు తెలిసిందన్నారు. తమ కుమార్తె మృతదేహం ఎనిమిది రోజుల్లో భారత్‌కు రావొచ్చని అక్కడి అధికారులు చెప్పారని వివరించారు. మరణవార్త తెలిసి.. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్... పరిమళ తల్లిదండ్రులతో మాట్లాడారు. మృతదేహాన్ని త్వరగా తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని కుటుంబసభ్యులు వివరించారు. పరిమళ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు అమెరికాలోని తానా ప్రతినిధులు ప్రయత్నాలు చేస్తున్నారని, మంత్రి లోకేశ్ చొరవ చూపితే మరింత త్వరగా వచ్చే అవకాశం ఉందని గణేష్, రమాదేవి దంపతులు వేడుకుంటున్నారు.

ఈ ఏడాది ముగ్గురు తెనాలి వాసులు మృతి

ఇదిలా ఉండగా... కొద్ది రోజుల వ్యవధిలోనే అమెరికాలో తెనాలికి చెందిన ముగ్గురు విద్యార్థులు మరణించడం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది జూలైలో ఇద్దరు మరణించారు. తెనాలి ఐతానగర్‌కు చెందిన జెట్టి హారిక (25) ఫుడ్ సైన్స్‌లో మాస్టర్స్ చేసేందుకు వెళ్లింది. ఆమె కూడా యూనివర్శిటీ నుంచి కారులో ఇంటికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. ఐతానగర్‌కే చెందిన తాడిబోయిన రవితేజ (28) కూడా అమెరికాలో చదువుకునేందుకు వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు స్విమ్మింగ్ పూల్‌లో జారిపడి మరణించాడు.

ముగ్గురిని నరికేశారు!

- కాకినాడ జిల్లా వేట్లపాలెంలో దారుణం

సామర్లకోట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో దారుణం జరిగింది. ఇంటి నిర్మాణం విషయమై రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఒక వర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కత్తిపోట్లకు గురై దుర్మరణం చెందారు. మరో ఏడుగురు తీవ్రగాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సామర్లకోటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుకగల దళిత చెరువు అనే ప్రాంతంలో కార్ధాల పండు అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టాడు. అయితే తమ స్థలంలో కొంత ఆక్రమించి నిర్మాణం చేపట్టారంటూ బచ్చుల వర్గీయులు పంచాయతీకి, గ్రామ పెద్దలకు ఫిర్యాదు చేశారు. 3నెలలుగా ఈ వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఇంటి నిర్మాణంలో భాగంగా శ్లాబ్ వేస్తుండగా కార్ధాల వర్గీయులపై బచ్చుల కుటుంబీకులు ఒక్కసారిగా కత్తులు, గొడ్డళ్లతో దాడి చేశారు. వీరిలో కార్ధాల ప్రకాశరావు(55) తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో ఐదుగురిని సామర్లకోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ కార్ధాల చంద్రరావు(60) మృతి చెందాడు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించిన కార్ధాల ఏసుబాబు(45) కూడా మృతి చెందాడు. కార్ధాల పండు, కార్ధాల దావీదు, కార్ధాల బాబీతోపాటు మరో నలుగురు తీవ్ర గాయాలతో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, సామర్లకోట సీఐ శ్రీకృష్ణభగవాన్ సందర్శించారు. సామర్లకోట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

8 రోజుల్లో 62,732 ఫిర్యాదులు

- రెవెన్యూ సదస్సుల్లో వినతుల వెల్లువ


(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రెవెన్యూ సదస్సులలో ప్రజల నుంచి ఫిర్యాదులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. ఈ సదస్సులు ప్రారంభమైన 6వ తేదీ నుంచి 13 వరకు... అంటే 8 రోజుల వ్యవధిలోనే 62,732 వినతులు వచ్చాయి. ఇందులో 32శాతం భూముల కబ్జా, దురాక్రమణ, రికార్డుల తారుమారుకు సంబంధించినవి ఉన్నాయి. మరో 45 శాతం భూముల సర్వేలో జరిగిన పొరపాట్లపై ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ సదస్సుల్లో మొత్తం 2.63 లక్షల మంది పాల్గొన్నారు. గత జగన్ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు విన్నపాల రూపంలో వెల్లువెత్తుతున్నాయి. దీంతో రెవెన్యూ శాఖ ఒకింత ఆశ్చర్యానికి, మరోవైపు ఆందోళనకు గురవుతోంది. రెవెన్యూ క్షేత్రస్థాయి యంత్రాంగం చేసిన తప్పులు, రీ సర్వేలో పొరపాట్ల వల్లే భారీగా భూ సమస్యలు తెచ్చిపెట్టాయన్న విషయం ఆ శాఖకు బోధపడింది. కూటమి ప్రభుత్వం రాగానే మదనపల్లె ఫైల్స్ ఉదంతం జరిగింది. అక్కడి నుంచి వరుసగా ప్రభుత్వానికి ప్రజా విన్నపాలు వస్తూనే ఉన్నాయి. టీడీపీ, జనసేన పార్టీ ఆఫీసులు, గ్రామ కార్యదర్శి కార్యాలయం నుంచి 1.74 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 73 శాతం పరిష్కరించినట్లుగా అధికారులు నివేదికలు ఇచ్చారు. ఇందులో రెవెన్యూశాఖ పరిష్కరించాల్సినవే 67 వేలు ఉండగా, ఇందులో 83 శాతం పరిష్కరించినట్లుగా చెప్పింది. పరిష్కరించామని అధికారులు నివేదిస్తున్న అంశాలే మళ్లీ రెవెన్యూ సదస్సుల్లో విన్నపాల రూపంలో ప్రభుత్వానికి చేరుతున్నాయి. అంటే పరిష్కారం అంతా మాయ అన్నమాట. రెవెన్యూ శాఖ ఇప్పుడైనా ప్రజా విన్నపాలు హేతుబద్ధంగా పరిష్కరిస్తుందా? లేక గతంలో మాదిరి మిథ్యగానే మారుస్తుందా? అన్న అనుమానాలు లేకపోలేదు. ప్రజలకు భూములు, ఆస్తులే జీవనాధారం. వాటిపై అధికారులే సమస్యలు సృష్టిస్తే తమ పరిస్థితి ఏమిటని బాధితులు వాపోతున్నారు. గతంలో మాదిరి సీఎంకు తప్పుడు నివేదికలు ఇవ్వకుండా ఇప్పటికైనా పద్ధతిగా పరిష్కరించాలని నిపుణులు కోరుతున్నారు. సమస్యలు పరిష్కారం అయ్యాయో లేవో ఫిర్యాదులు నేరుగా ప్రభుత్వానికి తెలియజేసే విధానం అందుబాటులోకి తీసుకురావాలని సీనియర్ అధికారులు సూచిస్తున్నారు.

28 వరకు ప్రజావేదిక షెడ్యూల్

టీడీపీ కేంద్ర కార్యాలయంలో 16 నుంచి 28 వరకు జరిగే ప్రజావేదికలో పాల్గొనే నేతల వివరాలను పార్టీ కార్యాలయం ప్రకటించింది. 16న మాజీ మంత్రులు జవహర్, దేవినేని ఉమా, ఏపీఎల్ఐడీసీ పిల్లి మాణిక్యాలరావు వినతులు స్వీకరిస్తారని వెల్లడించింది. 17న ప్రభుత్వ సలహాదారు షరీఫ్, పొలిట్‌బ్యూరో వర్ల రామయ్య, సీడాప్ చైర్మన్ దీపక్‌రెడ్డి, 18న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, జీడబ్ల్యూడీసీ చైర్మన్ సురేంద్ర, 19న మండలి చీఫ్ విప్ అనురాధ, ఆయిల్‌ఫెడ్ చైర్మన్ బాబ్జీ, 20న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి సవిత, ఎస్టీ, వీసీడబ్ల్యూఏసీ చైర్మన్ రఘురామరాజు, 21న పల్లా, మంత్రి పార్థసారథి, ఆక్వా అథారిటీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, 23న ఎమ్మెల్యే రామారావు, శాప్ చైర్మన్ రవినాయుడు, కుడాచైర్మన్ వెంకటేశ్వర్లు, 24న మంత్రి సంధ్యారాణి, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, ఎస్‌వోపీసీఏ చైర్మన్ దేవదత్, 26న మంత్రి జనార్దన్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో రెడ్డి సుబ్రహ్మణ్యం, ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్ గోవింద సత్యనారాయణ, 27న పల్లా, మంత్రి నారాయణ, రుడా చైర్మన్ వెంకట రమణచౌదరి, 28న పల్లా, మంత్రి రామనారాయణరెడ్డి, ఎస్టీసీఎఫ్‌సీ చైర్మన్ శ్రీనివాసులు అర్జీలు స్వీకరించనున్నారు.

పోలవరం మళ్లీ కళకళ



- కార్మికులు, వాహనాల సందోహం
- పనుల పూర్తి దిశగా చంద్రబాబు అడుగులు
- నేడు ప్రాజెక్టు ప్రాంతానికి సీఎం
- పనుల కార్యాచరణ ప్రకటించే చాన్సు

ఏలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో ధ్వంసమైన పోలవరం ప్రాజెక్టు.. చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావడంతో మళ్లీ కొత్త కళ సంతరించుకుంది. ధ్వంసమైన కట్టడాల పునర్నిర్మాణానికి ఆయన నడుం బిగించారు. కేంద్రంలోని మోదీ ప్ర భుత్వంలో భాగం కావడంతో పాటు పోలవరం పనుల కోసం ముందస్తు నిధులు సాధించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.5 వేల కోట్లు ఖర్చుచేయాల్సి ఉ ందని.. రాష్ట్రప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగోనందున అడ్వాన్సుగా ఈ మొత్తం ఇవ్వాలని ప్రధాని మోదీని, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో ముందస్తుగా 2,300 కోట్లను కేంద్ర ఆర్థిక, జలశక్తి శాఖలు విడుదల చేశాయి. వీటిలో 75 శాతం నిధులు ఖర్చుపెడితే మిగతా రూ.2,700 కోట్లు ఇస్తామని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో అతుల్ జైన్ ఇటీవల వీడియో కాన్ఫరెన్స్‌లో స్పష్టం చేశారు. దీంతో ఎట్టి పరిస్థితుల్లోనూ జనవరి 2న కొత్త డయాఫ్రం వాల్ పనులు మొదలుపెట్టాలని సీఎం ఈ నెల 11న జరిగిన సమీక్షలో కాంట్రాక్టు సంస్థలు, రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. ఇంకో వైపు.. వాల్ పనులు ప్రారంభించడానికి వీలుగా గైడ్‌వాల్స్ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం రావడంతో పోలవరం ప్రాజెక్టుకు మళ్లీ కళ వచ్చింది. నిర్మాణ ప్రాంతంలో కార్మికులు, వాహనాల సందడి కనిపిస్తోంది. వచ్చే ఏడాది నవంబరు నాటికి వాల్ పనులు పూర్తి చేసేందుకు అనువైన పరిస్థితులు సృష్టించారు. మట్టి, రాతి నాణ్యత పరిశీలన, ప్లాట్‌ఫాం పనులు, మట్టి తరలింపు పనులు వేగం పుంజుకున్నాయి. గతంలో వాల్ నిర్మించినప్పుడు నది అంతర్భాగంలో 136 అడుగుల వరకు తవ్వారు. ఇప్పుడు 150 అడుగులు మేర తవ్వుతున్నట్లు సమాచారం. పాత వాల్ నిర్మించిన జర్మన్ బావర్ సంస్థే కొత్త వాల్ పనులు చేపడుతోంది. ప్రధాన డ్యాం నిర్మాణంలో డయాఫ్రం వాల్ అత్యవసరం. నీటి ఊట ప్రాజెక్టులో చేరకుండా ఇది అడ్డుకుంటుంది. ఈ కారణంగానే వరదలతో దెబ్బతిన్న పాత వాల్‌కు ప్రత్యామ్నాయంగా ఎలాంటి రాజీ లేకుండా కొత్త వాల్ నిర్మాణం చేపడుతున్నారు. 2027 జూలైకల్లా దీని పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సాధ్యమైనంత వరకు గడువులోపే పూర్తి చేయాలని సీఎం సూచించారు. జల విద్యుత్ కేంద్రం పురోగతిపైనా దృష్టి పెట్టారు. ఇప్పటికే పవర్ హౌస్ నిర్మాణంలో టర్బన్ స్టేరింగ్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ప్రాజెక్టు క్షేత్రంలో జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఆయన సోమవారం ఇక్కడకు రానున్నారు. పనుల పురోగతిపై ఇంజనీర్లతో సమీక్షించనున్నారు. ప్రాజెక్టు ప్రాంతంలోని గ్యాప్-1, గ్యాప్-2 వైబ్రో కంపాక్షన్ పనులను, డీవాల్ నిర్మాణ పనులను స్వయంగా పరిశీలిస్తారు. మధ్యాహ్నం అతిథి గృహంలో ఇంజనీరింగ్ అధికారులు, నిర్మాణదారులతో సమావేశమవుతారు. గడువులోపు ప్రాజెక్టు పూర్తి కావడానికి పనుల కార్యాచరణను ఈ సందర్భంగా ఆయన ప్రకటించే అవకాశం ఉంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.